ఈనాడు

కరీంనగర్ 13-9-2019 శుక్రవారం సిటీ సంపుటి 46 సంచిక 34

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 14+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

నియోజకవర్గాలకు
నిధుల్లేవ్!

కేటాయించిన రూ.120 కోట్లు పాత పనులకే చెల్లు

ఈసారి ప్రతిపాదించే పరిస్థితి లేదు

2లో

షకీల్
కలకలం

భాజపా ఎంపీ అర్వింద్‌తో భేటీ

అసంతృప్తే కారణమంటూ ప్రచారం

రాజకీయాలే వద్దంటూ వైరాగ్యం

తెరాసలోనే ఉంటానని రాత్రికి ప్రకటన.. కేటీఆర్‌తో భేటీ

6లో

ఇది ట్రైలరే..
సినిమా ముందుంది

అవినీతి, ఉగ్రవాదం, కశ్మీర్‌లపై కీలక నిర్ణయాలు

వంద రోజుల పాలనలో వేగవంతమైన చర్యలు

ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు

11లో

గంగమ్మ ఒడికి గణనాథుడు

భక్త జన సందోహం మధ్య గురువారం నిమజ్జనానికి బయలు దేరిన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ద్వాదశాదిత్య మహాగణపతి

5లో

వారంలో కొత్త కమిటీలు

శాసన కమిటీల నియామకంపై ముఖ్యమంత్రి కేసీఆర్ కసరత్తు

19 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఛైర్మన్లుగా అవకాశం

ప్రజాపద్దుల సంఘం ఛైర్మన్ పదవిని కోరుతున్న మజ్లిస్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో శాసన కమిటీల నియామకానికి రంగం సిద్ధమైంది. కమిటీలకు ఛైర్మన్లు, సభ్యుల ఎంపికపై ముఖ్యమంత్రి కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 22 వరకు శాసనసభ సమావేశాలు జరగనుండగా.. 16 లేక 18న కమిటీలకు ఛైర్మన్లు, సభ్యులను ప్రకటించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర శాసనసభ, మండలిలో మొత్తం 21 కమిటీలు ఉంటాయి. వీటిలో సౌకర్యాలు, పర్యావరణ కమిటీలకు శాసనసభాపతి ఛైర్మన్‌గా ఉంటారు. మిగిలిన వాటికి ఛైర్మన్లను, సభ్యులను ముఖ్యమంత్రి ఎంపిక చేసి సభాపతికి పేర్లను పంపనున్నట్లు తెలిసింది.

నియామకాలకు ప్రాధాన్యం

గత డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరిగి తెలంగాణలో రెండోసారి తెరాస ప్రభుత్వం ఏర్పాటు కాగా.. అప్పటి నుంచి కమిటీల నియామకం జరగలేదు. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని పదవులను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా శాసనసభ, మండలి కమిటీలను ప్రకటించబోతున్నారు. తెరాసలో పదవుల కోసం ఏర్పడిన ...మిగతా 2లో

డెంగీ నివారణ ఇలాగేనా!

ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

వచ్చే నాలుగు నెలల్లో దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? వచ్చే ఏడాది ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఏం చర్యలు తీసుకోబోతున్నారు? డెంగీకి ఎన్ని ప్రైవేటు ఆసుపత్రులు చికిత్స అందిస్తున్నాయి? ఎంతమంది రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించారు? అక్కడి సౌకర్యాల పరిస్థితి ఏమిటి? ఈ వివరాలన్నీ తెలియజేయండి.

– రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

2లో

మాస్టారూ.. ఎప్పుడొస్తారు?

సర్కారు బడుల్లో 20 వేల ఉపాధ్యాయ ఖాళీలు

పెరుగుతున్న విద్యావాలంటీర్లు

2017 నాటి టీఆర్టీ భర్తీ ప్రక్రియ పూర్తయ్యేదెన్నడో!

ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు నిపుణుల కొరత

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య భారీగా పెరుగుతోంది. ప్రాథమిక పాఠశాలలే కాదు కీలకమైన ఉన్నత పాఠశాలల్లోనూ సబ్జెక్టు నిపుణులను భర్తీ చేయడం లేదు. రెండేళ్ల క్రితం భర్తీకి ప్రకటన జారీ చేసినా ఇప్పటికీ 20 శాతం ఖాళీలనే నింపారు. కారణాలు ఏమైనా సర్కారు పాఠశాలలు బోధనా సిబ్బంది లేక వెలవెలబోతున్నాయి. ఏటేటా ఖాళీల సంఖ్య పెరుగుతుండటంతో విద్యావాలంటీర్ల (వీవీ) సంఖ్య సైతం అధికమవుతోంది. తాజా అంచనా ప్రకారం 20 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉంటాయని సంఘాల అంచనా. విద్యాశాఖ మాత్రం విద్యాహక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలో ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగానే ఉందని పేర్కొంటోంది. రాష్ట్రంలో 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 1.09 లక్షల మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వాటిల్లో 22 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే ప్రస్తుతం మరో 20 వేల మందిని నియమించాల్సి ఉంటుంది.

ఇదీ బడులు.. ఖాళీల దుస్థితి

- 2017 నాటికి ప్రాథమిక పాఠశాలల్లో 10,412, ప్రాథమికోన్నత పాఠశాలల్లోనే మరో 2,637.. మొత్తం 13,049 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని ప్రాజెక్టు ఆమోదిత ...మిగతా 2లో

ఏటేటా పెరుగుతున్న విద్యా వాలంటీర్లు

విద్యా సంవత్సరం	2015–16	2016–17	2017–18	2018–19	2019–20
విద్యా వాలంటీర్లు	7,974	9,335	11,428	15,561	16,781

WAIT A SEC ○ ○ ○

లైకులు, షేరింగులు, కామెంట్లతో సాగుతున్న నేటి ప్రపంచంలో ఒక క్షణం అనేది ఊహించినదానికంటే శక్తివంతమైనది.
కనుక మీరు ఆన్‌లైన్‌లో ఏదైనా అప్‌లోడ్ చెయ్యడానికి ముందుగా, ఒక క్షణం ఆలోచించండి.
అప్పుడు ఈ డిజిటల్ ప్రపంచం అందరికీ సురక్షితమైన ప్రదేశంగా మారుతుంది.

ప్రేమను పంచండి. ద్వేషాన్ని కాదు.
సోషల్ మీడియా అందరినీ కలిపే ఓ ఉమ్మడి వేదిక.
కనుక ఇతరులపై ద్వేషాన్ని రగిలించే లేక వారి మనోభావాలను గాయపరిచే పోస్టులను లేక కామెంట్‌లను లేక అప్‌లోడ్‌లను మనం చెయ్యద్దు.

వినోదం మాకెంతో ఇష్టం, ఇతరులకు హాని కలిగించనంత వరకు.
అపాయకరమైన లేక ఇతరులకు హాని కలిగించే పోస్టులను చేయడానికి ముందుగా ఇతరులు కూడా వాటిని అనుకరించే ప్రమాదముందనే సంగతిని గుర్తుంచుకోండి.
మీరు, మీ తోటివారు ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండేలా చూసుకోండి.

ఈ విషయాన్ని వ్యాపింప చేయండి.
క్రియేటర్లుగా మరియు డిజిటల్ పౌరులుగా, ఆన్‌లైన్ వాతావరణాన్ని అందరికీ సురక్షితమైనదిగా మార్చడం మన బాధ్యత. కనుక ఇకపై #WaitASecToReflect. ను ఉపయోగిస్తూ పోస్ట్ చేద్దాం, దీనినే అనుసరిద్దాం, ఈ విషయాన్ని వైరల్ చేద్దాం.



TikTok

బాధ్యత కలిగిన ఆన్‌లైన్ ప్రవర్తనను ఒక నియమంగా రూపొందించడానికి www.waitasec.in ను సందర్శించి మీ ఆదరణ తెలుపండి.
మా 14 ఇండస్ట్రీ-లీడింగ్ సురక్షిత ఫీచర్‌ల గురించి తెలుసుకోవడానికి www.tiktok.com/safety ను సందర్శించండి.

నియోజకవర్గాలకు నిధుల్లేవ్!

ఈనాడు – హైదరాబాద్

రాష్ట్రంలో శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఇచ్చే నియోజకవర్గ అభివృద్ధి నిధులకు ఈ ఏడాది ప్రభుత్వం బ్రేక్ వేసింది. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో వివిధ శాఖలకు బడ్జెట్‌లో కోత విధించిన ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఇచ్చే నియోజకవర్గ అభివృద్ధి నిధులు(సీడీపీ) రూ.120 కోట్లు మాత్రం కేటాయించింది. ఈ నిధులు గత ఆర్థిక సంవత్సరం చివరి మూడు నెలల్లో చేసిన పనులకు చెల్లించడానికే సరిపోతాయని అధికార వర్గాలు తెలిపాయి. 2019-20 ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు అందుబాటులో లేనట్లేనని స్పష్టం చేశాయి.

గతేడాది ఇలా..

రాష్ట్రంలో నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఎమ్మెల్యేకి, ఎమ్మెల్సీకి రూ.3 కోట్ల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. రాష్ట్రంలో 120 మంది శాసనసభ్యులు (నామినేటెడ్ ఎమ్మెల్యే సహా), 40 మంది శాసనమండలి సభ్యులు ఉన్నారు. వీరికి ఏటా రూ.480 కోట్లు అభివృద్ధి పనులకు ప్రతిపాదించే అవకాశం ఉంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.362 కోట్లను కేటాయించిన ప్రభుత్వం.. దాన్ని రూ.298 కోట్లకు సవరించింది. 2017-18లో నియోజకవర్గ అభివృద్ధి నిధులు రూ.299 కోట్లు వ్యయమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు ఉన్నా కొనసాగుతున్న పనులకు సరిపోయే నేపథ్యంలో కొత్తవాటి ప్రతిపాదనలకు అవకాశం లేకుండా పోయిందని శాసనసభ్యులు అభిప్రాయపడుతున్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నేపథ్యంలో అర్నెల్లు పనులకు ప్రతిపాదించలేకపోయమని ఇప్పుడు నిధులు కేటాయింపు బకాయిలకు సరిపోతుండటంతో ఈ ఏడాది సీడీపీ ద్వారా అభివృద్ధి పనులను వదులుకోవాల్సిందేనని పేర్కొంటున్నారు.

పనులకు దారి లేదు

2014-15కు ముందు నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఒక్కో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి కోటి రూపాయలుగా ఉండేవి. తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ఈ మొత్తాన్ని రూ.1.5 కోట్లకు పెంచింది. 2016-17 ఆర్థిక సంవత్సరం నుంచి రూ.కోటిన్నర ఉండగా రూ.3 కోట్లకు పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ప్రత్యేక అభివృద్ధి నిధులను రూ.10 వేల కోట్లు కేటాయించిన నేపథ్యంలో ఈ నిధులను వినియోగిస్తామని ఆర్థికశాఖ ఉన్నతాధికారి తెలిపారు. ఆర్థిక మాంద్యం, ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో 5 నెలలు పూర్తయిందనే అంశాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు అభిప్రాయపడ్డారు. శాసనసభ్యులు ఎన్నికల హామీల నేపథ్యంలో సీడీపీ నిధులు అందుబాటులోకి వచ్చి ఉంటే చాలావరకు వినియోగించుకునే అవకాశం ఉండేదని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు.

రోగులకు కొత్త 'పరీక్ష'

రోగ నిర్ధారణ పరీక్షల్లో భాగంగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో టేబుల్‌పై ఉంచిన రోగుల మూత్ర నమూనాలివి. వైద్య పరీక్షల కోసం వెళ్లిన వారి నమూనాలను ఇలా టేబుల్‌పై ఉంచి వెళ్లండంటూ అక్కడి సిబ్బంది సూచిస్తున్నారు. డబ్బాలపై కనీసం క్రమ సంఖ్య, రోగి పేరు కూడా లేవు. దీంతో అవి తారుమారయ్యే అవకాశం ఉందని.. రిపోర్టులు సైతం మారిపోయే ప్రమాదమూ లేకపోలేదని రోగులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సందర్భాలున్నా గాంధీ ఆసుపత్రిలో సరైన ఏర్పాట్లు చేయకపోవడం నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది.

– ఈనాడు, హైదరాబాద్

1869 - 2019 మహాత్ముడి 150వ జయంతి వేడుకలు

నాకు సరిపడదు!

నా వికాసానికి ప్రతిబంధకమయ్యేది..
అదెంత మంచిదైనా,
ఎంత అందమైనదైనా, ఎంత గొప్పదైనా సరే..
ఎవరి నుంచి స్వీకరించేందుకైనా నేను
వ్యతిరేకమే!

– మహాత్మా గాంధీ

తితిదే ధర్మకర్తల మండలికి సర్వం సిద్ధం

ఈనాడు డిజిటల్, తిరుమల: తితిదే ధర్మకర్తల మండలి ఏర్పాటుకు మార్గం సుగమమైంది. మండలిలో సభ్యుల సంఖ్యను పెంచుతూ ఏపీ ప్రభుత్వం గురువారం ఆర్డినెన్సు జారీచేసింది. త్వరలోనే మండలి సభ్యుల నియామక ఉత్తర్వులు జారీకానున్నాయి. శుక్రవారం ఉత్తర్వులు రావచ్చని తెలుస్తోంది. ముహూర్తం బాగుంటే శనివారం ప్రమాణస్వీకారం.. అనంతరం మండలి సమావేశం నిర్వహణ వంటి చర్యలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వారంలో కొత్త కమిటీలు

(మొదటి పేజీ తరువాయి)

పోటీ దృష్ట్యా కమిటీల నియామకాలకు ప్రాధాన్యం ఏర్పడింది. కమిటీ ఛైర్మన్‌కు ప్రత్యేక ప్రొటోకాల్ ఉంటుంది. శాసనసభలో కార్యాలయంతో పాటు ఒక వ్యక్తిగత సహాయకుడిని నియమించుకోవచ్చు. కమిటీలు ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తాయి. వీటిలో ప్రజా పద్దుల సంఘం కీలకమైంది. కాగ్ నివేదికలను పరిశీలించి, అందులో లేవనెత్తిన లోపాలపై ప్రభుత్వాన్ని, ప్రభుత్వ శాఖలను ప్రశ్నించే అవకాశం ఉంటుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వానికి, పాలనకు, పార్టీకి అనుకూలమైన రీతిలో నియామకాలను చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ సమావేశాల్లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, సీనియర్ నేతలు పాల్గొంటున్నారు.

పదవుల్లేకుండా 103 మంది

శాసనసభ, మండలిలో కలిసి తెరాసకు 137 మంది సభ్యులున్నారు. వీరిలో సీఎం కాకుండా 17 మందికి మంత్రి పదవులు ఉన్నాయి. మండలి ఛైర్మన్, ఉప ఛైర్మన్, శాసనసభాపతి, ఉపసభాపతి, ఇద్దరు చీఫ్ విప్‌లు, సభలో ఆరుగురు, మండలిలో నలుగురు చొప్పున విప్‌లు ఉన్నారు. మొత్తంగా 34 మందికి పదవులు లభించాయి.

ఉమ్మడి కమిటీలు	శాసనసభలో కమిటీలు	మండలిలో కమిటీలు
1. ప్రజాపద్దులు	1. నిబంధనలు	1. అర్జీలు
2. ప్రభుత్వరంగ సంస్థలు	2. నైతిక విలువలు	2. హక్కులు
3. ఎస్సీ సంక్షేమం	3. ప్రభుత్వ హామీలు	3. హామీలు
4. ఎస్టీ సంక్షేమం	4. హక్కులు	4. నిబంధనలు
5. బీసీ సంక్షేమం	5. అర్జీలు	5. నైతిక విలువలు
6. మైనార్టీ సంక్షేమం	6. పర్యావరణ	6. చర్చించాల్సిన అంశాలు
7. స్త్రీ శిశు సంక్షేమం	7. సౌకర్యాలు	
8. సబార్డినేట్ లెజిస్లేషన్		

ఇంకా 103 మంది మిగిలి ఉన్నారు. కొంత మందికి కార్పొరేషన్ల ఛైర్మన్ పదవిపై ఆసక్తి ఉంది. 19 మందికి కమిటీల ఛైర్మన్లుగా అవకాశం ఇవ్వనున్నారు.

పరిశీలనలో ఉన్న నేతలు

రెడ్యానాయక్, తాటికొండ రాజయ్య, జోగు రామన్న, దివాకర్‌రావు, కోనేరు కోనప్ప, రేఖానాయక్, విఠల్‌రెడ్డి, బిగాల గణేశ్, హన్మంతుషిండే, విద్యాసాగర్‌రావు, రామలింగారెడ్డి, జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, మాధవరం కృష్ణారావు, సాయన్న, నోముల నర్సింహయ్య, ఆకుల లలిత, తేరా చిన్నపరెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, ఫరీదుద్దీన్, డి.రాజేశ్వర్‌రావు, యెగ్గె మల్లేశం తదితరుల పేర్లు ఛైర్మన్ల పదవికి పరిశీలనలో ఉన్నాయి. ఒక్కో కమిటీలో పది మంది వరకు సభ్యులను నియమించవచ్చు.

మజ్లిస్‌కు...

పీఏసీ ఛైర్మన్ పదవిని సంప్రదాయం ప్రకారం ప్రతిపక్షానికి ఇవ్వాలి. ప్రస్తుతం శాసనసభలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా లేదు. తెరాస మిత్రపక్షమైన మజ్లిస్ రెండో అతిపెద్ద పార్టీగా ఉంది. ఇటీవలే శాసనసభలో స్థానాలు మార్చారు. మజ్లిస్‌కు మొదటి వరుసలోని విపక్ష స్థానం కేటాయించారు. తాజాగా పీఏసీ ఛైర్మన్ పదవిని ఆ పార్టీకి ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే మజ్లిస్ నుంచి ఈ మేరకు వినతి వచ్చింది. దీనిపైనా సీఎం మూడు, నాలుగు రోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మాస్టారూ.. ఎప్పుడొస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

మండలి(పీఏబీ) సమావేశం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం.. కేంద్ర మానవ వనరుల శాఖకు వెల్లడించింది. 9, 10 తరగతులను పరిగణనలోకి తీసుకుంటే కనీసం మరో 2 వేల ఖాళీలు ఉంటాయి.

✦ 32 శాతం ప్రాథమికోన్నత పాఠశాలల్లో మూడు, 8 శాతం ఉన్నత పాఠశాలల్లో నాలుగు సబ్జెక్టులు బోధించే నిపుణులు లేరని గత మే నెలలో జరిగిన పీఏబీ సమావేశంలో కేంద్రం రాష్ట్రాన్ని హెచ్చరించింది.

✦ 2017 అక్టోబరులో 8,792 ఖాళీల భర్తీకి టీఆర్టీ ప్రకటన జారీ అయింది. ఆ నోటిఫికేషన్‌కు 2016 సెప్టెంబరు వరకు ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకున్నారు. అంటే 2016 అక్టోబరు నుంచి ఇప్పటివరకు సుమారు మూడేళ్లలో దాదాపు 5 వేల మంది పదవీ విరమణ చేశారు. టీఆర్టీ ద్వారా ప్రస్తుతం 2 వేల మందే ఉద్యోగాల్లో చేరారు. మిగిలిన పోస్టులకు న్యాయపరమైన సమస్యలు ఉన్నాయి.

✦ విద్యా వాలంటీర్ల సంఖ్య ఏటా భారీగా పెరుగుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టుల్లోనే వీరిని నియమిస్తారు. ప్రస్తుతం 16,781 మంది పనిచేస్తున్నారు.

✦ పలు గ్రామాల్లో గ్రామస్థులు, ఉపాధ్యాయులు, దాతల విరాళాలతో విద్యా వాలంటీర్లను నియమించుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అలాంటి వారు కనీసం 2 వేల మందికిపైగా ఉంటారని అంచనా. ఉదాహరణకు నిజామాబాద్ జిల్లా బోర్గాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఒక విద్యావాలంటీరును నియమించింది. విద్యా నిధి కింద ఒక్కొక్కరికి రూ.6 వేల చొప్పున వేతనం ఇస్తూ అయిదుగురిని అక్కడ విద్యాకమిటీ నియమించుకుంది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వాల్గొండ ఉన్నత పాఠశాలలో భాషా పండితులు మాత్రమే ఉన్నారు.

నిజామాబాద్ జిల్లాలోని బోర్గాం ఉన్నత పాఠశాల విద్యార్థులు వీరు. ఇక్కడ 1440 మంది చదువుతున్నారు. ఉపాధ్యాయులు తగినంత మంది లేక స్థానిక విద్యా కమిటీ సొంతంగా అయిదుగురు వాలంటీర్లను నియమించుకుంది

కొలువులిచ్చినా.. చేరనివారెందరో

ఈనాడు – హైదరాబాద్

రాష్ట్రంలో రెండేళ్ల క్రితం 8,792 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి టీఎస్‌పీఎస్సీ ప్రకటన జారీ చేసి నియామకాలు జరుపుతున్నా వాటిలో దాదాపు 2 వేల పోస్టులు ఖాళీగానే ఉండనున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) తెలుగు, ఆంగ్ల మాధ్యమ పోస్టులు రెండింటికి ఎంపికైన వారు సుమారు 450 మంది ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలు పొంది తెలంగాణ ఎస్జీటీలో ఎంపికైన వారు 40 మంది ఉన్నారు. రెండు కొలువులు వచ్చినప్పుడు స్వచ్ఛందంగా ఒక దాన్ని వదులుకునే అవకాశం ఉంది. ఒకేసారి కౌన్సెలింగ్ నిర్వహించకపోవడంతో అభ్యర్థులు వదులుకోవడానికి ముందుకు రావడం లేదు. స్కూల్ అసిస్టెంట్ నియామక పత్రాలు తీసుకున్న వారిలో 50 మంది వరకు ఎస్జీటీలకూ ఎంపికయ్యారు. ఎస్జీటీ ఉర్దూలో 600 ఖాళీలు ఉంటే 290 మందే చేరారు. ఖాళీలు ఉంటే ఆ తర్వాత ర్యాంకర్లను పిలవకపోతుండటంతో అన్ని పోస్టులు భర్తీ కావడం లేదు. పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాల్లో 3 వేల మంది చేరకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండో మెరిట్ జాబితాను విడుదల చేసి భర్తీ చేశారు. ఉపాధ్యాయ కొలువుల్లోనూ అదేరకంగా చేయాలని డీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్‌రెడ్డి కోరుతున్నారు.

డెంగీ నివారణ ఇలాగేనా!

- రోగులకు తగ్గ సదుపాయాలేవి?
- రాజధానిలోనే ఇలా ఉంటే.. జిల్లాల్లో పరిస్థితి ఏమిటి?
- వ్యాధి తీవ్రతపై హైకోర్టు ఆందోళన
- నివారణ చర్యలపై అసంతృప్తి

ఈనాడు, హైదరాబాద్: వారంరోజుల వ్యవధిలో 1,120 మంది డెంగీ రోగులు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయించారంటే వ్యాధి తీవ్రతను అర్థం చేసుకోవచ్చని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆసుపత్రుల్లో మంచాలు, మౌలిక సదుపాయాలు లేవని.. వైద్యులు, సిబ్బంది లేరని ఆక్షేపించింది. డెంగీ నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేసింది. డెంగీ నివారణ వ్యాజ్యాలపై విచారణ జరిపిన ధర్మాసనం.. ప్రభుత్వం దాఖలు చేసిన ప్రమాణపత్రంలోని వివరాలపై అసంతృప్తి వ్యక్తంచేసింది. ఆరోగ్యశాఖ అధికారులు ఇచ్చిన నివేదికలో ఏ ప్రభుత్వ ఆసుపత్రికి ఎంతమంది రోగులు వచ్చారనే వివరాలే లేవని తప్పుపట్టింది. ప్రాణాలను హరిస్తున్న డెంగీపై ప్రభుత్వ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతోందని వ్యాఖ్యానించింది. కోటికిపైగా జనాభా ఉన్న మహానగరంలో దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయంటూ తప్పుపట్టింది. ఫాగింగ్ యంత్రాల వినియోగం పెంచాలని, అవసరమైతే పొరుగు రాష్ట్రాల నుంచి యంత్రాలను తెప్పించుకోవాలని సర్కారుకు సూచించింది. రాజధానిలోనే పరిస్థితి ఇలా ఉందంటే జిల్లాల్లో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని పేర్కొంది. రానున్న రోజుల్లో దోమలు వృద్ధి చెందడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డితో కూడిన ధర్మాసనం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రోగుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్‌లు లేవని పేర్కొంది. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నాయన్నారు. కోర్టు సహాయకులుగా నియమితులైన సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. డెంగీతో ఈ ఏడాది ఎవరూ మృతి చెందలేదన్న వాదనపై అభ్యంతరం తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం విచారణను 20కి వాయిదా వేసింది.

దేశవ్యాప్తంగా పోరాడాలి

కేటీఆర్‌ను కోరిన దిల్లీ సీఎం కేజ్రీవాల్

దేశవ్యాప్తంగా డెంగీపై పోరాడాలని దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్.. రాష్ట్ర పురపాలక, పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను కోరారు. మూడు రోజుల క్రితం ప్రగతిభవన్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఆయనను అభినందించారు. మంచి కార్యక్రమం చేపట్టారని, దేశమంతటా ఇది జరగాలని ట్విటర్‌లో పేర్కొన్నారు. పలువురు ప్రముఖులు, అధికారులు, నేతలు.. మంత్రి కేటీఆర్‌ను అనుసరిస్తూ తమ నివాసాలు, కార్యాలయాలను పరిశుభ్రం చేశారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్‌లోని అటవీశాఖ కార్యాలయాన్ని శుభ్రం చేయించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య, సినీనటి సమంత, హైదరాబాద్ మేయరు బొంతు రామ్మోహన్.. శ్రీదేవి దంపతులు, జలమండలి ఎండీ దానకిశోర్, పలు జిల్లాల కలెక్టర్లు తమ నివాసాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను స్వయంగా నిర్వహించారు.

'కాళేశ్వరం' విద్యుత్తు బకాయి రూ.237.63 కోట్లు

వడ్డేపల్లి (హన్మకొండ), న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంతానికి జలప్రదాయనిగా పేర్కొంటున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో ఆగస్టు నెలకు రూ.237.63 కోట్ల విద్యుత్తు బిల్లు బకాయిలు ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్)కు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈమేరకు ఎన్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో వివరాలు లభ్యమయ్యాయి. రాష్ట్రంలో సుమారు కోటి ఎకరాలను సాగులోకి తేవాలన్న సంకల్పంతో ప్రారంభించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నీటిని ఎత్తిపోసేందుకు భారీ పంపు సెట్లకు ఎన్పీడీసీఎల్ విద్యుత్తు సరఫరా చేస్తోంది. ఈమేరకు కన్నెపల్లి, సుందిళ్ల, అన్నారం పంపుహౌస్, నందిమేడారం, రామడుగు, రాజేశ్వర్‌రావుపేట, రాంపూర్ ప్రాంతాల్లో ఎన్పీడీసీఎల్ కాళేశ్వరం ప్రాజెక్టు పంపుసెట్లకు సంస్థ హెచ్‌టీ సర్వీసులను మంజూరు చేసింది. ఆగస్టు చివరి వరకు ఏడుచోట్ల ఏర్పాటు చేసిన పంపుసెట్ల వద్ద విద్యుత్తు వినియోగానికి రూ.237.63 కోట్ల మేర బిల్లు రీడింగ్ నమోదైంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం రాయితీ రూపంలో ఎన్పీడీసీఎల్‌కు అందజేయాల్సి ఉంది.

పంపుహౌస్	కరెంటుబిల్లు (రూ.కోట్లలో)
కన్నెపల్లి	39.80
సుందిళ్ల	3.46
అన్నారం	11.80
నందిమేడారం	100.27
రామడుగు	81.44

గ్రహం అనుగ్రహం

13–9–2019 శుక్రవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
చతుర్దశి: ఉ.6.21 తదుపరి పూర్ణిమ
శతభిష నక్షత్రం: రా.7.52 తదుపరి పూర్వాభాద్ర
అమృత ఘడియలు: మ.11.54 నుంచి 1.41 వరకు
వర్జ్యం: తె.2.57 నుంచి 4.43 వరకు
దుర్ముహూర్తం: ఉ.8.17 నుంచి 9.06 వరకు
తిరిగి మ.12.21 నుంచి 1.10 వరకు
రాహుకాలం: ఉ.10.30 నుంచి 12.00 వరకు
సూర్యోదయం: ఉ.5-51; **సూర్యాస్తమయం:** సా.6.03

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	37.0	26.0
ఖమ్మం	36.0	26.0
గుంటూరు	35.5	26.2
విజయవాడ	32.7	25.6
హన్మకొండ	32.5	24.9
తిరుపతి	31.5	21.8
ఆదిలాబాద్	31.3	23.1
కరీంనగర్	31.0	25.0
నల్గొండ	30.4	25.2
నిజామాబాద్	30.4	22.8
మహబూబ్‌నగర్	30.3	24.0
విశాఖపట్నం	30.2	26.0
సూర్యాపేట	29.0	27.0
హైదరాబాద్	28.7	23.6
రామగుండం	28.4	24.4
మెదక్	26.8	22.0

రుసుములు.. రుసరుసలు

- ట్రాఫిక్ అపరాధ రుసుముల అమలుపై రాష్ట్రంలో తర్జనభర్జన
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రభావంపై చర్చ!
- గుజరాత్‌లో భారీగా తగ్గింపు

ఈనాడు, హైదరాబాద్: రహదారి ప్రమాదాలు తగ్గించాలంటే నిబంధనలను కఠినంగా అమలు చేయాలి.. అలా అని ప్రజలపై అంత భారం మోపటం ఎంతవరకు సబబు? మోటారు వాహన చట్టంలోని సవరణల అమలుపై ప్రస్తుతం జరుగుతున్న చర్చ ఇది. భారీగా పెంచిన అపరాధ రుసుములను.. యథాతథంగా అమలు చేయాలా? కొంత తగ్గించాలా? అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జనలు పడుతోంది. అమలుపై మున్సిపల్ ఎన్నికల తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలున్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. రుసుములను తగ్గించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించిన విషయం తెలిసిందే.

రాష్ట్రాలకు స్వేచ్ఛ

సవరించిన ట్రాఫిక్ నిబంధనలను ఈ నెల 1 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నది కేంద్రం నిర్ణయం. అమలుపై రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉంది. శిరస్త్రాణం ధరించకపోతే రూ.100 ఉన్న అపరాధ రుసుమును కేంద్రం రూ.వెయ్యికి పెంచింది. సిగ్నల్ జంప్ చేస్తే రూ.5 వేల వరకు పెంచింది. ఇలా అన్ని రకాల అతిక్రమణలపై కేంద్రం కొరడా ఝుళిపించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సమయంలో ప్రజలపై భారీగా అపరాధ రుసుములు మోపాలా? అని అధికార పార్టీలో చర్చ జరుగుతోంది. అపరాధ రుసుములు సింహభాగం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనే వసూలు అవుతున్నాయి. గ్రేటర్‌కు ఇప్పట్లో ఎన్నికలు లేనందున అమలు చేసినా పెద్దగా నష్టం ఉండకపోవచ్చని కొందరి వాదన. ప్రస్తుతం ట్రాఫిక్ అతిక్రమణదారుల నుంచి రాష్ట్రం మొత్తం మీద ఏడాదికి రూ.400 కోట్ల మేర వసూలవుతున్నాయి. నూతన నిబంధనలు యథాతథంగా అమలు చేస్తే రూ.వెయ్యి కోట్ల వరకు వసూలు అవుతాయని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు.

సింహభాగం రాష్ట్రాల్లో తర్జనభర్జనలు

దేశంలోని అధిక శాతం రాష్ట్రాల్లో ఈ సవరణలు ఇంకా అమలులోకి రాలేదు. మహారాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనుండటంతో ప్రజలపై భారం మోపేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపటం లేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో అపరాధ రుసుములను 50 నుంచి 70 శాతం తగ్గించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలు ఆసక్తి చూపుతూ ఉత్తర్వులు జారీచేశాయి. ఒడిశా ప్రభుత్వం పాక్షికంగా అమలు చేసే యోచనలో ఉంది.

State Economy Fame NAGARJUNA Sir ఆధ్వర్యంలో
APPSC & TSPSC Gr-2 NEW BATCH
Demo @ 11 a.m. 15-9-2019
Special Batch ECONOMY
NAGARJUNA'S STUDY CIRCLE
ASHOK NAGAR, HYDERABAD.
040-40207373 / 9989104111

SI & కానిస్టేబుల్స్
15000 S.I, కానిస్టేబుల్ ఉద్యోగాలకు అతిత్వరలో నోటిఫికేషన్
వర్రె సుధాకర్ సార్ ఆధ్వర్యంలో
T/M NEW BATCH : 16-09-2019@2PM
E/M NEW BATCH : 16-09-2019@9AM
Separate Batches for TM / EM
యూనిక్ స్టడీ సర్కిల్ CHAITANYAPURI, DSNR, HYD 9492459622 9059949607

SI - CONSTABLE MEGA DEMO
15th Sep-Hyderabad
17th Sep - Warangal
Hyd నుండి SSC-CGL & IAS
Mohd Anwar Ex-SI Chairman Ayaan
2018 సం॥లో TS & AP లో 58 మంది SIలు, వందలాది మంది కానిస్టేబుల్స్ & ఇతర ఉద్యోగాలు సాధించిన ఏకైక సంస్థ!
Now AP & TS's most Favourite Institute is Ayaan
AYAAN 8885885786, 8885667222

AP పోలీస్ కానిస్టేబుల్స్ ఫలితాలలో 'శ్యామ్' ఇనిస్టిట్యూట్ ప్రభంజనం
నిన్న - TS SI ఫలితాలలో స్టేట్ 1st ర్యాంక్ సాధించి, నేడు - 2019 కానిస్టేబుల్ ఫలితాలలో స్టేట్ 1st తోపాటు 432 ఉద్యోగాలను సాధించిన మా విద్యార్థులకు అభినందనలు
STATE 1 RANK 149 Marks K. APPALA SURI Reg No. 4013720
FEMALE STATE 1 RANK 139 Marks A. CHANDRAKALA Reg No. 4095688
SI & కానిస్టేబుల్స్ 7వ బ్యాచ్: 25-9-19
శ్యామ్ ఇనిస్టిట్యూట్ ESTD: 2001 కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా సెల్: 9848256254 9848136254

ఉద్యోగ అవకాశాలు

DUBAI Company: CLEANCO TRADING, IMPORTING & SERVICES ESTABLISHMENT
VISIT TO EMPLOYMENT - VISA IN 6 DAYS
✤ SALES MANS - 1900+200 Dhs ✤ HELPERS (Mechanical) - 1000+200 Dhs
✤ CASHIER - 1000+200 Dhs ✤ HELPERS (Cleaning) - 750 Dhs
AGE LIMIT: 19-40 ✦ ECR & ECNR PASSPORT ELIGIBLE ✦ ACC.+ MED + TRANSPORT + DUTY 10 HRS + TIPS
EUROPE - Company: Yervan Corporation Work - ARMENIA Visa in 6 Days
✤ HELPERS (Cleaning) - 100 Nos. Indian Sal: Rs. 28,000/- - 35,000/-
✦ Age Limit 20 - 50 Yrs. ✦ Free Food + Acc. + 10 Hrs. Duty + OT + Medical + Transport
Client Interview: 15-09-2019 @ BB Restaurant, Beside HP Petrol Bunk, Metpally, Jagtial, Telangana
Client Interview: 20-09-2019 @ VenkataRamana Lodge, 5-2-110 Near Clock Tower Centre, Amalapuram, AP
Client Interview: 21-09-2019 @ 31-23-1/1, 2nd Floor, Beside BSNL Office, Opp. Bharat Petrol Bunk, Eluru Road, Vijawada
Client Interview: 22-09-2019 @ Manasa INN, 123/1C-1, R.S.Road, Near SBI, Yerramukkapalli, Kadapa, AP
DHISA CAREERS ✆ 9030133133 // 7995396778 // 7386490496 // 9010592898
31-21-1/1, 2nd Floor, Beside BSNL Office, Opp. Bharath Petrol Bunk, Eluru Road, Vijayawada.
LIC No. 0533/KAR/PER/1000+/05/863/2009 ✦ E-mail: infodhisa@gmail.com

NOVA 1935 నుండి
వెంటనే కావలెను
నోవా క్రీమ్ వారికి ఎఫ్ఎంసిజి అమ్మకాలలో 5 ఏళ్ళ అనుభవం గల లోకల్ సేల్స్‌మాన్ కావలెను. బయోడాటాని పంపండి
novaskincream@gmail.com
ఎస్ నోవ & కంపెనీ, 104, రిజ్వీ చాంబర్స్, హిల్ రోడ్, బాంద్రా (వె), ముంబయ్-50

WANTED Reputed Bulk Drug Manufacturing Industry with ISO 9001-2015 and having US FDA Facility, who GMP Certification near Sadasivapet, Sanga Reddy Dist. requires
1. MANAGER MECHANICAL with B.E./B.Tech. Mechanics 10-15 years of Experience in the Reputed Bulk Drug Industries.
2. MANAGER ENVIRONMENT ENGINEERING (S.H.E.) B.Tech. Chemical Eng./Environment Engineering Post Graduate/Degree or Diploma in Safety Health & Environment with 5-10 years of Experience in Bulk Drug Industries.
3. PRODUCTION EXECUTIVES : B.Sc / B.Pharmacy, 3-5 years of Experience.
4. Jr. & Sr. PROD. OPERATORS : 10th or Intermediate and should have minimum 3-10 years of Experience in any Pharma Industry.
Salary will be commensurate with Experience and Qualification.
Bus Facility is Available from Sangareddy to Factory site.
Please forward resumes to the following mail IDs
hreolsite@gmail.com, 94406 83813,
umamahesh.eolhr@gmail.com, 94403 25352.

A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
అలుగునూర్, కరీంనగర్
Cell: 90001 80623

ప్రైవేటులోని డెంగీ కేసులనూ పరిగణిస్తాం

'ఈనాడు' కథనంపై ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి స్పందన

శాంతికుమారి

ఈనాడు, హైదరాబాద్: నిబంధనల ప్రకారంగా డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే.. ప్రైవేటు ఆసుపత్రుల్లో వెల్లడైన డెంగీ జ్వరాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి తెలిపారు. డెంగీ నిర్ధారణకు 'ఎలీషా' పరీక్షనే ప్రామాణికమని, ఈ పరీక్ష కొంత ఖరీదైనది కావడంతో కొన్ని ఆసుపత్రుల్లో సాధారణ పరీక్షల ద్వారానే డెంగీ అని నిర్ధారణ ఫలితాలను ఇస్తున్నారన్నారు. దీనివల్ల ప్రజల్లో అనవసర భయాందోళనలు ఏర్పడుతున్నాయని, ఈ పరిస్థితిని నివారించడానికే నిబంధనల మేరకు డెంగీని నిర్ధారించిన ఫలితాలనే పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు. 'పసివాడికి జరమొచ్చింది' శీర్షికన 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన కథనంపై ముఖ్యకార్యదర్శి స్పందించారు. నిబంధనల ప్రకారం డెంగీని నిర్ధారించిన ఫలితాలను పొందుపర్చడానికి ప్రత్యేకంగా ఈ-బర్త్ పోర్టల్‌ను వినియోగిస్తున్నామన్నారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లోని డెంగీ కేసుల సమాచారాన్నీ పొందుపర్చుతున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్ధారణ పరీక్షలు వేగవంతంగా జరపడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ఫీవర్ ఆసుపత్రిలో రోగుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని అక్కడ ప్రత్యేకంగా అధునాతన ప్రయోగశాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. జ్వరాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ వైద్యంలో సాయంత్రం వేళల్లోనూ ఓపీని నిర్వహిస్తున్నామని, సెలవు రోజుల్లోనూ ప్రభుత్వ ఆసుపత్రులు సేవలందిస్తున్నాయని శాంతికుమారి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔషధాలు, ఐవీ ద్రావణాల కొరత రాకుండా ఉండేందుకు ముందస్తు కొనుగోలు చర్యలకు ఆదేశాలు జారీచేశామన్నారు. జ్వరాలపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు పంచాయతీరాజ్, పురపాలక శాఖలతో కలిసి నివారణ చర్యలను చేపడుట్టుతున్నట్లు ఆమె వివరించారు.

వడ్డీ మోత తప్పదా?

వడ్డీ లేని పంటరుణం పథకానికి మంగళం ❒ బడ్జెట్‌లో పథకం పేరు మాయం ❒ గత మూడేళ్ల బకాయిలు రూ.785 కోట్లు

❒ ఈ సొమ్మును రైతుల నుంచి వసూలుచేసిన బ్యాంకులు ❒ ప్రభుత్వం తిరిగి ఇస్తే రైతుల ఖాతాలో వేస్తామని వెల్లడి

❒ ఇక నుంచి పంటరుణ బకాయిలు వడ్డీతో సహా అన్నదాతలు కట్టాల్సిందేనా?

ఈనాడు, హైదరాబాద్: వడ్డీ లేని పంట రుణం(వీఎల్ఆర్) పథకానికి ప్రభుత్వం మంగళం పాడిందా? అని రైతుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బడ్జెట్ కేటాయింపుల్లో ఈ పథకానికి ఎక్కడా నిధులివ్వలేదు. రైతు పంటరుణం తీసుకున్న తేదీ నుంచి ఏడాదిలోగా తిరిగి చెల్లిస్తే వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందనేది ఈ పథకం సారాంశం. 2016 నుంచి ఈ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులున్నా వ్యవసాయశాఖకు నిధులు విడుదల చేయడం లేదు. 2016 ఏప్రిల్ నుంచి 2019 మార్చి ఆఖరు వరకు మూడేళ్లకుగాను అన్నదాతల నుంచి రూ.785 కోట్లను వడ్డీ రూపంలో బ్యాంకులు వసూలు చేశాయి. ఈ సొమ్ము ఇస్తే రైతుల ఖాతాల్లో తిరిగి వేస్తామని వ్యవసాయశాఖకు బ్యాంకర్లు పలుమార్లు నివేదికలిచ్చారు. గత మూడేళ్లుగా ఏటా నిధుల విడుదలకు వ్యవసాయశాఖ పరిపాలనా ఉత్తర్వులిస్తున్నా ఎప్పుడూ విడుదల కానందున రూ.785 కోట్లకు పెరిగాయి. తాజా బడ్జెట్‌లో ఈ పథకం ప్రస్తావన లేనందున ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో నిధులు అడగటానికి కూడా వ్యవసాయశాఖకు అనుమతి ఉండదు. ఈ ఏడాదికి కేటాయింపులు లేకున్నా కనీసం పాత బకాయిలు ఇవ్వడమూ కష్టమేనని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఈ పథకం అమల్లో ఉందని వడ్డీ వసూలు చేయవద్దని బ్యాంకులను ఆదేశిస్తూ ఏటా వ్యవసాయశాఖ ఉత్తర్వులు ఇవ్వడం ఆనవాయితీ. ఇలా ఉత్తర్వులు ఇచ్చినా బ్యాంకులు వడ్డీని వసూలు చేస్తున్నాయి. ఇక ఈ ఏడాది ఇంతవరకు ఈ ఉత్తర్వులు సైతం వ్యవసాయశాఖ ఇవ్వలేదు. బడ్జెట్‌లో కేటాయింపులు లేనందున ఇక వడ్డీని నేరుగా వసూలు చేస్తామని ఓ బ్యాంకు అధికారి చెప్పారు.

రుణమాఫీకి వివరాల సేకరణ

గతేడాది డిసెంబరు 11వరకు రూ.లక్షలోపు పంట రుణం బకాయి ఉన్న రైతులకు మాఫీ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకానికి రూ.6 వేల కోట్లను తాజా బడ్జెట్‌లో కేటాయించింది. ఈ నిధుల విడుదలకు రైతుల వివరాలను బ్యాంకు వారీగా సేకరించాలని వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది. రూ.లక్ష మాఫీ అనేది ఒక రైతుకు చేస్తారా లేదా రైతు కుటుంబం మొత్తానికి కలిపి చేస్తారా అనేది చెప్పాలని బ్యాంకర్లు అడిగారు. రైతుతో పాటు అతని భార్య, పిల్లల పేర్లతో రుణ బకాయిలు ఉంటున్నాయి. ఇలా ఒక కుటుంబంలో ఉన్నవారందరికీ విడివిడిగా రూ.లక్ష చొప్పున మాఫీ చేస్తే ఇవ్వాల్సిన నిధులు పెరుగుతాయని తాజా అంచనా. అలా కాకుండా రైతు కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని చేస్తే నిధుల భారం తగ్గుతుందని వ్యవసాయశాఖ భావిస్తోంది. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చిన తర్వాత తుది జాబితా తయారు చేస్తామని అధికారులు తెలిపారు.

సీఎం కేసీఆర్ ప్రతిమలను తొలగించిన అనంతరం బుద్ధవనంలోని మహాస్తూపం

బుద్ధవనంలో సీఎం కేసీఆర్ ప్రతిమల తొలగింపు

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్ బుద్ధవనం మహాస్తూపంలో గతంలో ఏర్పాటు చేసిన కేసీఆర్, అధికారుల ప్రతిమలను పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు తాజాగా తొలగించారు. యాదాద్రి పుణ్యక్షేత్రంలోని నూతన కట్టడాల్లో కేసీఆర్, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రతిమలు ఉండటంతో తీవ్ర విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. సాగర్ బుద్ధవనంలోనూ కేసీఆర్ ప్రతిమలు ఉన్నట్లు ప్రచారం కావడంతో పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు రహస్యంగా వాటిని తొలగించారు. 2015 మే నెలలో సాగర్‌లో తెరాస ప్లీనరీ సమావేశాలు నిర్వహించారు. ఆ సమయంలో బుద్ధ జయంతి వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొని బుద్ధవనంలోని బుద్ధుడి పాదాల వద్ద పూలు వేశారు. ఆ సన్నివేశానికి సంబంధించిన ప్రతిమలను మహాస్తూపంలో ఏర్పాటు చేశారు. దానిపై విమర్శలు రావడంతో అధికారులు తొలగించారు.

నల్లమల.. నాశనమిలా..!

- యురేనియం తవ్వకాలతో అనర్థాలు
- గొంతెత్తుతున్న కవులు, కళాకారులు
- గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు సంతకాల సేకరణ

ఈనాడు - హైదరాబాద్

తనికెళ్ల భరణి శేఖర్ కమ్ముల ఆర్పీ పట్నాయక్ గుత్తా జ్వాల గోరటి వెంకన్న

నల్లమల అటవీ ప్రాంతంలో చేపట్టబోతున్న యురేనియం తవ్వకాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయంటూ పలువురు కవులు, కళాకారులు, నటులు, సినీ దర్శకులు గళమెత్తుతున్నారు. దీనివల్ల కలిగే అనర్థాల గురించి కొందరు ట్విటర్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల్లో తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. యువకవులు, రచయితల ఆధ్వర్యంలో సేవ్ నల్లమల పేరుతో గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు చేపట్టిన సంతకాల సేకరణలో మరికొందరు భాగస్వాములవుతున్నారు.

వారి ఆందోళనకు కారణాలివి

❒ నల్లమలలో యురేనియం తవ్వకాలను చేపడితే కృష్ణానది కలుషితమవుతుంది.

❒ రేడియోధార్మికతకు జంతువులు బలవుతాయి. పులులు, పక్షులు, నెమళ్లకు ప్రమాదకరం.

❒ చెంచుల ఆరాధ్య స్మృతులు, ప్రాచీన శివాలయాలు, బౌరాపూర్ లాంటి చారిత్రక ప్రాంతాలు నిషిద్ధ ప్రాంతాలుగా మారిపోతాయి. కనువిందు చేసే మల్లెలతీర్థం లాంటి జలపాతాలు కనుమరుగై పోతాయి.

ఇలా ప్రకృతి, మానవ విధ్వంసం, లక్షలాది మంది పూజిస్తున్న దేవాలయాలను ధ్వంసం చేసే యురేనియం తవ్వకాలను నిలిపివేయాలని కోరుతున్నారు. ఇప్పటికే నీటి వనరుల విధ్వంసం జరిగిందని, వరదలు, కరవులు, తాగునీటి వనరులు కలుషితం లాంటి సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం తవ్వకాలు మంచిది కాదని ఓ నటుడు పేర్కొంటే, నల్లమల తెలుగు ప్రజలకు ఊపిరితిత్తుల్లాంటిదని మరో ప్రముఖ దర్శకుడు వ్యాఖ్యానించారు. దర్శకులు శేఖర్ కమ్ముల, నాగ్ అశ్విన్, సురేంద్రరెడ్డి, కవి గోరటి వెంకన్న, విప్లవ కవి నిఖిలేశ్వర్, సినీ రంగానికి చెందిన ప్రముఖులు తనికెళ్ల భరణి, చంద్ర సిద్ధార్థ, ఎల్.బి.శ్రీరాం, ఆర్పీ పట్నాయక్, గాయత్రీ గుప్తా, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల తదితరులు యురేనియం తవ్వకాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు.

శంషాబాద్ విమానాశ్రయం వద్ద గల్ఫ్ బాధితులతో కోటపాటి నరసింహనాయుడు, సురేందర్ సింగ్ ఠాకూర్

మస్కట్‌లో 13 మంది ప్రవాసకార్మికులకు విముక్తి

మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ కవిత చొరవతో స్వరాష్ట్రానికి

ఈనాడు, హైదరాబాద్, శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ కవితల చొరవతో ఒమన్ రాజధాని మస్కట్‌లో ఉన్న 13 మంది ప్రవాస కార్మికులకు విముక్తి లభించింది. గురువారం వారు స్వదేశానికి చేరుకున్నారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి 11 మంది, ఏపీ, కర్ణాటక నుంచి ఇద్దరు ఏడాదిన్నర క్రితం మస్కట్‌కు వెళ్లి హసన్ జుమా బాకర్ అనే భవన నిర్మాణ కంపెనీలో చేరారు. ఆరు నెలల వరకు అక్కడ పనిచేశాక వీసాల గడువు ముగిసిందని చెప్పి యాజమాన్యాలు వారిని వేధించాయి. వేతనాలు ఇవ్వలేదు. ఏడాది కాలంగా ఇబ్బందులు పడుతున్నారు. వారి గురించి కుటుంబ సభ్యులు మాజీ ఎంపీ కవిత సాయంతో తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. దీనిపై మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులతో కేటీఆర్ మాట్లాడారు. సీఎస్‌కు విన్నవించగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున లేఖ రాశారు. దీనిపై రాయబార కార్యాలయ అధికారులు స్పందించి 13 మందికి ఎగ్జిట్ వీసాలను మంజూరు చేశారు. తెరాస నేత కోటపాటి నరసింహనాయుడు, ప్రవాస భారతీయుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సురేందర్ సింగ్ ఠాకూర్ శంషాబాద్‌లో వారికి స్వాగతం పలికారు.

నిధులు మావి.. పేరు మీది

- 'ఆసరా'పై కేంద్రం వ్యాఖ్య
- ఈ పథకంలో వారి వాటా 2 శాతమే
- అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించారని వ్యాఖ్య

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో బడుగు వర్గాలకు నెలవారీ పింఛన్లను ఇచ్చే పథకానికి నిధులు తామిస్తుంటే.. పేరు మాత్రం 'ఆసరా' అని పెట్టారని కేంద్రం వ్యాఖ్యానించింది. జాతీయ సామాజిక భద్రత కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) కింద సొమ్మిలిస్తుంటే పేరు ఇలా పెట్టడం ఏమిటంటోంది. ఈ పథకానికి దాదాపు రూ.10 వేల కోట్లు ఖర్చవుతుండగా అందులో కేంద్రం ఇచ్చేది రూ.200 కోట్లు.. అంటే రెండు శాతం.. కానీ కేంద్రం మాత్రం ఇది 'సొమ్మొకరిది.. సోకొకరిది' అనే చందంగా ఉందంటూ వ్యాఖ్యానిస్తోంది. తాను ఇస్తున్న సొమ్మును ఖర్చు పెడుతున్న తీరుపై కేంద్రం సూచనలు చేస్తోంది. ఇటీవల దిల్లీలో నిర్వహించిన ఒక సమీక్షలో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ కొన్ని వ్యాఖ్యలు చేసింది. సమావేశ అంశాల(మినిట్స్)ను కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు పంపింది.

ఏపీ ఉల్లంఘిస్తోందంటూ 'ఆసరా' పేరు

ఎన్ఎస్ఏపీ మార్గదర్శకాలను ఆంధ్రప్రదేశ్ ఉల్లఘింస్తోందంటూ అందుకు కారణాలను గ్రామీణాభివృద్ధి శాఖ ఆ సమావేశంలో చూపించింది. తాము నిధులిస్తుంటే దానికి 'ఆసరా' పేరు పెట్టడం ఏమిటనేది కేంద్రం ప్రశ్న సంధించింది. వాస్తవానికి ఆసరా తెలంగాణలోనే అమలవుతోంది. 60-65 ఏళ్ల మధ్య వయస్సు వారికి తాను సాయపడుతుంటే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఆ వయస్సు వారికి వృద్ధాప్య పింఛను మంజూరు చేయడంలేదని అభియోగం మోపింది. ప్రస్తుతం తెలంగాణలో 65 ఏళ్లు పైబడిన వారికే రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్నారు.

విశ్రాంత డీఎఫ్‌వోల బృందం అడ్డగింత

- యూసీఐఎల్ అధికారులుగా అనుమానించి వాగ్వాదానికి దిగిన యురేనియం వ్యతిరేక ఐకాస నేతలు

మన్ననూరు అటవీశాఖ అతిథి గృహం వద్ద నిరసన తెలుపుతున్న యురేనియం వ్యతిరేక ఐకాస నాయకులు

మన్ననూర్, న్యూస్‌టుడే: భారత యురేనియం సంస్థ(యూసీఐఎల్)కు సంబంధించిన అధికారులుగా అనుమానించి విశ్రాంత డీఎఫ్‌వోల బృందాన్ని నల్లమల ప్రాంత యురేనియం వ్యతిరేక ఐకాస నాయకులు అడ్డుకున్నారు. నల్లమలలో అడుగు పెట్టవద్దంటూ వాగ్వాదానికి దిగి వారిని వెనక్కి పంపించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్, పదర మండలాల్లో పర్యటించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని కేంద్రానికి నివేదిక ఇవ్వడం కోసం విశ్రాంత డీఎఫ్‌వోల బృందం గురువారం మన్ననూరు చేరుకుంది. అంతకు ముందే యురేనియం సర్వే నిమిత్తం నల్లమలకు యూసీఐఎల్ అధికారుల బృందం వస్తోందని, డ్రిల్లింగ్ చేయడానికి బోర్‌వెల్ వాహనాలు వస్తున్నాయని.. అడ్డుకోవాలని ఇందుకోసం అందరూ అప్రమత్తంగా ఉండాలని యురేనియం వ్యతిరేక సమితి సభ్యులు నిర్ణయించారు. దీంతో నాయకులు రైతుల పొలాల్లో బోరు వేయడానికి వెళ్తున్న రెండు బోర్‌వెల్ వాహనాలను అడ్డుకొని వాటిని వెనక్కి పంపించేశారు. ఉదయం 10.45 గంటల సమయంలో విశ్రాంత డీఎఫ్‌వోల సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సభ్యులు పాండురంగారావు, జైపాల్‌రెడ్డి, అహ్మద్ స్థానిక రేంజ్ అధికారులతో సమావేశమడాన్ని గుర్తించిన ఐకాస నాయకులు అక్కడికి చేరుకొన్నారు. నల్లమలకు వచ్చిన కారణమేంటని ప్రశ్నించారు. బాల్‌రెడ్డి వారితో మాట్లాడుతూ.. తాము నల్లమలలో ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు వచ్చామని, యురేనియం వెలికితీతపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, పర్యావరణానికి కలిగే నష్టాన్ని అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. యురేనియం ప్రాజెక్టుపై ఇక్కడి ప్రజలు చేస్తున్న పోరాటం అభినందనీయమని, ఇదే ఉద్యమాన్ని శాంతియుతంగా కొనసాగించాలని కోరారు. ఈ మాటలపై నమ్మకం లేదని, విశ్రాంత డీఎఫ్‌వోల ముసుగులో వచ్చినది యూసీఐఎల్ అధికారులేనని అనుమానం వ్యక్తం చేస్తూ.. ఐకాస నాయకులు వారిని నల్లమలలో అడుగుపెట్టడానికి వీల్లేదంటూ అటవీశాఖ అతిథిగృహం గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో విశ్రాంత డీఎఫ్‌వోల బృందం అదే కారులో వెనక్కి వెళ్లిపోయారు.

చితి భరించలేని దుఃఖమిది!

- మామ అంత్యక్రియల్లో పాడె మోస్తూ అల్లుడి మృతి
- తండ్రిని, భర్తను ఒకేసారి పోగొట్టుకున్న ఇల్లాలు

శ్రీధర్ ★ నారాయణ

న్యూస్‌టుడే, నంగునూరు రూరల్: పిల్లనిచ్చిన మామను కట్నకానుకలు కావాలని ఆశించే అల్లుళ్లు సాధారణంగా తారస పడుతుంటారు. కానీ ఈ అల్లుడు అందుకు పూర్తి భిన్నం. తండ్రిలా ఆదరించే మామ చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయారు. ఆ ఆవేదన భరించలేక మామ చితి వద్దే కుప్పకూలి ప్రాణాలు వదిలారు. ఈ హృదయ విదారక ఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో గురువారం జరిగింది. బద్దిపడగకు చెందిన పండుగ నారాయణ (65) సిద్దిపేటలో ఉంటున్నారు. గతంలో ఆయన సింగరేణి గనుల్లో పనిచేసి ఐచ్ఛిక పదవీ విరమణ పొందారు. ముప్పై ఏళ్ల క్రితమే బద్దిపడగ గ్రామం నుంచి వారి కుటుంబం వెళ్లిపోయింది. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సిద్దిపేటలోని కిరాయి ఇంట్లో నారాయణ మరణించారు. ఆయన స్వగ్రామం బద్దిపడగలో అంత్యక్రియలు చేసేందుకు నిర్ణయించి మృతదేహాన్ని తీసుకొచ్చారు. ఈ క్రమంలో అల్లుడు తుపాకుల శ్రీధర్(38) మామ చితి చుట్టూ పాడె మోస్తూ తిరుగుతుండగా రెండో ప్రదక్షిణలో ఒక్కసారిగా కుప్పకూలారు. చికిత్స నిమిత్తం సిద్దిపేటకు తరలించగా మార్గమధ్యలోనే మరణించారు. శ్రీధర్‌కు భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన సిద్దిపేటలో డ్రైవర్‌గా పనిచేసేవారు.

ఎడ్ల శ్రీనివాస్‌కు హైకోర్టులో ఊరట

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ వీరప్పన్‌గా పేరొందిన ఎడ్ల శ్రీనివాస్‌కు హైకోర్టులో ఊరట లభించింది. రామగుండం పోలీసు కమిషనర్.. అతడిపై జారీచేసిన ముందస్తు నిర్బంధ ఉత్తర్వులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డితో కూడిన ధర్మాసనం గురువారం రద్దు చేసింది. శ్రీనివాస్‌పై పీడీ చట్టం ఉత్తర్వుల జారీని సవాలు చేస్తూ అతని తల్లి హైకోర్టును ఆశ్రయించింది. రాజకీయ కారణాలతో తన కొడుకును పోలీసులు అరెస్ట్ చేశారని ఆమె పేర్కొనగా ధర్మాసనం.. పీడీ ఉత్తర్వులను రద్దుచేసి అతడిని విడుదల చేయాలని స్పష్టంచేసింది.

అప్పుడే జరిమానాలా?

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీల్లో జరిమానాల విధింపునకు ప్రభుత్వం నిర్దేశించిన గడువు కంటే ముందుగా కొన్నిచోట్ల సర్పంచులు, గ్రామ కార్యదర్శులు అత్యుత్సాహం చూపుతున్నారు. ఆరుబయలుకు వెళ్లారని, రోడ్డుపై చెత్తను పోశారని రూ.500, అంతకంటే ఎక్కువగా జరిమానాలు విధిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 30 రోజుల కార్యాచరణ ప్రణాళికలో జరిమానాలకు నిర్ణీత తేదీలను నిర్దేశించింది. పారిశుద్ధ్య పనులు చేపట్టాక, మళ్లీ చెత్తను రోడ్ల వెంబడి వేస్తే ఈనెల 15 నుంచి రూ.500 వరకు జరిమానా.. ఆరుబయలుకు వెళ్లినవారికి 25 తర్వాత నుంచి జరిమానా విధించాలి. కానీ పాలకులు ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. నిర్ణీత తేదీలకు ముందుగా.. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఇతర ప్రాంతాల్లోని మరుగుదొడ్ల తలుపులు, కిటికీలకు మరమ్మతులు చేయాలని ప్రణాళిక చెబుతోంది. ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు అందజేసి.. అవి ఎండిపోతే ఇంటి యజమానుల నుంచి ఆస్తి పన్నుకు రెట్టింపు మొత్తాన్ని జరిమానాగా రాబట్టవచ్చని చట్టంలో పేర్కొంది. గ్రామంలో నాటిన మొక్కల్లో 85 శాతం బతికి ఉండేలా చూసే బాధ్యత కార్యదర్శిదని కూడా చెప్పింది.

మిర్యాలగూడలో తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి దుర్గాప్రసాద్ ఇంటి వద్ద చంద్రబాబు వాహనం

తెలంగాణ సరిహద్దులో చంద్రబాబు వాహనం

బలవంతంగా తరలించిన ఏపీ పోలీసులు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశ్రాంతి తీసుకునే వాహనాన్ని (క్యారవాన్) ఏపీ పోలీసులు బుధవారం సాయంత్రం తెలంగాణ సరిహద్దులో వదిలి వెళ్లిపోయారు. ఏపీలో 'చలో ఆత్మకూరు' కార్యక్రమానికి బుధవారం చంద్రబాబు హాజరవుతారని భావించి ముందస్తుగా క్యారవాన్‌ను తెదేపా శ్రేణులు హైదరాబాద్ నుంచి ఆత్మకూరుకు తీసుకొచ్చారు. అక్కడ ఏపీ పోలీసులు వాహనాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకుని అందులో డ్రైవర్ మినహా మిగిలిన వారిని దించేశారు. కొందరు పోలీసులు వాహనాన్ని బలవంతంగా అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహదారిలో వాడపల్లి వద్ద సరిహద్దు దాటించారు. మిర్యాలగూడ- నల్గొండ రహదారి మధ్యలో వాహనాన్ని ఆపి వెళ్లిపోయారు. వాహనం లోపలికి వెళ్లే తాళాలను వెంట తీసుకెళ్లగా, వాహనాన్ని నడిపే తాళాలను మాత్రమే డ్రైవర్‌కు ఇచ్చారు. అయోమయానికి గురైన డ్రైవర్ ఎన్టీఆర్ ట్రస్టుభవన్‌కు ఫోన్‌లో సమాచారమిచ్చారు. అక్కడివారు తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి నెల్లూరి దుర్గాప్రసాద్‌కు సమాచారమిచ్చారు. వాహనాన్ని ఆయన మిర్యాలగూడలోని తన సొంత ఇంటి వద్దకు తీసుకొచ్చారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌కు పంపారు.

ఎడారి మిడత.. ఎక్కడి నుంచి వచ్చిందో?

- కారణాలను అన్వేషించి మొక్కజొన్న పంట నష్టాన్ని నివారించేలా చర్యలు
- తొగుటకు వరుస కడుతున్న అధికారులు, శాస్త్రవేత్తలు

ఎడారి మిడత

తొగుట మండలంలో మిడతలు తినేసిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఈనాడు, సిద్దిపేట: లక్షల సంఖ్యలో మొక్కజొన్న పంటపై దాడిచేసి పూర్తిగా తినేస్తున్న మిడతల దండు ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు, అధికారులు లోతైన అధ్యయనం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని నాలుగు గ్రామాల పరిధిలో మొక్కజొన్నపై మిడతలు దాడి చేసి పైరును పూర్తిగా తినేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు ఇక్కడికి వచ్చి వెళ్లారు. గురువారం మెదక్, సంగారెడ్డి జిల్లాల నుంచి శాస్త్రవేత్తలతో పాటు అధికారులు ఈ గ్రామాలను సందర్శించి... చేలను పరిశీలించారు. పంటను నష్టపరుస్తున్న తీరును బట్టి చూస్తే ఇవి ఎడారి మిడతలని సంగారెడ్డి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక్కో గుంపులో లక్షల సంఖ్యలో ఉండే ఇవి ఎక్కడి నుంచి వచ్చి ఉంటాయనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఈ ఏడాది జూన్‌లో రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఇదే తరహాలో మిడతల దండు పంటలను నాశనం చేసింది. ఈ క్రమంలోనే మన వద్ద ఎన్నడూ లేని విధంగా పంటలను ధ్వంసం చేస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

కరీంనగర్ శాస్త్రవేత్తల పరిశీలన

సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారుల విజ్ఞప్తి మేరకు కరీంనగర్ జిల్లాకు చెందిన శాస్త్రవేత్తలు తొగుట మండలానికి వచ్చారు. వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చెందిన ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ జి.మంజులతతో పాటు శాస్త్రవేత్తలు రజనీకాంత్, ఉషారాణి, శ్రావణి .. గోవర్ధనగిరి గ్రామంలో పర్యటించారు. కాండాలు, ఈనెలు మాత్రమే మిగిలిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మెదక్ జిల్లా నార్సింగి ప్రాంతంలోనూ పంట నష్టం ఆనవాళ్లను శాస్త్రవేత్తలు గుర్తించారు.

దక్షిణకోస్తా కొత్త జోన్‌పై రైల్వేబోర్డుకు నివేదిక

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో మరో కొత్త రైల్వేజోన్ ఏర్పాటు ప్రక్రియకు ముందడుగు పడింది. సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణమధ్య రైల్వే జోన్‌ను పునర్‌వ్యవస్థీకరిస్తూ విశాఖపట్నం కేంద్రంగా ప్రకటించిన దక్షిణకోస్తా జోన్ ఏర్పాటుకు సంబంధించి విధివిధానాల రూపకల్పనపై కసరత్తు పూర్తయ్యింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఓఎస్డీ ధనంజనేయులు రైల్వేబోర్డుకు తాజాగా సమర్పించారు. విశాఖపట్నం కేంద్రంగా కొత్త రైల్వేజోన్ ఏర్పాటు చేస్తూ ఈ ఏడాది ఫిబ్రవరిలో రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. విధివిధానాలపై ఆరునెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. కొత్త జోన్ ఏర్పాటు ప్రక్రియపై అప్పట్లో ఓఎస్డీగా ఉన్న ఎస్.ఎస్.శ్రీనివాస్ కసరత్తు చేశారు. డివిజన్లవారీ ఆదాయం, మౌలిక సదుపాయాలు, ఉద్యోగుల సంఖ్య తదితర అంశాలపై సమగ్ర సమాచారాన్ని సేకరించారు. ఉన్నతాధికారులతోనూ సమావేశమయ్యారు. శ్రీనివాస్ పదోన్నతిపై గుంటూరు డీఆర్ఎంగా వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో ధనంజనేయులు వచ్చారు. రైల్వేబోర్డుకు నివేదిక సమర్పించారు.

GITAM (DEEMED TO BE UNIVERSITY) (Estd. u/s 3 of the UGC Act, 1956)
VISAKHAPATNAM ★ HYDERABAD ★ BENGALURU
Accredited by NAAC with A+ Grade

CENTRE FOR DISTANCE LEARNING (CDL)
Approved by the Joint committee of UGC-AICTE-DEC
(Recognized by the Distance Education Bureau(DEB), New Delhi)

Examination Schedule - Dec'2019

Commencement of examination	:	10-12-2019
Last Date to apply without fine	:	10-10-2019
Last Date to apply with fine ₹ 500/-	:	20-10-2019
Last Date to apply with fine ₹ 1500/-	:	30-10-2019

Candidates are requested to pay the examination fee through net banking. Online application is available in cdl.gitam.edu website.
Director-CDL

ఈనాడు

సమగ్ర నిషేధమే జాతిహితం

కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతికత ప్రాణాంతక వ్యసనాలకూ ఆధునిక హంగులు అద్దుతోంది. చుట్ట బీడీ సిగరెట్... పేరు ఏదైతేనేం- జనజీవితాల్ని పొగచూరిపోయేలా చేస్తున్న ధూమ కాష్ఠాలకు నయా అవతారంగా ఈ- సిగరెట్లు యువతరం బతుకులతో చెలగాటమాడుతున్నాయి. భయానక క్యాన్సర్ సహా పలు వ్యాధులకు కారణభూతమయ్యే పొగాకు ఉత్పాదనల వినిమయాన్ని తగ్గించేలా జన జాగృత కార్యక్రమాలకు ప్రభుత్వాలు నిబద్ధత చాటుతుంటే, భావితరాల్ని బుట్టలో వేసుకునేలా ఈ సిగరెట్ల ఉరవడి ప్రజారోగ్యానికి పెనుసవాళ్లు రువ్వుతోంది. ఆ ముప్పును సమర్థంగా కాచుకొనేందుకు ఈ-సిగరెట్లు సహా సంబంధిత ఉత్పాదనల తయారీ, దిగుమతి, ఎగుమతి, రవాణా, అమ్మకం, పంపిణీ, ప్రకటనలను నిషేధించి, ఉల్లంఘనలను శిక్షార్హ నేరంగా పరిగణిస్తూ అత్యవసర ఆదేశం (ఆర్డినెన్స్) జారీకి కేంద్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది. ప్రధాని మోదీ రెండో విడత పాలన తొలి వంద రోజుల అజెండాలో భాగంగా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అమలు చేయదలచిన కీలకాంశమిది! శీతాకాల భేటీలో నెగ్గించడానికి రూపొందించిన ముసాయిదా బిల్లు అనుసారం- తొలిసారి ఉల్లంఘనకు పాల్పడిన వారికి లక్ష రూపాయల జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష, మళ్లీ నేరానికి పాల్పడితే మూడేళ్ల జైలుశిక్ష, అయిదు లక్షల జరిమానా విధించాలన్న కేంద్రం, ఈ-సిగరెట్లను నిల్వ చేసినా ఆర్నెల్ల ఖైదు, రూ.50 వేల జరిమానాను ప్రతిపాదిస్తోంది. దాదాపు 27 కోట్ల మంది పొగాకు వినియోగదారులతో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న ఇండియాలో ఏటా కనీసం 12 లక్షల మంది 'పగాకు' సంబంధ వ్యాధులకు బలైపోతున్నారు. పొగాకు వ్యతిరేక ఉద్యమకారులు, వివిధ రంగాల ప్రముఖులు సత్వరం ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని కోరుతుంటే, అలాంటి కఠిన చట్టం వేలమంది కార్మికుల పొట్టకొడుతుందని పరిశ్రమ వర్గాల వారు హెచ్చరిస్తున్నారు. ఈ-సిగరెట్లలోని నికొటిన్ దుష్ప్రభావం జనారోగ్యాన్ని చావుదెబ్బ తీస్తుందంటూ కేంద్ర సర్కారు తెస్తున్న ఆర్డినెన్స్ స్వాగతించదగిందే అయినా, అంతకు ఎన్నో రెట్లుగా సామాజిక సంక్షోభం సృష్టిస్తున్న పొగాకును ఉపేక్షించడం బేసబబు!

ప్రపంచవ్యాప్తంగా ఏటా 70 లక్షల మందికి పైగా ప్రాణాలు కబళిస్తున్న పొగాకు- అక్షరాలా నిశ్శబ్ద హంతకి! నికొటిన్‌తోపాటు ఏకంగా ఏడువేల రకాల విషతుల్యాలుండే పొగాకును ఏవిధంగా వినియోగించినా రక్తంలో కలిసి ఒళ్లంతా వ్యాపించే రసాయనాలు పలు క్యాన్సర్లకు కారణమవుతాయి. సాధారణ రకాలతో పోలిస్తే ఈ-సిగరెట్లు 95 శాతం తక్కువ హానికరమని, ధూమపానం మానలేక ప్రాణం మీదకు తెచ్చుకొంటున్న ఎంతోమంది అభాగ్యులకు అవి ఎంతగానో అక్కరకొస్తున్నాయని పరిశ్రమ వర్గాలు వాదిస్తున్నాయి. సిగరెట్ పెట్టెల మీద ప్రకటనలకు భయపడి వాటికి దూరంగా ఉంటున్న యువతకు 'అంతగా హానికరం కాదన్న' ఆకర్షణీయ ప్రకటనలతో ఈ-సిగరెట్లు ధూమపాన ద్వారాలు తెరిచి, మరింత 'కిక్కు' కోసం వాళ్లు సాధారణ రకాలవైపు మళ్లేలా చేస్తున్నాయని ఆరోగ్యశాఖ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దేశీయంగా 460కి పైగా బ్రాండ్ల ఈ-సిగరెట్లలో నికొటిన్ మూలకానికి 7,700 పైగా రుచులు అద్ది యువతరాన్ని ఆకట్టుకొంటున్న తీరు అక్షరాలా జాతీయ ఉపద్రవమే! ఈ-సిగరెట్లలోని సాంకేతికత ద్రవరూప నికొటిన్‌ను ఆవిరిగా మారిస్తే, వినియోగదారులు దాన్ని పీలుస్తారంటున్న భారతీయ వైద్య పరిశోధనా మండలి- పలు అధ్యయనాల్ని ఉటంకిస్తూ అదెంత ప్రాణాంతకమో వివరిస్తూ వెలువరించిన శ్వేతపత్రంలోని సూచనలు శిరోధార్యమే. సిగరెట్లు ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం ద్వారా ఈ-సిగరెట్లను నిషేధించే అవకాశం లేకపోవడంతో దాన్ని 'ఔషధం'గా గుర్తించి డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ చట్టం కింద కేంద్రం తాజాగా నిషేధాస్త్రం సంధిస్తోంది. అంతర్జాలంలో ఈ సిగరెట్ల విపణి జోరును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధంగా ఎలా కట్టడి చెయ్యగలవో చూడాలి!

పదహారేళ్ల క్రితం నాటి ప్రపంచ ఆరోగ్య సదస్సు, ఈ-సిగరెట్ల వినిమయాన్ని నియంత్రించడమో, నిషేధించడమో చేయాలని సభ్య దేశాలకు గట్టిగా సూచించింది. పొగాకు నియంత్రణ మార్గదర్శక పత్రంపై సంతకం చేసిన ఇండియా, ఈ సిగరెట్లపై వేటు వెయ్యడానికే నిర్ణయించింది. సాధారణంగా ధూమపానం వల్ల కలిగే అనర్థాలను దూరం చెయ్యడానికి ప్రత్యామ్నాయంగా బ్రిటన్, న్యూజిలాండ్ వంటివి ఈ-సిగరెట్లను ఆదరిస్తున్నాయన్న పరిశ్రమ వర్గాల వాదనను పట్టించుకోవాల్సిన పని లేదు. బ్రెజిల్, నార్వే, సింగపూర్ వంటి పాతిక దేశాలు వాటిని నిషేధించిన నిజాన్ని విస్మరించకూడదు. ప్రపంచవ్యాప్తంగా నిరుడు రూ.80 వేల కోట్లుగా ఉన్న ఈ-సిగరెట్ విపణి, 2024 నాటికి లక్షా 30 వేల కోట్ల రూపాయలకు చేరుతుందన్న అంచనాలున్నాయి. సాధారణ సిగరెట్లకు ఎదురుగాలి పోటెత్తుతున్న నేపథ్యంలో ఆ బడా సంస్థలే మెరుగైన ప్రత్యామ్నాయం పేరిట ఈ ఉత్పాదనల్ని ప్రపంచం మీదకు వదులుతున్నాయి. అమెరికాలోని 33 రాష్ట్రాల్లో 450 మంది ఊపిరితిత్తుల వ్యాధి పాలవడానికి, ఆరుగురి మరణాలకు కారణమయ్యాయంటూ ట్రంప్ ప్రభుత్వం సైతం వాటిని నిషేధించే యోచన చేస్తోంది. పొగాకు మోగిస్తున్న మరణమృదంగ ధ్వని ఇండియాలో సంక్షేమ రాజ్య భావనకే నిలువునా తూట్లు పొడుస్తున్నా పొగాకు ఉత్పాదనల సమగ్ర నిషేధంపై ప్రభుత్వాలు వెనకాడటం ఏమిటి? దేశవ్యాప్తంగా 60 లక్షల మంది పొగాకు రైతుల్ని జాగృతపరచి తగు ప్రోత్సాహకాలు అందించి ప్రత్యామ్నాయ పంటలకు మళ్లించడంతో మొదలుపెట్టి, ఆయా కర్మాగారాల్లో శ్రామికులకు, బీడీ కార్మికులకు కొత్తదారి చూపించేలా ప్రభుత్వాల కార్యాచరణ సమగ్రం కావాలి. పొగాకు కాలుష్య విష ధూమాన్ని చెదరగొట్టే క్రియాశీల చొరవే నేడు కావాల్సింది!

వనరులపై వేటు పర్యావరణానికి చేటు

గంజివరపు శ్రీనివాస్

దేశంలో నదీ పరివాహక ప్రాంతాలు, సముద్ర తీరాల్లో సాగుతున్న విచ్చలవిడి ఇసుక తవ్వకాలు పర్యావరణ వ్యవస్థలకు, జీవవైవిధ్యానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయి. ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తున్న ఈ అడ్డగోలు ప్రక్రియను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. తాజాగా గోదావరిలో ఇసుక తవ్వకాలపై జాతీయ హరిత ట్రైబ్యునల్ తెలంగాణ ప్రభుత్వాన్ని ఆక్షేపించింది. చిన్నపాటి ఇంటి నుంచి స్థిరాస్తి సంస్థలు నిర్మించే భారీ బహుళ అంతస్తుల భవంతులకూ ఇసుక అవసరం. నదీ పరీవాహకాలు, సముద్ర తీరాలు, ఇతర జలాశయాల పరీవాహక ప్రదేశాల్లోని ఉపరితలంలో ఇసుక తవ్వకం రోజురోజుకూ ఎక్కువవుతోంది. సముద్రతీరాల్లోని ఇసుకలో జిర్కోనియం, టైటానియం, థోరియం వంటి పరిశ్రమల్లో వినియోగించే విలువైన ఖనిజ వనరులు ఉంటాయి. ఇసుకలో లభించే 'సిలికా' వంటి పదార్థాలు 'గాజు' తయారీలోనూ వినియోగిస్తారు. రాతి ఇసుక, పర్యావరణహితమైన నిర్మాణాలపై అవగాహన పెరగకపోవడం, ప్రస్తుత అవసరాలకు తగినట్లు ఇసుకకు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించకపోవడం మూలంగా ఈ వనరులపై ఒత్తిడి విపరీతంగా పెరిగింది. ఏళ్ల తరబడి చవగ్గా లభించడం, చిన్న నదుల పరీవాహకాల్లో తవ్వకాలపై ప్రభుత్వ వ్యవస్థల నియంత్రణ కొరవడటం మూలంగా ఇసుక తవ్వకాలు పెచ్చరిల్లాయి.

జీవవైవిధ్యానికి హాని

అడ్డూఅదుపూ లేకుండా సహజ వనరులను తవ్వితే జీవవైవిధ్యానికి అంతులేని హాని కలుగుతుంది. పర్యావరణ వ్యవస్థలు దెబ్బతిని వాతావరణ ప్రతికూల మార్పులకు దారితీయడం ద్వారా జీవన వ్యవస్థల మనుగడ ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటుంది. ఇసుక వంటి సహజ వనరుల విషయంలో పొదుపుగా తవ్వకాలు సాగించకపోతే, తలెత్తే దుష్పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. నదుల ప్రవాహ స్థితిగతులు మారిపోయి వరదలు జనావాసాలపై విరుచుకుపడే ప్రమాదం ఉంది. గత కొన్నేళ్లలో తూర్పు, పశ్చిమ కనుమల్లో పట్టణాలు, నగరాలను వరదలు ముంచెత్తడానికి అక్కడ సాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలే కారణమని అధ్యయనాలు చెబుతున్నాయి. తవ్వకాలతో తీవ్ర నష్టం ఉందని తెలిసీ, అధికార వ్యవస్థలు ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తుండటం విచారకరం. ఇసుక వంటి సహజవనరులను ఒకసారి తవ్వితీస్తే పునరుద్ధరించడం వీలుపడదు. ఇసుక తవ్వకాలు సముద్ర తీర పర్యావరణ వ్యవస్థనూ ఛిద్రం చేస్తున్నాయి. నీటిపై ఆధారపడిన జీవజాలాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. సముద్ర జీవసంపద వృద్ధికి, కాలుష్య నియంత్రణకు విశేషంగా దోహదపడే 'ఆలివ్ రిడ్లే' తాబేళ్లు సముద్రపు ఒడ్డున గుడ్లు పెడతాయి. తీరంలో ఇసుక తవ్వకాలవల్ల ఈ తాబేళ్లతో పాటు ఎన్నో రకాల జీవజాలం, పగడపు దిబ్బలు, తీర సముద్ర వ్యవస్థల మనుగడ ప్రమాదంలో పడుతోంది. అందమైన పర్యాటక ప్రాంతాల రూపురేఖలను ఇసుక తవ్వకాలు దారుణంగా దెబ్బతీస్తున్నాయి. దీంతో పర్యాటక ఆదాయం కోల్పోయే పరిస్థితి నెలకొంది.

ఇసుక అక్రమ తవ్వకాలతో అనర్థాలు

గనులు, ఖనిజాల అభివృద్ధి (నియంత్రణ) చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం ఇసుకను చిన్నతరహా ఖనిజాల జాబితాలో చేర్చారు. ఇసుక అక్రమ మైనింగ్, రవాణా, నిల్వలను నిరోధించే నియమాలను రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇచ్చారు. ఇసుక అక్రమ తవ్వకాల నియంత్రణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉండటంతో, దేశవ్యాప్తంగా ఒకే విధానం లేదు. యమున, గంగ, కావేరి, గోదావరి, కృష్ణలతో పాటు అనేక చిన్న, పెద్ద నదీ పరీవాహక ప్రాంతాల్లో పెద్దయెత్తున జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాల నియంత్రణ కోసం సర్వోన్నత న్యాయస్థానం, జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలు ఇచ్చినా ప్రభుత్వ వ్యవస్థలు వాటిని అమలు చేయడంలో విఫలమయ్యాయి. దీపక్ కుమార్ వర్సెస్ హరియాణా రాష్ట్ర ప్రభుత్వం (2012) కేసులో సర్వోన్నత న్యాయస్థానం నదులకు ఎటు పక్కనైనా లేదా నదీ గర్భంలోనైనా చేపట్టే ఇసుక తవ్వకాలు జీవవైవిధ్యాన్ని నష్టపరచి, పర్యావరణాన్ని నాశనం చేస్తాయని పేర్కొంది. తవ్వకాలు అయిదు హెక్టార్ల విస్తీర్ణం దాటితే, జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అనుమతులు తీసుకోవాలని నిర్దేశించింది. ఖనిజ వనరుల తవ్వకాలు, 'క్వారీ'ల విషయంలో పర్యావరణ పరిరక్షణ చట్టం-1986కు అనుగుణంగా అమలవుతున్న పర్యావరణ ప్రభావ అంచనా నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవాలని ఆదేశించింది. నదీ గర్భాల్లో ఇసుక వెలికితీయడం, వాణిజ్యపరంగా విక్రయించడాన్ని మైనింగ్‌గానే పరిగణిస్తారు. దీనికి పర్యావరణ అనుమతులు అవసరమని మార్గదర్శకాలు చెబుతున్నా రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. ఇసుక తవ్వకాలకు సంబంధించిన ఈ మార్గదర్శకాలను గత మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో అమలుచేసిన దాఖలాలు లేవు. మార్గదర్శకాల ప్రకారం ఇసుక, ఖనిజాల తవ్వకాలు అయిదు హెక్టార్ల విస్తీర్ణానికి మించితే, జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ నష్ట ప్రభావాన్ని మదింపు చేయాలి. తవ్వకాల అనంతరం నష్ట ప్రభావాన్ని తగ్గించే చర్యలు సూచిస్తూ లీజులు మంజూరు చేయాలి. అనేక రాష్ట్రాల్లో ఈ తరహా వ్యవస్థలు ఏర్పాటైన దాఖలాల్లేవు.

హరిత ట్రైబ్యునల్ ఆదేశాలపై అలక్ష్యం

నదీ ప్రవాహ ప్రాంతాల్లో చేపడుతున్న తవ్వకాలు ప్రవాహ దిశను మార్చేస్తాయి. పద్ధతిలేని తవ్వకాలు నదుల ఎగువన, సమీప ప్రాంతాల్లో అడవుల క్షీణతకూ కారణమవుతున్నాయి. ఈ అంశాలు జాతీయ హరిత ట్రైబ్యునల్ చట్టం (2010) పరిధిలోని మొదటి షెడ్యూలు కిందకు వస్తాయి. 2015లో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇసుక మాఫియా ఆగడాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఐఏఎస్ అధికారి దుర్గాశక్తి నాగపాల్ సస్పెన్షన్, తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కలెక్టర్ అశిష్ కుమార్ బదిలీ వంటి వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో అదుపులేని ఇసుక తవ్వకాలపై దాఖలైన వ్యాజ్యంలో జాతీయ హరిత ట్రైబ్యునల్ సమగ్ర ఆదేశాలు ఇచ్చింది. పర్యావరణ అనుమతులు, లీజులు లేకుండా సాగుతున్న తవ్వకాలను నిలిపివేయాలని న్యాయస్థానం పర్యావరణ మంత్రిత్వశాఖను ఆదేశించింది. దేశవ్యాప్తంగా జిల్లాస్థాయి అధికారులు ఈ ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది. ఈ ఆదేశాలపై స్పందించిన కేంద్ర పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సుస్థిర ఇసుక తవ్వకాలు, యాజమాన్య పద్ధతుల నిర్వహణ కోసం 2016లో వంద పేజీల స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించింది. వీటి సాయంతో రాష్ట్రాలు ప్రత్యేక ఇసుక విధానాల ద్వారా నదీ పరీవాహకాల్లో తవ్వకాలు సుస్థిర ప్రాతిపదికన సాగించే వీలుగా చర్యలు చేపట్టాలి. వీటిపై ప్రభుత్వాల్లో అలక్ష్యం నెలకొంది.

దుర్గాశక్తి నాగపాల్

పౌర సమాజ భాగస్వామ్యం కీలకం

నేతల జోక్యం, ప్రైవేటు వ్యక్తుల కనుసన్నల్లో సాగుతున్న ఇసుక తవ్వకాల మూలంగా ఏళ్ల తరబడి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పెద్దయెత్తున ప్రైవేటు వ్యక్తుల జేబుల్లోకి వెళ్లిపోతోంది. చాలా రాష్ట్రాలు రాష్ట్రస్థాయిలో కొత్త ఇసుక విధానాలను తీసుకురావడంలో జాప్యం చేశాయి. మార్గదర్శకాలు వచ్చాక కూడా గత మూడేళ్లలో జాతీయ హరిత ట్రైబ్యునల్ ఇసుక తవ్వకాల విషయంలో పలు రాష్ట్రాల వైఖరిని ఆక్షేపించడం గమనార్హం. గోవాలో ఇసుక తవ్వకాల ప్రాంతాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయకపోతే, నిర్ణీత కాలంలో 20 లక్షల రూపాయలను కేంద్ర కాలుష్య మండలికి చెల్లించాలని ట్రైబ్యునల్ హెచ్చరించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయనే అంశంపై వంద కోట్ల రూపాయలు పరిహారంగా చెల్లించాలని ట్రైబ్యునల్ ఆదేశించడం సంచలనం కలిగించింది. దీనిపై ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఈ ఉత్తర్వులను నిలిపివేసింది. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా అనేక రాష్ట్రాలు ఇసుక తవ్వకాల లీజులు, అనుమతుల మంజూరు, నియంత్రణ ప్రక్రియలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక విధానాలను అమలులోకి తీసుకురావడంతో పాటు, ఆన్‌లైన్‌లో కొనుగోలు ప్రక్రియ మొదలుపెట్టాయి. తెలంగాణలో ఏడాదిన్నర క్రితమే ఇసుక తవ్వకాలకు ప్రత్యేక విధానం తీసుకొచ్చినా తాజాగా జాతీయ ట్రైబ్యునల్ ఆక్షేపణలతో లోపభూయిష్ఠ విధానాలపై చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఇసుకను ఆదాయ వనరుగా కాకుండా, అవసరం మేరకు తవ్వకాలు సాగేవిధంగా నియంత్రించాల్సి ఉంది. పర్యావరణ సమతుల్యతను దెబ్బతీసే ఇసుక తవ్వకాల అంశంలో రాష్ట్ర ప్రభుత్వాలూ కఠినంగా వ్యవహరించాలి. క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ అవసరం. రెవిన్యూ, పోలీసు, నీటిపారుదల, పంచాయతీరాజ్ విభాగాల సిబ్బందితో ముడిపడి ఉన్న ఇసుక తవ్వకాల్లో వారు జవాబుదారీగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించేవిధంగా చర్యలు చేపట్టాలి. లైమ్‌స్టోన్ వంటి ఖనిజాలను శుద్ధి చేయడం ద్వారా వచ్చే రాతి ఇసుక, ఫ్లైయాష్ వంటి ప్రత్యామ్నాయ వనరుల వాడకాన్ని పెంచి, ఇసుకపై ఒత్తిడి తగ్గించాలి. ఇసుక తవ్వకాలతో దెబ్బతింటున్న నదీ పరీవాహక ప్రాంతాలు, అటవీ ప్రాంతాల పరిరక్షణలో పౌరసమాజ భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలి!

(రచయిత- అటవీ, పర్యావరణ రంగ నిపుణులు)

అపోహలపై అప్రమత్తత

జమ్ము-కశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణంగా, బేషరతుగా విలీనం చేయాలని ప్రతి రాజకీయ పార్టీ అంతర్లీనంగా భావించి ఉండొచ్చు. కానీ, ఆ పనిచేస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయన్న ఉద్దేశంతో గత ప్రభుత్వాలు 370వ అధికరణపై ఆచితూచి అడుగులు వేశాయి. రాష్ట్రం వ్యూహాత్మకంగా కీలక స్థానంలో ఉండటమే ఇందుకు కారణం. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ 70 ఏళ్లలో చేయలేని పనిని, నరేంద్రమోదీ సర్కారు రెండోసారి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పూర్తి చేసింది. నెహ్రూ హయాం నుంచి కశ్మీర్ విషయంలో కాంగ్రెస్ గుట్టుగా అడుగులు వేయగా, మోదీ సర్కారు తాను చేయదలచుకున్న పనిని చేసి చూపింది. ఎవరేమనుకున్నా బేఖాతర్ అన్నట్లు వ్యవహరించింది. నాడు నెహ్రూ ప్రభుత్వం పాకిస్థాన్ ఆటకట్టించడం కోసం 370 అధికరణ తీసుకొచ్చి రాష్ట్ర ప్రజలకు ద్వంద్వ పౌరసత్వం కట్టబెట్టింది. అప్పట్లో ఆ పని చేసి ఉండకపోతే నేడు పరిస్థితి వేరుగా ఉండేది. నాటి కశ్మీర్ నాయకత్వం, కశ్మీరీ ప్రజల మనోభావాలను భారత్‌కు అనుకూలంగా మలచుకోవడానికి ఆ అధికరణ ఉపకరించింది. అందుకే పాకిస్థాన్ ఎంతగా తీవ్రవాదాన్ని పెంచి పోషించినా, కశ్మీర్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలు పాక్ ప్రేరేపిత శక్తుల ఆటలను సాగనివ్వలేదు. అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలతో, సాధారణ ప్రజానీకంతో ఉదారంగా, స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వేర్పాటువాద శక్తులకు అడ్డుకట్ట వేసేవి. పాకిస్థాన్‌లో కలసిపోవాలా లేక స్వతంత్ర కశ్మీర్‌గా ఉండాలా అనే అంశంపైనే వేర్పాటువాదులకు స్పష్టత ఉండేది కాదు. రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు మాత్రం భారత్‌లోనే కొనసాగుతూనే సమర్థ, సత్పరిపాలన సాధించుకోవాలని వాదించేవి. ప్రధాన పార్టీలు, వేర్పాటువాద శక్తులు చేతులు కలపకుండా చూడటంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు సఫలమవుతూ వచ్చాయి. అంతేకాక వారి మధ్య విభేదాలను ఎగదోసే ఎత్తుగడలను అవలంబించేవి.

ఎన్డీయే సర్కారు 370వ అధికరణను రద్దుచేసినప్పటి నుంచి ఈ రెండు వర్గాలు కేంద్రానికి వ్యతిరేకంగా చేతులు కలిపే స్థితి ఏర్పడటం చిత్రమేనని చెప్పాలి. ముఖ్యంగా కశ్మీరీ ప్రాంతీయ పార్టీలు కేంద్రం తమను అనామకంగా మార్చేసిందని రుసరుసలాడుతున్నాయి. అందుకే అవి ఇటీవల మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా నివాసం 'గుప్కార్' లో సమావేశమై రాష్ట్రంలో భారీయెత్తున భద్రతా బలగాలను మోహరించడం, అమర్‌నాథ్ యాత్రను రద్దుచేయడం, కశ్మీర్‌లోయ నుంచి పర్యాటకులను బలవంతంగా పంపేయడంపై చర్చించాయి. ఈ పరిణామాల వల్ల ఏర్పడిన పరిస్థితిని సమీక్షించాయి. ఈ భేటీకి మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాతోపాటు కాంగ్రెస్, సీపీఎం నాయకులు హాజరయ్యారు. భారతీయ జనతా పార్టీకి అనుకూలురైన సజ్జద్ లోనే, లాల్‌సింగ్ చౌదరి ఈ సమావేశానికి హాజరవలసి ఉంది. కానీ, అక్కడకు వెళ్లకుండా వారిని గృహనిర్బంధంలో ఉంచారు.

కశ్మీర్‌పై ఆచితూచి అడుగు

మొదటి నుంచీ రాష్ట్రంలో క్రమం తప్పకుండా ఎన్నికలు జరిపించడం ద్వారా ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నామన్న సంకేతాలను కాంగ్రెస్ పంపగలిగింది. 2007 ఎన్నికల్లో వేర్పాటువాదులు సైతం తమ అభ్యర్థులను పోటీచేయించాలని చూడటం బట్టి, ఎన్నికల ప్రక్రియకు అన్ని వర్గాల నుంచి సానుకూలత వ్యక్తం అయిందని రుజువైంది. మొత్తం మీద 370 అధికరణ రద్దయినప్పటి నుంచి రాష్ట్రం అష్టదిగ్బంధనంలోకి వెళ్లింది. ఎక్కడ స్థానిక పోలీసులు తిరుగుబాటు చేస్తారోనని కేంద్రం ఆందోళన చెందింది. నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ వంటి ప్రధాన పార్టీల నాయకులకు భద్రతగా నియమించిన పోలీసుల నుంచి ఆయుధాలు వెనక్కు తీసుకోవడానికి కారణం ఈ భయమే. వేర్పాటువాదులు, తీవ్రవాదుల వల్ల ఈ నాయకులకు హాని జరుగుతుందేమోనన్న అనుమానంతోనే ఇంతకాలం వారికి పోలీసు రక్షణ కల్పించారు. మారిన పరిస్థితుల్లో వేర్పాటువాదులు, ప్రధాన పార్టీల మధ్య విభజన రేఖలు చెరిగిపోతున్నందున, ఒకరి వల్ల మరొకరికి హాని జరిగే అవకాశం లేదు. ఉభయులకూ విభేదాలున్నా కశ్మీర్ ఐక్యత కోసం చేతులు కలపక తప్పదని భావించే పరిస్థితి నెలకొన్నది.

కశ్మీరీలు ఇంతకాలం భారత్ తరఫున గట్టిగా నిలచి, పాక్ ప్రేరిత తీవ్రవాదులతో, వేర్పాటువాదులతో పోరాడారు. ఇప్పుడు 370 అధికరణ రద్దుతో వారి మనోభావాలు దెబ్బతినే ప్రమాదం కనబడుతోంది. ఇకపైన బయటివారు వచ్చి రాష్ట్రంలో ఆస్తులు కొనేస్తారని, దీంతో రాష్ట్ర జనాభా, స్వరూప స్వభావాలు మారిపోతాయని స్థానికుల్లో భయాందోళనలను రేకెత్తించడానికి వేర్పాటువాదులు కృషిచేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర రాజధాని నగరం శ్రీనగర్‌లో కొన్ని చోట్ల భద్రతా దళాలను రానివ్వకుండా రహదారుల మీద కందకాలు తవ్వారు.

కేంద్రానికి కశ్మీర్‌లో కావలసింది భూములే తప్ప, ప్రజలు కాదనే భావన బలం పుంజుకోవడం ప్రమాదకర సంకేతం. ఈ ఆలోచన కశ్మీరీలను జాతీయ జనజీవన స్రవంతికి దూరం చేస్తుంది. 2008, 2010, 2016లలో రాష్ట్రంలో నెలల తరబడి హింస, దౌర్జన్యాలు చెలరేగాయి. వందలాదిమంది మరణించారు, గాయపడ్డారు. 370 అధికరణను రద్దు చేసిన తరవాత ఆ స్థాయి అల్లర్లు జరగని మాట నిజమే. రాష్ట్రంలో కాల్పులు, మరణాలు చోటుచేసుకోలేదని, పరిస్థితి అదుపులో ఉందని కేంద్రం చెబుతోంది. రోడ్లపైకి ఎవరైనా వచ్చి ఆందోళనకు దిగినా స్థానిక పోలీసులు, అధికారులు రంగప్రవేశం చేసి పరిస్థితిని సద్దుమణిగేలా చేస్తున్నారు. ఆందోళనకు పూనుకొంటున్నవారు బయటివారే తప్ప, స్థానికులు కాకపోవడం గమనించాల్సిన అంశం. అల్లర్లలో స్థానికులు పాల్గొన్న ఘటనలు కొన్ని చోట్ల జరిగి ఉండవచ్చు. ఏదిఏమైనా ప్రభుత్వం ఉదాసీనంగా ఉండరాదు. ఎలాంటి అవాంతరాలు వచ్చినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి!

- బిలాల్ భట్

ఈనాడు లేఖలు

కొడిగడుతున్న కుటుంబ సంబంధాలు

ప్రస్తుత సమాజంలో కుటుంబ సంబంధాలు క్షీణించిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. నిత్యం ఎక్కడో ఒక చోట తండ్రిని కొడుకు హత్య చేశాడని, భార్యను భర్త అంతమొందించాడని, పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య చేసుకుందని, కుటుంబ సభ్యులే ఇంటి పెద్దను తుదముట్టించారని వార్తలు వస్తున్నాయి. ఆర్థికంగా చితికిపోవడం, అప్పులపాలు కావడంవంటి కారణాలను మినహాయిస్తే, దేశవ్యాప్తంగా నేరప్రవృత్తి పెరగడాన్ని, అనుబంధాలు అడుగంటడాన్ని ఇవి సూచిస్తున్నాయి. తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణతో పెంచడం, ప్రేమ, ఆప్యాయతలతో ఆదరించడం ఎంతో అవసరమని ఈ ఉదంతాలు తేటతెల్లం చేస్తున్నాయి. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమైంది. ఆధునిక సమాజం కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్ల వెంట పరుగెత్తకుండా, కుటుంబ బంధాలపై నిత్యం కొంత సమయం కేటాయించాల్సిన అవసరం ఉంది.

- ముప్ప కృష్ణమనాయుడు, మల్కాజిగిరి, సికింద్రాబాద్

పరిశుభ్రతపై అవగాహన

వ్యాధులతో రాష్ట్రంలో పెద్దయెత్తున ప్రజలు ఆస్పత్రుల ముందు చికిత్స కోసం బారులు తీరుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వసతులు లేవంటూ ఆవేదన చెందుతున్నారు. పారిశుద్ధ్యంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తే కొంతవరకైనా సమస్య తీవ్రత తగ్గడానికి ఆస్కారం ఉంటుంది. ఎన్నో గ్రామాల్లో ఇప్పటికీ బహిరంగ మల విసర్జన కొనసాగుతోంది. పల్లెలు, పట్నాలు తేడా లేకుండా ఇంటి పరిసరాల్లోనే చెత్త పారేస్తున్నారు. చాలామంది మంచినీటిని కాచి చల్లార్చి తాగడం వంటి కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటం ఎన్నో వ్యాధులకు కారణమవుతోంది. ప్రభుత్వం గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి.

- తోట యోగేందర్, మిర్యాలగూడ, నల్గొండజిల్లా

గీత గోవిందం

అంతర్యామి

ద్వాపర యుగంలో ద్వారకను ఏలిన శ్రీకృష్ణుణ్ని ఆ రాజ్యంలోని ప్రజలందరూ ఇష్టపడేవారు. నయనానందకరమైన ఆ మధురాధిపతిని స్త్రీ పురుష భేదం లేకుండా అందరూ ప్రేమించేవారని భాగవతం చెబుతోంది.

వ్రేపల్లెలో నందుడి ఇంట పెరిగిన శ్రీకృష్ణుడి అందం, చిలిపి చేష్టలు గోప బాలబాలికలనందరినీ ఆనందపరచేవి. శ్రీకృష్ణుడు కిశోర కౌమార దశలోనే గోప భామలను పారవశ్యానికి గురిచేశాడని భాగవతం చెబుతోంది. యౌవనంలోకి అడుగిడిన మాధవుడు గోప కన్నెలకు ప్రణయ మూర్తిగా మారాడు. శ్రీకృష్ణుడి బంధువర్గంలోనివాడు విశ్వభానుడు. అతడు యశోదకు సోదరుడి వరస. ఈ విశ్వభానుడు, కీర్తిదేవి దంపతుల కూతురే రాధ. శ్రీకృష్ణుడికన్నా మూడేళ్లు పెద్దది. ఈ రాధాకృష్ణుల మధ్య అమలిన శృంగారానికి సంబంధించిన భావకావ్యమే జయదేవ విరచిత గీత గోవిందం. మధుర భక్తిని ప్రతిబింబించే ఈ కావ్యం నాడు నేడూ సదా అనురంజకమే.

సంస్కృత భాషలో విలక్షణమైన అతి చిన్న కావ్యం గీత గోవిందం. కాళిదాసు రాసిన ఋతుసంహారం, మేఘదూతం కావ్యాలకు దీటుగా ప్రాచీన కవులతో పాటు ఎందరో సాహితీవేత్తలు గీత గోవిందాన్ని సరిపోల్చారు. ఈ కావ్యంలో నాయికా నాయకుల ప్రణయం, శృంగారాన్ని జయదేవుడు మనోహరంగా వర్ణించాడు. ఇందులో పన్నెండు సర్గలు ఉన్నాయి. ఇరవై నాలుగు అష్టపదులు ఈ కావ్యంలో వలపులు వర్షిస్తాయి. తొంభై నాలుగు వర్ణనాత్మకమైన శ్లోకాలతో గీత గోవిందం జయదేవుడి భావ వ్యక్తీకరణకు పరాకాష్ఠగా హృదయాలను రంజింపజేస్తుంది.

తొలి అష్టపది పరమాత్ముడి దశావతార వర్ణనతో ఆరంభమవుతుంది. రెండో అష్టపదిలో రాధా మాధవుల ప్రణయాన్ని సుందరంగా చూపాడు. రాధ కుచాలింగనపరుడై పరవశించే కృష్ణా... దివ్యకుండలాలను, వనమాలను ధరించిన నీ ముగ్ధ మనోహర రూపానికి మంగళం అంటాడు. ఆయన వాడిన పదాలు అతి మనోహరం. మకరందంలా రుచిస్తాయి. ఆ యమునా తీరా పరిసరాలను, చల్లని గాలులు కోకిల రాగాల తుమ్మెదల ఝుంకారాలను వర్ణిస్తూ నీకోసం వేచి ఉన్న గోపికల మానసాలు తల్లడిల్లిపోతున్నాయని పల్లవిస్తాడు.

మరో శ్లోకంలో కందర్ప జ్వరం అంటూ నాయిక విప్రలంబ శృంగారం ఎలా అనుభవిస్తుందో ఉదాహరిస్తాడు జయదేవుడు. తీపి రుచి తెలియాలంటే ముందు కారం తినాలట. రాధ విరహానికి వసంతం ఉద్దీపన అయింది. విరహ తాపాన్ని భరించలేక బృందావనంలోని చెట్టు, పుట్ట మొక్కా కొమ్మలను నిమురుతూ రాధిక విప్రలంబ విరహోత్కంఠిత అయిందట. నాలుగో అష్టపదిలో శ్రీకృష్ణుడు మేఘశ్యాముడై చందనపు పూతలతో పరిమళిస్తున్నాడు అంటాడు జయదేవుడు. ఆయన సామోద దామోదరుడట. గోపికలందరికీ బృందావనంలో మాధవుడు ఆమోదయోగ్యుడైన వాడు. ఈ అష్టపదిలో గోపికా వల్లభుడు దక్షిణ నాయకుడు. రాధ... స్మిత మనోహరి. ఇలా గీత గోవిందం పన్నెండు సర్గల్లోనూ జయదేవుడు మాధవుణ్ని పలురకాల రూప లావణ్యాలతో వర్ణిస్తాడు.

కృష్ణుడు ఇతర గోపికలతో క్రీడిస్తున్నట్టు రాధ ఊహించుకొని అసూయ చెందుతుంది. రాధిక విరహ వేదనను మధురమైన హృదయంగమమైన వర్ణనతో జయదేవుడు పాఠకులను పరితపింపజేస్తాడు. ఎనిమిదో సర్గలో మోహనుడు విలక్షణ లక్ష్మీపతి. తొమ్మిదో సర్గలో మురళీధరుడు ముగ్ధ ముకుందుడు. పదో సర్గలో మానస మాధవుడు. పదకొండో సర్గలో సానంద గోవిందుడు. పన్నెండో సర్గలో సుప్రీతి పీతాంబరుడు. ఇలా పన్నెండు సర్గల్లోని ఇరవై నాలుగు అష్టపదులతో జయదేవుడు ఈ కావ్యాన్ని రసరమ్యంగా రాగరంజితం చేశాడు.

- అప్పరుసు రమాకాంతరావు

సాగర తీరం.. భక్తుల హారం

జనసంద్రంలా ట్యాంక్‌బండ్ పరిసరాలు ◆ హుస్సేన్‌సాగర్ చుట్టూ గణేశ ప్రతిమలతో భక్తుల సందడి
ముందే ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం ◆ ప్రశాంతంగా ముగిసిన మహా శోభాయాత్ర

హైదరాబాద్‌లోని మొజాంజాహీ మార్కెట్ మార్గంలో గణనాథుల శోభాయాత్ర

ఈనాడు - హైదరాబాద్

పదకొండు రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. గురువారం భాగ్యనగర వ్యాప్తంగా మహా శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు, లోయర్ ట్యాంక్‌బండ్, ఖైరతాబాద్ పరిసరాలు జన సంద్రాన్ని తలపించాయి. హుస్సేన్‌సాగర్‌తోపాటు నగరంలోని ప్రధాన చెరువుల వద్ద నిమజ్జన సందడి నెలకొంది. నిమజ్జనోత్సవానికి ముఖ్య అతిథిగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భగవత్ హాజరయ్యారు. హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ముందుగానే మహా గణపతి జలప్రవేశం

నాలుగేళ్లుగా చేస్తున్నట్లే ఖైరతాబాద్ మహాగణపతిని, బాలాపూర్ గణనాథుడిని ముందే నిమజ్జనం చేశారు. మహాగణపతి శోభాయాత్ర ఉదయం 7.15 గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం ఒంటిగంటకల్లా ఎన్టీఆర్ మార్గ్‌లోని ఆరో నంబరు క్రేన్ వద్దకు చేరుకుంది. అర్చకులు మహాగణపతికి పూజలు చేసి గంగాహారతి ఇచ్చారు. అనంతరం భారీ క్రేన్‌తో మధ్యాహ్నం 1.45 గంటల ప్రాంతంలో గంగమ్మ ఒడికి చేర్చారు. బాలాపూర్ వినాయకుడినీ గతానికి భిన్నంగా ఈసారి సాయంత్రం 5 గంటలలోపే నిమజ్జనం పూర్తి చేశారు.

35 వేలకు పైగా విగ్రహాల నిమజ్జనం

- గురువారం సాయంత్రానికి నగర వ్యాప్తంగా దాదాపు 35 వేలకు పైగా విగ్రహాలు నిమజ్జనం చేశారు.
- హుస్సేన్‌సాగర్, ఇతర చెరువుల వద్ద అధునాతన మైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలోని 25,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.
- పాతబస్తీలోని కిషన్‌బాగ్‌లో వినాయక విగ్రహాలను వాహనాలపైకి ఎక్కించే క్రేన్‌డీకొనడంతో విధుల్లో ఉన్న రవీందర్ అనే కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డారు.

గంగ ఒడిలోకి చేరుతున్న ఖైరతాబాద్ మహాగణపతి

మంచితనమే కాదు..శక్తీ అవసరమే!

- **సద్గుణాలకు వేడుకలు వేదికలవ్వాలి**
- **ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్**


గణనాథుల శోభాయాత్ర సందర్భంగా మొజాంజాహీ మార్కెట్ వద్ద హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయతో మోహన్ భగవత్ మాటామంతీ

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, అబిడ్స్: "కేవలం మంచితనం ఉంటే సరిపోదు. మనపై దాడి చేసినవారిని ఎదుర్కొనేందుకు శక్తి కూడా అవసరమని గణేశుడు మనకు చెబుతున్నాడు. మనం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.. దేశాన్ని నాశనం చేయాలనుకునే వారు సమాజంలో విభేదాలు సృష్టించడానికి చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలి" అని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భగవత్ అన్నారు. గణేశ్ ఉత్సవాలను వేడుకలకే పరిమితం చేయకుండా.. సంస్కార పంతులుగా మారడానికి, సద్గుణాలను అలవర్చుకునేందుకు వేదికలుగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన గణేశ నిమజ్జనోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొజాంజాహీ మార్కెట్ కూడలిలో భాగ్యనగర గణేశ్ ఉత్సవ కమిటీ ఏర్పాటుచేసిన స్వాగత వేదిక నుంచి నిమజ్జనానికి తరలి వచ్చిన గణనాథులకు స్వాగతం పలికారు. అనంతరం భక్త సమూహాన్ని ఉద్దేశించి మోహన్ భగవత్ ప్రసంగించారు. జగదాంబ స్వరూపమైన భారత మాత పూజలో జీవితాన్ని సార్థకం చేసుకోవాలని ఆయన ఉద్బోధించారు. గణేశుడి రూపురేఖల్లో సమాజ హితముందనేది అందరూ గ్రహించాలన్నారు. సమాజంలోని అందరి మాటలు వింటున్నానని చెప్పడానికి వినాయకుడి పెద్ద చెవులు, సూక్ష్మ పరిశీలనా శక్తికి ఆయన కళ్లు నిదర్శనమని తెలిపారు.

దేశభక్తితోనే అభివృద్ధి: బండారు దత్తాత్రేయ

సంబరాలు, ఉత్సవాలు సంఘటిత శక్తినిస్తాయని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మొజంజాహీ మార్కెట్ వద్ద గణనాథులకు స్వాగతం పలుకుతూ ఆయన భక్తులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భక్తి అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఐకమత్యానికి ప్రతీకగా నిలిచే ఈ ఉత్సవాలతో మరింత శక్తిని కూడగట్టుకోగలమన్నారు. కుల, మత భేదాలు లేకుండా గణేశ్ ఉత్సవాల్లో అందరూ పాల్గొనడం ద్వారా భాగ్యనగరం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు, భాగ్యనగర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి డా. భగవంతరావు, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, హరిద్వార్ మహారాజ్ ప్రజ్ఞానంద్ స్వామీజీ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు భగవత్ చార్మినార్‌ను ఆనుకుని ఉన్న భాగ్యలక్ష్మి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. మొజంజాహీ మార్కెట్ నుంచి ట్యాంక్‌బండ్‌కు చేరుకుని గణేశ్ నిమజ్జనాన్ని తిలకించారు. మార్కెట్ వద్ద మాజీ ఎంపీ వివేక్, ఆరెస్సెస్ ప్రచారక్ ఆలె శ్యామ్, భాజపా సీనియర్ నేతలు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరిగిపోతుంటే చూడలేను

"ఈ ఆరు నెలల్లో ప్రతి రోజూ ఇదే ఆలోచన.. మదిలో మెదిలే రూపానికి ప్రాణం పోసి భక్తజనం ముందుంచాలన్నదే లక్ష్యం. అదే ఆలోచనతో పనిచేస్తాను. ప్రతిక్షణం ఆ రూపమే గుర్తుకొస్తుంది. 11 రోజులు పూజలందుకున్న ఆ స్వామి ఒక్కసారిగా నిమజ్జనానికి తరలుతుంటే నాకు కన్నీళ్లు ఆగవు. ఆ సాగరతీరంలో నా కలలరూపం కరిగిపోతుంటే చూసి తట్టుకోలేను.. అందుకే దూరంగా వెళ్లిపోతుంటా"

- 'ఈనాడు'తో ఖైరతాబాద్ మహాగణపతి శిల్పి చినస్వామి రాజేంద్రన్

ఫిలింనగర్ లడ్డూ రూ. 17.75 లక్షలు

బాలాపూర్ లడ్డూ రూ.17.60 లక్షలు

ఈనాడు, హైదరాబాద్: మహా నిమజ్జనం సందర్భంగా గురువారం భాగ్యనగర గణేశ్ మండపాల వద్ద ఈ ఏడాది కూడా లడ్డూ ప్రసాదాల కోసం పోటాపోటీగా వేలం సాగింది. చాలా చోట్ల పదుల సంఖ్యలో భక్తులు వేలంలో పాల్గొన్నారు. ఈ ప్రసాదం వల్ల మంచి జరుగుతుందనే నమ్మకంతో భక్తులు లక్షల రూపాయలు పెట్టడానికి కూడా వెనకాడటం లేదు. ఇలా దక్కించుకున్న లడ్డూ ప్రసాదాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు పంచి పెడుతుంటారు. పంట పొలాల్లో కూడా వేస్తుంటారు. ఈ సారి వేలం పాటలో ఫిలింనగర్ వినాయక్‌నగర్ లడ్డూ బాలాపూర్ రికార్డును బద్దలుకొట్టింది. ఈ లడ్డూను స్థిరాస్తి వ్యాపారి, భాజపా నేత పల్లపు గోవర్ధన్ రూ. 17.75 లక్షలకు సొంతం చేసుకున్నారు. (ఈయనే గత ఏడాది ఆయన రూ. 15.01 లక్షలకు దక్కించుకున్నారు). బాలాపూర్ లడ్డూ ఈ సారి రూ. 17.60 లక్షలు పలికింది. ఆర్థిక మాంద్యం సెగ గణేశుడి లడ్డూలను తాకలేదని పలువురు అభిప్రాయపడ్డారు.

ప్రాంతం	లడ్డూ ధర (రూ.లక్షల్లో)	వేలంలో దక్కించుకున్న వారు
ఫిలింనగర్ వినాయక్‌నగర్	17.75	పల్లపు గోవర్ధన్
బాలాపూర్	17.60	కొలను రామిరెడ్డి
చేవెళ్ల	12.01	చేవెళ్ల సైగ్రూపు సభ్యులు
కేపీహెచ్‌బీకాలనీ సర్దార్ పటేల్‌నగర్	11.78	కృష్ణారెడ్డి, అచ్యుతరామయ్య తదితరులు

పేదల సేవకే లడ్డూ వేలం డబ్బులు

- **ఆదర్శంగా నిలుస్తున్న రిచ్‌మండ్ విల్లాస్‌వాసులు**
- **రికార్డుస్థాయిలో రూ.18.5l లక్షలు పలికిన లడ్డూ**

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: గణపతి లడ్డూల వేలంలో ఇదొక స్ఫూర్తిదాయక యత్నం. రాజేంద్రనగర్ హైదర్‌గూడా సనసిటీలోని రిచ్‌మండ్‌విల్లాస్ కాలనీవాసులు గణపతి లడ్డూ వేలంలో వచ్చిన డబ్బు నంతా నిరుపేదలకు, సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ రెండేళ్లుగా ఆదర్శంగా నిలుస్తున్నారు. లడ్డూ మొదటి సంవత్సరం రూ 4.5 లక్షలు, గతేడాది రూ.13 లక్షలు పలికింది. ఈ సొమ్ముతో 80 మంది నిరుపేద విద్యార్థులకు పాఠశాల ఫీజులు చెల్లించారు. అనాథలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈసారి సేవలు విస్తృతం చేయాలని నిర్ణయించారు. ఈసారి లడ్డూ ఏకంగా రూ.18.51 లక్షలు పలికింది.

వినూత్న పద్ధతిలో వేలంపాట..

ఇక్కడ లడ్డూ వేలం సైతం వినూత్నంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ మొత్తం 190 విల్లాలు ఉన్నాయి. ఆయా విల్లాల నుంచి ముందుకు వచ్చిన వారిని గ్రూపులుగా విభజిస్తారు. ఈసారి 5 గ్రూపులుగా విభజించారు. అత్యధికంగా పాడిన గ్రూపు సభ్యులకు లడ్డూను అంజేస్తారు. అయితే వేలంలో పాల్గొన్న మిగిలిన గ్రూపుల వారు వేలంలో పోటీపడిన మేరకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా ఐదు గ్రూపుల సభ్యులు పాడిన మొత్తం రూ.18.51 లక్షలు కావడంతో లడ్డూ ధర అంత పలికినట్లుగా నిర్ణయించారు. ఈ లడ్డూను వేలంలో పాల్గొన్న అందరి ఇండ్లలోకి తీసుకెళ్లి పూజలు నిర్వహిస్తారు. సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే లక్ష్యంతో ఇలాంటి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని రిచ్‌మండ్ విల్లాస్ గణేశ్ ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

లడ్డూ వేలంలో పాల్గొన్న రిచ్‌మండ్ విల్లాస్ వాసులు

వరద నీటి వినియోగం లెక్కల్లోకి వద్దు

- **సముద్రంలోకి నీటిని విడిచిపెడుతున్నా కాలువల్లోకి పూర్తిగా విడుదల చేయడంలేదు**
- **కేటాయించిన వాటాలో మినహాయించుకుంటారనే భయమే కారణం**
- **ఈ అంశంపై తెలంగాణ అభిప్రాయమూ కోరండి**
- **కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ లేఖ**
- **18న బోర్డు సమావేశం**

ఈనాడు, హైదరాబాద్: వరద ప్రవాహం ఉండి.. నీటిని సముద్రంలోకి వదిలేస్తున్న సమయంలో వివిధ ప్రాజెక్టుల ద్వారా తీసుకొనే నీటిని పరిగణనలోకి తీసుకోవడం సరైంది కాదని ఆంధ్రప్రదేశ్ అభిప్రాయపడింది. దీనిపై రెండు రాష్ట్రాలు ఓ అభిప్రాయానికి రావాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో తెలంగాణ వైఖరిని తెలుసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు కృష్ణా నది యాజమాన్య బోర్డుకు లేఖ రాశారు. ఈ లేఖను బోర్డు తెలంగాణ నీటిపారుదలశాఖకు పంపి అభిప్రాయం కోరింది. ఈ నెల 18న కృష్ణా బోర్డు సమావేశం జరగనుంది.

ఏపీ ఈఎన్‌సీ రాసిన లేఖలోని అంశాలివీ..

- మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురిసిన భారీ వర్షాలకు జులై నుంచి ఆగస్టు వరకు వచ్చిన వరదతో శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు అన్ని రిజర్వాయర్లు నిండాయి. అదనంగా వచ్చిన వరదను సముద్రంలోకి వదలడం అనివార్యం. ఆగస్టు 13 నుంచి 25 వరకు 42,772 క్యూసెక్కుల నుంచి 7,49,981 క్యూసెక్కుల వరకూ నీటిని సముద్రంలోకి వదిలేశాం.
- అవసరాల మేరకే నీటిని తీసుకొంటుంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు, పత్రికల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సముద్రంలోకి వృథాగా నీరు పోతుంటే కాలువల పూర్తి సామర్థ్యం మేరకు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. అయితే ప్రాజెక్టు అధికారులు పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు నీటిని తీసుకోవడానికి సానుకూలత వ్యక్తం చేయడం లేదు. దీనికి కారణం తమకు కేటాయించిన వాటాలో మినహాయించుకొంటారని, దీనివల్ల కేటాయింపులు ముగిసిన తర్వాత అవసరానికి నీటిని తీసుకోలేమనే అభిప్రాయం ఉండటమే.
- సముద్రంలోకి వృథాగా వెళ్లే నీటిని కాలువలకు మళ్లించినప్పుడే మిగులు జలాల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులకు నీటిని ఇవ్వడం సాధ్యం అవుతుంది. మిగులు జలాలు ఉన్నప్పుడు కూడా తీసుకొనే నీటికి లెక్కకడుతుండడంతో.. ప్రాజెక్టు అధికారులు అవసరమైన మేరకే నీటిని తీసుకొని మిగిలిన నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.
- ఈ పరిస్థితిని అధిగమించడానికి సముద్రంలోకి నీరు వెళ్లే సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ కాలువలకు తీసుకొనే నీటిని లెక్కల్లోకి తీసుకోకుండా విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

811 టీఎంసీలకు మించి వచ్చే నీటిని ఎలా వినియోగించుకోవాలి!

వరద నీటి వినియోగం, ఎక్కువ నీటిని మళ్లించి తక్కువగా చూపుతున్నారనే ఫిర్యాదులు, డ్యాంల నిర్వహణ, సంయుక్త తనిఖీలు ఇలా పలు అంశాలపై చర్చించేందుకు ఈ నెల 18న కృష్ణా యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లను ఆహ్వానించింది. బచావత్ ట్రైబ్యునల్ ప్రకారం కేటాయింపు ఉన్న 811 టీఎంసీలకు మించి వచ్చే నీటిని ఎలా వినియోగించుకోవాలన్న దానిపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. పోతిరెడ్డిపాడు నుంచి ఎక్కువ నీటిని తీసుకుని తక్కువగా చూపుతున్నారని తెలంగాణ ఫిర్యాదు చేసింది. ఉమ్మడి తనిఖీలకు అనుమతించడం లేదని పేర్కొంది. నాగార్జునసాగర్ కాలువల కింద తీసుకున్న నీటికి, లెక్కల్లో చెప్పినదానికి తేడా ఉందని బోర్డు గుర్తించి లేఖ రాసినట్లు తెలిసింది. ఇటీవల వరద సమయంలో శ్రీశైలం గేట్ల నిర్వహణలో వైఫల్యం చోటుచేసుకున్నట్లు బోర్డు అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. దీనిపైనా సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం.

సాగు ప్రాజెక్టుల టెండర్లన్నీ రద్దు

- **అధిక ధరకు దాఖలైన వాటిపైనా దృష్టి**
- **ఏపీ ముఖ్యమంత్రి జగన్**

ఈనాడు, అమరావతి: జలవనరుల శాఖలో కొత్తగా చేపట్టి, 25 శాతంలోపు మాత్రమే పనులు పూర్తయిన ప్రాజెక్టుల్లో టెండర్లను రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వం దాదాపుగా నిర్ణయించింది. ఇందులో ఐబీఏం (ఇంటర్నల్ బెంచ్ మార్క్) విలువ కన్నా అధిక ధరలకు దాఖలైన టెండర్లను తక్షణమే రద్దు చేయాలని పేర్కొంది. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా వీటిపై నిర్ణయాలు తీసుకోవాలని ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుల్లో అవసరమైన పనులకు మాత్రమే రివర్స్ టెండర్లు నిర్వహించాలని ఆదేశించారు. ఐబీఏం విలువ కన్నా తక్కువకు దాఖలైన టెండర్లలో 25 శాతంలోపు పని జరిగితే వాటిని పునఃపరిశీలించాలని సూచించారు. గురువారం జలవనరులశాఖపై జగన్ సమీక్షించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలంటే రూ.లక్ష కోట్లకు పైగా అవసరమవుతాయన్నారు. వీటిపై ఏడాదికి రూ.10 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగల నేపథ్యంలో ప్రాజెక్టుల ప్రాధాన్యక్రమాన్ని తేలుస్తూ నివేదికలు సిద్ధం చేయాలన్నారు.కృష్ణా వరద 120 రోజులు వస్తుందనుకునే లెక్కలు సవరించుకోవాలని సీఎం చెప్పారు. 30, 40 రోజులు మించి వరద ఉండబోదన్న అంచనాతో ఆ సమయంలోనే కృష్ణా జలాశయాలన్నీ ఎలా నింపాలో ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు.

దిల్లీ వర్సిటీ ఎన్నికల్లో 'తెలుగు' విజయం

- **నాలుగున్నర దశాబ్దాల తర్వాత ఇరు రాష్ట్రాల విద్యార్థులకు ప్రాతినిధ్యం**

అనుగు అంజలా రెడ్డి ★ దేవరపు వెంకటేశ్

ఈనాడు, దిల్లీ: దిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన దేవరపు వెంకటేశ్, అనుగు అంజలారెడ్డి ఘన విజయం సాధించారు. వారిద్దరూ స్వతంత్ర అభ్యర్థులుగా దిల్లీ వర్సిటీ పరిధిలోని వేర్వేరు కళాశాలల నుంచి సెంట్రల్ కౌన్సిల్ అభ్యర్థులుగా గెలుపొందారు. ఆ కళాశాలలు రెండూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇచ్చే ర్యాంకింగ్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఉండటం విశేషం. యూనివర్సిటీ పరిధిలోని 87 కళాశాలలకు నిర్వహించిన ఎన్నికల్లో గురువారం సెంట్రల్ కౌన్సిల్ అభ్యర్థుల ఫలితాలు విడుదల చేశారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి.

- తెలంగాణలోని జగిత్యాల జిల్లా అల్లాపూర్‌కు చెందిన అనుగు అంజలారెడ్డి మిరండా కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆమె తన సమీప ప్రత్యర్థిపై 264 ఓట్ల మెజారిటీతో గెలుపొంది సెంట్రల్ కౌన్సిల్‌గా ఎన్నికయ్యింది. అంజలా రెడ్డి యూనివర్సిటీలో ఆ కళాశాల ప్రతినిధిగా వ్యవహరిస్తుంది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఇచ్చే ర్యాంకింగ్‌లో మిరండా కళాశాల తొలి ర్యాంకులో కొనసాగుతోంది.
- ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన దేవరపు వెంకటేశ్ హిందూ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి సమీప ప్రత్యర్థిపై రికార్డు స్థాయిలో 654 ఓట్ల మెజారిటీ సాధించి సెంట్రల్ కౌన్సిల్‌గా ఎన్నికయ్యాడు. వెంకటేశ్ ఇకపై యూనివర్సిటీలో ఆ కళాశాల ప్రతినిధిగా వ్యవహరిస్తాడు.

చిన్న కాళేశ్వరం పథకానికి పర్యావరణ అనుమతి!

ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: గోదావరి నదిపై జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కన్నెపల్లి వద్ద నిర్మిస్తున్న కాళేశ్వరం(చిన్న) ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతుల మంజూరు కోసం పర్యావరణ సలహా కమిటీ(ఈఏసీ) కేంద్రానికి సిఫార్సు చేసింది. ఈ మేరకు ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్ల వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. గత నెల 20వ తేదీన దిల్లీలో జరిగిన కమిటీ సమావేశానికి హాజరై ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాలు అందజేసినట్లు పేర్కొన్నారు. సంతృప్తి చెందిన ఈఏసీ పూర్తిస్థాయి పర్యావరణ అనుమతుల మంజూరుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేసిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద ఈ ఏడాది యాసంగి పంటకు మొదటి దశలో సాగునీరు ఇవ్వనున్నామని, ఈఏసీ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. గోదావరి నది నుంచి 4.5 టీఎంసీలు ఎత్తిపోసేందుకు రూ.499.23 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటికే యాభైశాతం పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు నీటి ద్వారా మహదేవ్‌పూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్‌రావు మండలాల్లోని 50 చెరువులు నింపనున్నారు. వీటి ద్వారా వానాకాలం పంటల కింద 35 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. 63 గ్రామాలకు తాగునీరు కూడా అందించనున్నారు.

పరుగు తగ్గని కృష్ణమ్మ

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా నదిలో వరద పెరుగుతూ వస్తోంది. గురువారం సాయంత్రానికి ఆలమట్టి, నారాయణపూర్‌ల నుంచి దిగువకు 2 లక్షల క్యూసెక్కులకు పైగా వరద ప్రవాహం వస్తోంది. కర్ణాటకలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. ఆలమట్టి నుంచి పులిచింతల వరకు ప్రాజెక్టులన్నీ రెండోసారి నిండాయి. దీంతో వస్తున్న వరదను దిగువకు వదిలేస్తున్నారు. మరోవైపు నాగార్జునసాగర్ దిగువన ప్రవాహం జోరు తగ్గింది. ప్రకాశం బ్యారేజి నుంచి సముద్రంలోకి రెండు లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని వదులుతున్నారు.

సాగర్ జలాశయ అంతర్భాగంలో నీపేజ్ వాటర్

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్‌కు వరద నీరు భారీగా రావడంతో జలాశయ అంతర్భాగంలో సీపేజీ వాటర్ పెరిగింది. ఈ నీటిని మోటార్ల సాయంతో బయటకు పంపుతున్నారు. సాగర్‌డ్యాం అంతర్భాగంలోకి వెళ్లేందుకు 420 స్యాలరీ లిఫ్ట్ ద్వారా వెళ్లాల్సి ఉంది. లిఫ్ట్ చెడిపోవడంతో డ్యామ్ అంతర్భాగానికి వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

త్వరలో స్వదేశీ డ్రైవర్ రహిత కార్లు

విప్రో అధ్యక్షుడు అజిమ్ ప్రేమ్‌జీ ప్రకటన

ఈనాడు డిజిటల్, బెంగళూరు: భారతీయ శాస్త్ర సాంకేతిక విజ్ఞాన సంస్థ (ఐఐఎస్‌సీ), విప్రో ఐటీ విభాగాలు సంయుక్తంగా చేపడుతున్న ఐటీ సీజార్ ప్రాజెక్టు ఫలితంగా త్వరలో స్వదేశీ పరిజ్ఞానంతో డ్రైవర్ రహిత కార్లు రాబోతున్నాయని విప్రో వ్యవస్థాపక అధ్యక్షుడు అజిమ్ ప్రేమ్‌జీ ప్రకటించారు. ఆయన గురువారం బెంగళూరులోని ఐఐఎస్‌సీ స్నాతకోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఐఐఎస్‌సీతో గతంలో చేసుకున్న ఒప్పందాల ఫలితంగా అత్యున్నత సాంకేతిక వ్యవస్థలను విప్రోలో పొందుపరిచామన్నారు. ఇందులో భాగంగానే పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న 'మెటల్ 3-డీ ప్రింటింగ్ మిషన్' ద్వారా డ్రైవర్ లేని కార్లు తయారవుతున్నాయన్నారు. జీపీఎస్, రాడార్, సోలార్ సిగ్నల్స్‌తో డ్రైవర్ లేకున్నా తన మార్గాన్ని నిర్దేశించుకునే కార్లు దేశ రహదార్లపై సంచరిస్తాయన్నారు. ఇరు సంస్థల ఒప్పందాలతో విద్య, పరిశోధన, పారిశ్రామిక, పౌర, సామాజిక, ప్రభుత్వ రంగాల్లో వినూత్న సేవలకు అవకాశం లభించిందని తెలిపారు. సహృదయంతో సేవలందించే సంస్థలు సమాజానికి సేవలే అందిస్తాయి తప్ప వ్యాపారం చేయవన్నారు. 'ఇప్పుడంటే విప్రో ప్రపంచవ్యాప్తంగా పేరు సంపాదించుకుంది. కానీ మా ఐటీ వ్యాపారం తొలుత ప్రారంభమైంది ఐఐఎస్‌సీలోనే. ఇది ఒకరకంగా విప్రోకు పుట్టిల్లు వంటిది.' అంటూ అజిమ్ ప్రేమ్‌జీ భావోద్వేగంతో వెల్లడించారు. ఐఐఎస్‌సీ ఆలోచనల ద్వారా వృద్ధి చేసిన చిప్‌లు, మైక్రో సెన్సార్‌లతోనే విప్రోలో తొలిసారిగా కంప్యూటర్లను వినియోగించినట్లు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇస్రో మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకునే సంస్థలన్నీ విజయాలతోనే ప్రయాణాలు కొనసాగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎస్‌సీ సంచాలకుడు ఆచార్య అనురాగ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 883 మందికి పట్టాలు అందజేయగా వీరిలో 402 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ, 63 మందికి స్వర్ణ పతకాలు అందజేశారు.

కర్నూలు జిల్లా పగిడిరాయిలో బ్యాటింగ్ చేస్తున్న గిల్‌క్రిస్ట్

కోతల్లేవా.. బిల్లు తక్కువా?

గ్రామస్థులను ప్రశ్నించిన ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ గిల్‌క్రిస్ట్

ఈనాడు డిజిటల్, కర్నూలు: "మీ గ్రామంలో విద్యుత్తు కోతల్లేవా.. బిల్లులు తక్కువగానే వస్తున్నాయా" అంటూ ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ గ్రామస్థులను ప్రశ్నించాడు. ఇళ్లకు సౌరవిద్యుత్ అందించేందుకు కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పగిడిరాయిని 'విలేజ్ ఎనర్జీ' సంస్థ పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసింది. ఈ సంస్థకు ప్రచారకర్తగా, భాగస్వామిగా ఉన్న గిల్‌క్రిస్ట్ ప్రాజెక్టు పనితీరును తెలుసుకునేందుకు గురువారం ఈ గ్రామానికి వచ్చాడు. సంస్థ ఎంపికచేసిన 130 ఇళ్లను చూపించడంతో పాటు, సంస్థ వ్యవస్థాపకులు బెన్ హామిల్టన్, ఇవాన్ పవర్ దగ్గరుండి వినియోగదారులతో మాట్లాడించారు. 'ఇదివరకు కోతలుంటే మా పనులు నిలిచిపోయేవి. ఇప్పుడు ఎక్కువ దుస్తులు కుట్టి ఆదాయం గడిస్తున్నాం' అని దర్జీ వెంకటేష్ చెప్పారు. గతంలో కోతలతో ఫ్రిజ్ పనిచేయక పాలు, ఇతర పదార్థాలు చెడిపోయేవని, సౌరవిద్యుత్తుతో ఆ నష్టాన్ని పూడ్చుకున్నామని కిరాణా దుకాణం యజమాని కుమార్ తెలిపారు. అనంతరం గిల్‌క్రిస్ట్ ప్రాథమిక పాఠశాల భవనంపై ఏర్పాటుచేసిన సౌరఫలకాలను చూసి, విద్యార్థులతో సెల్ఫీలు దిగాడు. పాఠశాల మైదానంలో యువకులిచ్చిన బ్యాట్ తీసుకుని క్రికెట్ ఆడాడు. గిల్‌క్రిస్ట్‌కు బౌలింగ్ చేసేందుకు యువకులు పోటీపడ్డారు. ఓ యువకుడు వేసిన బంతికి గిల్‌క్రిస్ట్ బౌల్డ్ అయ్యాడు.

యూరియా కొరత తీరింది

- రాష్ట్రవ్యాప్తంగా 40 వేల టన్నుల నిల్వలు
- రబీకి అవసరమైన నిల్వలు సిద్ధం చేస్తున్నాం
- వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడి
- ఏపీలోని విశాఖ, గంగవరం ఓడరేవుల సందర్శన

ఈనాడు, హైదరాబాద్, గాజువాక(విశాఖపట్నం), న్యూస్‌టుడే: తెలంగాణలో యూరియా కొరత తీరిందని, ఇప్పటి వరకు 7.30 లక్షల టన్నులను రైతులకు పంపిణీ చేశామని, మరో 40 వేల టన్నులు రాష్ట్రవ్యాప్తంగా నిల్వ ఉండగా.. మరో 75 వేల టన్నులు రావాల్సి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఇదిగాక ఓడరేవులతో పాటు రోడ్డు, రైల్వే మార్గాల నుంచి మరింత ఎరువును తెప్పిస్తున్నామని చెప్పారు. రబీకి కూడా నిల్వలు సిద్ధం చేస్తున్నామన్నారు. గురువారం ఆయన తమ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథితో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, గంగవరం ఓడరేవులను సందర్శించారు.

విశాఖ ఓడరేవులో గురువారం యూరియాను పరిశీలిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి. చిత్రంలో ఓడరేవు అధికారులు

వియత్నాం నుంచి వచ్చిన యూరియా నౌకను గంగవరం రేవులో పరిశీలించారు. యూరియా గోదాము, వ్యాగన్లతో పాటు శ్రావణి గోదాములో ఎన్ఎఫ్ఎల్ యూరియా ప్లాంట్, క్రిబ్‌కో ప్లాంట్ల వద్దకు వెళ్లారు. రైల్వే వ్యాగన్‌లోకి ఎగుమతి చేస్తున్న యూరియాను చూశారు. తెలంగాణలో రైతుల అవసరాల దృష్ట్యా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సరకును తరలిస్తోందని, దానిని సత్వరమే సరఫరా చేసేందుకు సహకరించాలని కార్మికులు, రవాణాదారులను కోరారు. అవసరమైతే మూడు పూటలూ పనిచేయాలని కోరగా.. ఇందుకు సహకరిస్తామని కార్మికులు హామీ ఇచ్చారు. అనంతరం నిరంజన్‌రెడ్డి గంగవరం ఓడరేవు సీఈవో, మాజీ డీజీపీ నండూరి సాంబశివరావు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. సత్వర రవాణాకు సహకరిస్తామని సీఈవో చెప్పారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ 'సెప్టెంబరు కోటా కింద 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఇవ్వాలని కోరగా కేంద్రం అంగీకరించింది. ఇందులో 1.25 లక్షల టన్నులు రాష్ట్రానికి వచ్చింది. మరో 75 వేల టన్నులు రావాలి. విదేశాల నుంచి వచ్చే యూరియా వీలైనంత త్వరగా తరలించేందుకు ప్రయత్నిస్తున్నాం. వాతావరణ సమస్యల వల్ల కొంత ఇబ్బందవుతోంది. వర్షం పడితే రవాణా ఏమాత్రం సాధ్యం కాదు. అన్నింటినీ అధిగమించి రవాణా జరుపుతున్నాం. తెలంగాణకు యూరియా సరఫరాకు సహకరిస్తున్న ఓడరేవు, రైల్వే, ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు. గోదాముల్లోని నిల్వలను రైతులకు పంపిణీ చేస్తున్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో యూరియా సరఫరా, పంపిణీపై నిఘా వేశాం. త్వరలోనే అన్ని జిల్లాలను సందర్శిస్తాను" అని మంత్రి చెప్పారు.

రేహాన్‌కు సీఎం సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు

- ఈనాడు కథనానికి స్పందన
- ఆర్థిక సాయంపై ట్విటర్‌లో తెలిపిన మంత్రి కేటీఆర్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: 'కాళ్లు లేవు.. నడిపించే నాన్నా లేడు' అనే శీర్షికన ఆగస్టు 23న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన మంత్రి కేటీఆర్ గురువారం సీఎం సహాయ నిధి నుంచి బాధిత కుటుంబానికి రూ.3 లక్షలు మంజూరు చేయించారు. ఝరాసంగం మండలం కుప్పానగర్‌కు చెందిన రేహాన్‌కు రెండు కాళ్లు లేవు. తండ్రి లేకపోవడం.. తల్లికి సైతం కాలు లేకపోవడం, చెల్లి చనిపోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ఈ మానవీయ కథనాన్ని కిందటి నెలలో 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చింది. దీనికి తెరాస రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు గతంలోనే పాలనాధికారి బాలుడి ఇంటికి వెళ్లి బాగోగులు తెలుసుకున్నారు. రేహాన్‌కు నిమ్స్‌లో వైద్యం చేయడానికి రూ.3.50 లక్షలు ఖర్చవుతాయని వైద్యులు నిర్ధారించారు. ఈ ప్రతిపాదనల ప్రకారం మంత్రి కేటీఆర్ గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలు మంజూరు చేసిన విషయాన్ని ట్విటర్‌లో పేర్కొన్నారు.

మాంసం శుద్ధి ప్రక్రియ మహిళల చేతికి

- సిద్దిపేటలో కొత్త యూనిట్ ఏర్పాటు
- నిర్వహణ బాధ్యత స్వయం సహాయక సంఘాల మహిళలకే
- ఎన్ఆర్‌సీఎంలో పూర్తయిన శిక్షణ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: అధునాతన వసతులు, నూతన సాంకేతికతతో రాష్ట్రంలో మాంసం శుద్ధి ప్రక్రియ (మీట్ ప్రాసెసింగ్) యూనిట్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. జాతీయ మాంస పరిశోధన సంస్థ(ఎన్ఆర్‌సీఎం) సహకారంతో సిద్దిపేట జిల్లా శివారు ఇర్కోడులో ఈ యూనిట్ ఏర్పాటు కానుంది. ఆరెకరాల విస్తీర్ణంలో రూ.రెండున్నర కోట్లతో నిర్మించేందుకు చర్యలు ఊపందుకున్నాయి. స్థల కేటాయింపు పూర్తయిన వెంటనే పనులు మొదలు కానున్నాయి. ఇక్కడ మహిళలే స్వయంగా మాంసం కోసి, శుభ్రం చేసి వాటిని మార్కెట్‌లో విక్రయించే వరకు అన్ని బాధ్యతలు చూసుకోనున్నారు. మాంసం నిర్వహణ, విక్రయాలు

మహిళలు తయారు చేసిన మాంస ఉత్పత్తులను పరిశీలిస్తున్న హరీశ్‌రావు(పాతచిత్రం)

మొదలైన అంశాలపై స్వయం సహాయక బృందాలకు చెందిన 20 మంది మహిళలు ఎన్ఆర్‌సీఎంలో నాలుగు రోజుల శిక్షణ సైతం పూర్తి చేసుకున్నారు.

మాంసోత్పత్తుల తయారీ, ఎగుమతులు

ప్రాసెసింగ్ యూనిట్‌లో మాంసంతో పాటు, ఇక్కడ తయారు చేసే మాంసోత్పత్తులు (చికెన్, మటన్ పచ్చడి) మొదలైన వాటిని స్థానిక మార్కెట్ సహా హైదరాబాద్‌కు ఎగుమతి చేయనున్నారు. డిమాండ్‌ను బట్టి మిగిలిన జిల్లాలకు వీటిని విస్తరించే వీలుంది. సుమారు రూ.20 లక్షలతో సిద్దిపేట మార్కెట్‌లో ఒక ఔట్‌లెట్(దుకాణం)తోపాటు, 'మీట్ ఆన్ వీల్స్' పేరుతో ప్రత్యేక వాహనంలో చుట్టు పక్కల ప్రాంతాలకు తిరుగుతూ మాంసం విక్రయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏడాది కాలంగా కసరత్తు

ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. దాదాపు ఏడాది కాలంగా ఈ విషయంపై ఆయన శాస్త్రవేత్తలతో చర్చలు జరుపుతున్నారు. మహిళలకు శిక్షణ సమయంలో ఎన్ఆర్‌సీఎంను సందర్శించిన ఆయన యూనిట్ ఏర్పాటు నమూనా, వసతుల కల్పన తదితర అంశాలపై సమీక్షించారు. స్థల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మరో వారం రోజుల్లో స్థలం కేటాయించి, మున్సిపల్ నిధులతో పనులు చేపడతామని సిద్దిపేట డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఛైర్మన్ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఏడాది వేతనం రూ. 45 లక్షలు

ఉద్యోగాలు పొందిన ఇద్దరు హెచ్‌సీయూ విద్యార్థులు

పంకజ్ మౌనిక

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి చెందిన ఇద్దరు ఎంటెక్ విద్యార్థులు.. ఏడాదికి రూ.45 లక్షల వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. స్కూల్ ఆఫ్ ఫిజిక్స్‌లోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ (సీఏఎస్ఈఎస్‌టీ)కి చెందిన పంకజ్, మౌనిక.. ఇటీవల ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ టెక్నాలజీలో ఎంటెక్ పూర్తి చేశారు. ఆస్ట్రియా దేశంలోని సిలికాన్ ఆస్ట్రియా ల్యాబ్స్ (ఎస్ఏఎల్) కంపెనీ.. ఇటీవల క్యాంపస్‌లో చేపట్టిన ప్రాంగణ నియామకాల్లో వీరిద్దరినీ ఎంపిక చేసింది. వీరు ఏడాదికి రూ.45 లక్షల వేతనాలు అందుకోనున్నారు. రేడియో ఫ్రీక్వెన్సీ ఐసీ డిజైన్ రీసెర్చ్ అంశం మీద వీరు పనిచేయనున్నారు.

శిక్ష సమయంలో నేరస్థుల బాధలు తీవ్రం కారాదు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: శిక్ష సమయంలో నేరస్థుల బాధలు తీవ్రమయ్యేలా నేర నిర్మూలనా వ్యవస్థ ఉండకూడదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 'జైళ్లలో జరిగే నేర సంఘటనలు, విపరీత పోకడలు- సిబ్బంది, నేరస్థులపై వాటి పరిణామాలు, వారి సంరక్షణ' అనే అంశంపై బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ సంస్థ గురువారం నిర్వహించిన రెండు రోజుల సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ "జైళ్ల వ్యవస్థ, నేరనిర్మూలన వ్యవస్థలో బాధ్యతాయుతమైన విధానాలు అవసరం. నేరస్థులకు సౌకర్యాలను పెంచాల్సిన అవసరం ఉంది. వారిలో మార్పు తీసుకురావాలి. వారు తిరిగి సమాజంలో తగిన ఉపాధి పొందేలా చూడాలి. జైళ్ల శాఖలో భవనాల లేమి, మహిళా నేరస్థుల పిల్లల సంరక్షణ, నిధులు, సిబ్బంది కొరత తదితర ఇబ్బందులను అధిగమించడానికి కేంద్రం సంస్కరణలు తీసుకొస్తోంది. జైళ్లశాఖపై ఒత్తిడి తగ్గించడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, లోక్ అదాలత్‌లు ఉన్నాయి. 199 కొత్త జైళ్లు, 1572 అదనపు బ్యారక్‌లు, 8568 సిబ్బంది క్వార్టర్లను రూ.1800 కోట్లతో నిర్మించాం. నేరస్థుల ఉపాధి కల్పనకు సంబంధించి ఎన్జీవోలు, పౌర సంస్థలను కేంద్రం ప్రోత్సహిస్తోంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు.

మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నేతలు

సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చిస్తా

యూఎస్‌పీసీ నేతలతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల అనంతరం ఉపాధ్యాయ సంఘాలు, అధికారులతో సమస్యలపై చర్చిస్తానని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అందరం కలిసి పనిచేద్దామని, ఉపాధ్యాయ సంఘాలు సహకరించాలని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, అంతర్‌జిల్లా బదిలీలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీల్లో బదిలీలు తదితర అంశాలపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) నేతలు గురువారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో చావా రవి, అశోక్‌కుమార్, రఘుశంకర్‌రెడ్డి, పోచయ్య, అహ్మద్ పాషా, మహేశ్, కైలాసం, రమేశ్ తదితరులు ఉన్నారు.

'దసరా సెలవుల్లో పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి'

విద్యాశాఖలో ఎస్జీటీలు అదే కేడర్‌లో పదవీ విరమణ చేస్తున్నారని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంకినేని మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి పదోన్నతులు కల్పించడానికి ఏకీకృత నిబంధనలు అడ్డంకి కాదని పేర్కొన్నారు. గురువారమిక్కడ జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పండిత ఉన్నతీకరణ పోస్టుల్లో కామన్ సీనియారిటీని పాటించాలని, జీవో 11, 12 ప్రకారం పదోన్నతులు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

రైల్వే ట్రైబ్యునల్ బెంచ్ హెడ్‌క్వార్టర్లుగా అమరావతి, సికింద్రాబాద్

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా 20 రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్ బెంచ్ ప్రధాన కార్యాలయాలను రైల్వేశాఖ ప్రకటించింది. ఏపీకి అమరావతి, తెలంగాణకు సికింద్రాబాద్‌లను హెడ్‌క్వార్టర్లుగా పేర్కొంది. దక్షిణాదికి సంబంధించి సికింద్రాబాద్ ప్రధాన కార్యాలయంగా ఉంటుంది. దీని పరిధిలోకి అమరావతి, బెంగళూరు, చెన్నై, ఎర్నాకుళం, సికింద్రాబాద్ ట్రైబ్యునల్ బెంచ్‌లు వస్తాయి.

కేసీఆర్.. మహాత్ముడు

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఈనాడు డిజిటల్, కరీంనగర్, గీసుకొండ, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్ట్ కలను మూడేళ్లలో సాకారం చేసిన మహానుభావుడు, పేదింట ఆడబిడ్డల పెళ్లికి కల్యాణలక్ష్మి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్న మహాత్ముడు కేసీఆర్ అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కొనియాడారు. వరంగల్ గ్రామీణ జిల్లా గీసుకొండ మండలం మరియపురం, కరీంనగర్ జిల్లా ముగ్దుంపూర్‌లో గురువారం నిర్వహించిన నెలరోజుల ప్రణాళిక కార్యక్రమ సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అన్నివర్గాల ప్రజల ఆకాంక్షల్ని సీఎం నెరవేరుస్తున్నారని అన్నారు. గ్రామాల ప్రగతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదలతో ఉన్నారని.. ఈ నెల రోజుల కార్యక్రమాన్ని సవాల్‌గా తీసుకున్నారని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం సహా పచ్చదనాన్ని పరిరక్షించడంలో భాగస్వాములయ్యేవారికి తగిన సహకారం ఉంటుందని మంత్రి తెలిపారు. రోడ్ల మీద ప్రజలు చెత్త వేసినా, బహిర్భూమికి వెళ్లినా, మురుగు నీటిని బయటకు వదిలినా జరిమానాలు విధిస్తూ సర్పంచులు గ్రామసభలో తీర్మానాలు చేయాలన్నారు. ముగ్దుంపూర్ కార్యక్రమంలో పాల్గొన్న మరో మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. నాడు పల్లెల్ని ప్రగతికి పట్టుగొమ్మలుగా మార్చేందుకు బాపూజీ కలలు కన్నారని, నేడు ఆ కలల్ని నిజం చేసే బాపూజీగా కేసీఆర్ మారుతున్నారని అన్నారు.

మన వర్సిటీలు డొల్లే

- టైమ్స్ ర్యాంకింగ్‌లో టాప్ 200లో ఒక్కటీ లేదు
- గతేడాది కంటే పడిపోయిన ర్యాంకులు

ఈనాడు, దిల్లీ: టైమ్స్ ఉన్నత విద్య ప్రపంచ ర్యాంకింగుల్లో భారతీయ విశ్వవిద్యాలయాలు దరిదాపుల్లో కనిపించలేదు. ప్రపంచ వ్యాప్తంగా 92 దేశాల్లోని 1,400 విశ్వవిద్యాలయాలను వడపోసి టైమ్స్ సంస్థ 2020 ర్యాంకులను ప్రకటించింది. ఈ జాబితాలో 56 భారతీయ విద్యాసంస్థలు నిలిచినప్పటికీ ఏవీ 300 లోపు ర్యాంకు దక్కించుకోలేకపోయాయి. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సాధించిన 301- 350 ర్యాంకే భారతీయ విద్యాసంస్థలకు దక్కిన అత్యుత్తమ ర్యాంకు. భారత్ నుంచి 1000+ ర్యాంకుల్లో 56 విద్యాసంస్థలు నిలవగా అందులో తొలి 9 స్థానాలను ఐఐఎస్‌ఈ, ఐఐటీలే దక్కించుకున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి హైదరాబాద్ ఐఐటీ టాప్‌లో నిలిచింది. ఈ సంస్థ భారత్‌లో 16వ స్థానంలో నిలవగా, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 24వ స్థానాన్ని దక్కించుకుంది. ఈసారి భారతీయ విద్యాసంస్థల్లో తొలిస్థానంలో నిలిచిన బెంగళూరు ఐఐఎస్‌ఈ ర్యాంకు నిరుటి కంటే పడిపోయింది. 2019లో 251-300 మధ్య ప్రపంచర్యాంకు దక్కగా ఈసారి 301-350కి చేరింది. విద్యాబోధనలో సంస్థ పనితీరు, పరిశోధన, విజ్ఞాన బదిలీ, ఇంటర్నేషనల్ ఔట్‌లుక్ ఆధారంగా ర్యాంకులు నిర్ధారించారు. వరుసగా నాలుగో ఏడాదీ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రపంచంలో తొలి స్థానంలో నిలిచింది.

భారత్‌లో మొదటి ఐదు వర్సిటీలు

2020 ర్యాంక్	యూనివర్సిటీ
301-350	ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు
301-350	ఐఐటీ, రూప్‌నగర్, పంజాబ్
351-400	ఐఐటీ, ఇండోర్
401-500	ఐఐటీ, బాంబే
401-500	ఐఐటీ, దిల్లీ

ప్రపంచంలో మొదటి ఐదు విద్యాసంస్థలు

2020 ర్యాంక్	యూనివర్సిటీ	దేశం
1	ఆక్స్‌ఫర్డ్	యూకే
2	కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	యూఎస్
3	యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్	యూకే
4	స్టాన్‌ఫోర్డ్	యూఎస్
5	మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	యూఎస్

తెలుగు రాష్ట్రాల్లో టాప్ విద్యాసంస్థలు

విశ్వవిద్యాలయం	2020 ప్రపంచర్యాంకు	2019
ఐఐటీ, హైదరాబాద్	601-800	601-800
ఆచార్య నాగార్జున	801-1000	801-1000
ఉస్మానియా	801-1000	801-1000
శ్రీ వెంకటేశ్వర	801-1000	801-1000
ఆంధ్రా	1000+	1000+
గీతం	1000+	1000+

షకీల్ కలకలం

- భాజపా ఎంపీ అర్వింద్‌తో భేటీ

ఈనాడు, నిజామాబాద్, హైదరాబాద్: బోధన్ తెరాస ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ గురువారం ఒక్కసారిగా వార్తల్లో నిలిచారు. ఆయన మధ్యాహ్నం హైదరాబాద్‌లో నిజామాబాద్ భాజపా ఎంపీ అర్వింద్ నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు. తెరాస నుంచి పలువురు అసంతృప్త నేతలు తమతో టచ్‌లో ఉన్నారంటూ భాజపా నేతలు తరచూ చెబుతున్న నేపథ్యంలో.. షకీల్, అర్వింద్‌ల కలయిక రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. మంత్రివర్గ విస్తరణ తర్వాత షకీల్ తెరాస అధిష్ఠానంపై అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న క్రమంలో ఆయన భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై విలేకరులు షకీల్‌ను సంప్రదించగా సొంత జిల్లాకు చెందిన ఎంపీని కలవటం సాధారణమేనంటూ చెప్పుకొచ్చారు. తన రాజకీయ ప్రస్థానం భాజపా నుంచే మొదలైందని గుర్తు చేశారు. ప్రస్తుతం గుర్తింపు లేని రాజకీయాలెందుకు? ఎమ్మెల్యే పదవికీ రాజీనామా చేయాలనిపిస్తోందంటూ కొంత వైరాగ్యంతో మాట్లాడారు. తామిద్దరం రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయాలపై మాట్లాడుకున్నామని ఎంపీ అర్వింద్ ఫేస్‌బుక్‌లో పేర్కొనడంతో వీరి భేటీపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి.

మర్యాద పూర్వకంగానే కలిశా

అనంతరం గురువారం రాత్రి హైదరాబాద్‌లో షకీల్ విలేకరులతో మాట్లాడారు. "నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌ను మర్యాదపూర్వకంగా కలిశాను. రూబన్ పథకం కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆయనను ఆహ్వానించాను. ఈ పథకానికి కేంద్ర నిధులు వచ్చినందుకే ఆయనను ఆహ్వానించాను. ఇందులో ఎలాంటి రాజకీయాలు లేవు. నేను పార్టీ మారతానంటూ దీనిపై దుష్ప్రచారం చేశారు. ఇదంతా కుట్ర. నేను కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాను. నాకు రాజకీయ భిక్ష పెట్టింది ఆయనే. 2009లో నాకు టికెట్ ఇచ్చారు. ఓడిపోయినా నా మీద నమ్మకంతో మరో రెండుసార్లు టికెట్ ఇచ్చారు. ఆయన ఆశీస్సులతో 2014, 2018 ఎన్నికల్లో గెలిచాను. నేను బతికినంత కాలం తెరాసలో కొనసాగుతాను. మంత్రి పదవి కావాలని ఎప్పుడూ సీఎం కేసీఆర్‌ను అడగలేదు. నాపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు" అని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో పార్టీని వీడే ప్రసక్తే లేదని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు రాజకీయ గాడ్‌ఫాదర్ అని, ఎప్పటికీ ఆయనను రుణపడి ఉంటానని అన్నారు. అనంతరం ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసి షకీల్ తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిశారు. ఎంపీ అరవింద్‌తో భేటీ, తదనంతర పరిణామాలపై వివరణ ఇచ్చారు.

భాజపా ఎంపీ అర్వింద్‌తో తెరాస ఎమ్మెల్యే షకీల్

నిధులున్నా ఖర్చు చేయరెందుకు?

శాఖల పనితీరుపై ఆర్థిక శాఖ సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలు నిధులను వ్యయం చేస్తున్న తీరుపై ఆర్థిక శాఖ ప్రత్యేక సమీక్ష ప్రారంభించింది. ప్రభుత్వం వివిధ రూపాల్లో నిధులు అందుబాటులోకి తెస్తున్నా కొన్ని శాఖలు వాటిని పూర్తిగా వినియోగించుకోలేని పరిస్థితులను సమీక్షిస్తోంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం వాస్తవిక వ్యయం ఆధారంగా బడ్జెట్ రూపొందించిన నేపథ్యంలో కొన్ని శాఖల నిధుల వ్యయం తీరును పరిశీలిస్తోంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి 1.46 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముఖ్యంగా రెండు అంశాలను ప్రాతిపదికగా తీసుకుంది. అందులో మొదటిది 2018-19 ఆర్థికసంవత్సరంలో చేసిన వ్యయంకాగా రెండోది ఈ ఆర్థికసంవత్సరంలో రాబడులు. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1.30 లక్షల కోట్లు మాత్రమే వ్యయం అయిన అంశాన్ని ఆర్థికశాఖ కీలకాంశంగా పరిగణించింది. కేటాయింపులు ఉన్నా కొన్ని ప్రధాన శాఖలు మినహా అత్యధిక శాఖల్లో నిధుల వ్యయం నిర్దేశించిన మేరకు కావడం లేదు. అందుకు విధానపరమైన నిర్ణయాల్లో ఆలస్యం, టెండర్లు తదితర అంశాల్లో కారణంగా కనిపిస్తోంది.

విద్యార్థినిపై లైంగిక దాడికి యత్నం

- పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు

ఆమనగల్లు, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు సమీపంలోని ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి యత్నించారు. విద్యార్థిని అప్రమత్తమై ఆటోలోంచి దూకటంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కడ్తాల్ మండలానికి చెందిన ఓ బాలిక ఆమనగల్లు సమీపంలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. గురువారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై బస్సు కోసం వేచి ఉంది. ఆ సమయంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆటో ఎక్కింది. కొంత దూరం వెళ్లాక అందులో ఉన్న ఇద్దరు యువకులు ఆమెపై లైంగిక దాడికి యత్నించగా.. ప్రతిఘటించి కిందకు దూకి కేకలు వేసింది. గమనించిన స్థానికులు ఆ యువకులను పట్టుకొని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ బాలికను ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తీసుకెళ్లారు. నిందితుల్లో ఒకరు హైదరాబాద్ పాత బస్తీకి చెందిన వ్యక్తి కాగా.. మరొకరు ఒమన్ దేశస్థుడని తెలిసింది. నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని సీఐ నర్సింహారెడ్డి చెప్పారు. ఆగిన ఆటోలో విద్యార్థిని ఎక్కిందా? లేక యువకులే బలవంతంగా ఎక్కించుకున్నారా? అనేది విచారణలో తేలుతుందని పేర్కొన్నారు.

తెలంగాణలో భాజపా ఎదుగుదల భ్రమే: ఉత్తమ్

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో భాజపా ఎదుగుదల ఓ భ్రమేనని.. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భాజపా నేతలు లీకులు ఇచ్చేది ఎక్కువ.. ఆ పార్టీలో చేరే నాయకులు తక్కువని ఎద్దేవా చేశారు. ఏఐసీసీ కార్యాలయంలో అధ్యక్షురాలు సోనియా గాంధీ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ తెలంగాణలో హిందూ, ముస్లిం, క్రైస్తవులు, ఇతర మతస్థులు కలిసి మెలిసి ఉంటారని.. మతపరంగా విభజించి లబ్ధిపొందాలనే భాజపా సిద్ధాంతాన్ని తెలంగాణ ప్రజలు ఒప్పుకోరని అన్నారు విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వ విద్యాలయం ఏ ఒక్క హామీనీ భాజపా నెరవేర్చలేదని.. ప్రజలు ఆ పార్టీని ఎందుకు ఆదరిస్తారని ప్రశ్నించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వాళ్ల బలమెంతో తెలుస్తుందన్నారు. ఏఐసీసీ సమావేశంలో సభ్యత్వ నమోదుపై చర్చించామని తెలిపారు. గతంలో దేశంలోనే ఎక్కువగా దాదాపు 18.20 లక్షల సభ్యత్వం ఉన్న రాష్ట్రం తెలంగాణ అని... ఈ దఫా అంతకు మించి చేస్తామని ఉత్తమ్ చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 30,200 బూత్‌లున్నాయని.. ఒక్కో బూత్ పరిధిలో కనీసం వంద మందిని సభ్యులుగా చేర్పుతామన్నారు. సభ్యత్వ నమోదులో నేతలందరినీ కలుపుకొని పోతామని.. ఈ అంశంపై త్వరలో పీసీసీ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏఐసీసీ మార్గదర్శకాల మేరకు రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలకు వివిధ అంశాలపై శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ విభాగం ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

తి.తి.దే. తిరుపతి మార్కెటింగ్ విభాగం వారిచే దిగువ పేర్కొన్న ఐటమ్స్ సేకరణ నిమిత్తం ఈ-టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలను లాగిన్ అవ్వవలసిన వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in. కరెంట్ టెండర్స్‌పై క్లిక్ చేసి ఆపై "మోర్" మరియు "తిరుమల తిరుపతి దేవస్థానములు- మార్కెటింగ్"ను ఎంపిక చేసుకోవలెను. తదుపరి వివరాలకుగాను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 0877- 2264079, 2264555. ఫ్యాక్స్ నెం. 0877-2264554.

క్రమ సం.	ఐటమ్ పేరు	పరిమాణం	ధరావతు రూ.లలో	డౌన్‌లోడ్ ప్రారంభ మరియు ముగింపు తేదీలు	
1	వేరుశెనగ గింజలు	8,000 కేజీలు	24,000/-	11-09-2019	18-09-2019

Roc.No.PR4/13910/Adv.No.242/PRO/2019, Dated: 12.09.2019. - కార్యనిర్వహణాధికారి

ఈనాడు

విహారి

ముందున్నది కన్నుల పండగ

దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి.. క్యాలెండర్‌లో వరుస నెలల్లో పండగలు దర్శనమిస్తున్నాయి. విహార పర్వంలోనూ పండగల కాలం ఊరిస్తోంది! ఓ దిక్కున మేళాలు.. మరోవైపున సంబరాలు.. పర్యాటక ప్రియులను సాదరంగా ఆహ్వానిస్తున్నాయ్. ఒక వేడుక సాంస్కృతిక సౌరభాన్ని వెదజల్లితే.. మరో సంరంభం సంప్రదాయ వైభవాన్ని ఆవిష్కరిస్తుంది. ఎందుకాలస్యం.. మనసు దోచే పండగలకు తరలి వెళ్దామా!

రాయల వైభవం | హంపి, కర్ణాటక

రాయల రాజధాని హంపి చారిత్రక వైభవాన్ని చూడాలనుకుంటున్నారా? అయితే హంపి వేడుకకు వెళ్లండి. ఏటా నవంబరు మొదటి వారంలో ఈ ఉత్సవం జరుగుతుంది. ఇందులో భాగంగా రాచనగరిలోని వీధులన్నింటినీ అందంగా ముస్తాబు చేస్తారు. సైనికుల కవాతులు, గజరాజుల ఊరేగింపులతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా మారిపోతుంది. నృత్య, నాటక ప్రదర్శనలు, తోలుబొమ్మలాటలు రాయల చరితను కళ్లముందుంచుతాయి.

ఎప్పుడు?: నవంబరు మొదటి వారం (తేదీ వివరాల కోసం www.karnatakatourism.org వెబ్‌సైట్‌ని సందర్శించండి)

ఇలా వెళ్లాలి: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి హోస్పేటకు రైళ్లున్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హంపి (12 కి.మీ.) చేరుకోవచ్చు.

సంప్రదాయ సందడి | కోహిమా, నాగాలాండ్

ఈశాన్య రాష్ట్రాల్లో నాగాలాండ్‌కి పండగల రాష్ట్రంగా పేరుంది. అందుకు తగ్గట్టే ఇక్కడి పల్లెల్లో తరచూ వేడుకలు జరుగుతుంటాయి. అన్ని పండగల సందడిని అందరికీ చూపుతుంది హార్న్‌బిల్ ఫెస్టివల్. దీనికి హాజరైతే గిరిజన సంప్రదాయం, సంస్కృతి గొప్పదనం తెలుస్తుంది. తమ పూర్వీకుల వైభవాన్ని నాగావాసులు ఎలా కాపాడుకుంటున్నారో అర్థమవుతుంది. భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న గిరిజనులంతా ఈ వేడుకలో పాలుపంచుకుంటారు.

ఆటపాటలతో అడవితల్లిని ఆరాధిస్తారు. సంప్రదాయ నృత్యరీతులను ప్రదర్శిస్తూ.. వారసత్వాన్ని భావితరాలకు అందిస్తారు. కోహిమా సమీపంలోని నాగా హెరిటేజ్ విలేజ్‌లో జరిగే ఈ సంబరాన్ని చూసేందుకు విదేశాల నుంచీ పర్యాటకులు వస్తారు.

ఎప్పుడు?: డిసెంబరు 1 నుంచి 10 వరకు

ఇలా వెళ్లాలి: కోల్‌కతా నుంచి డిమాపుర్‌కు నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ఉన్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కోహిమా (74 కి.మీ.) చేరుకోవచ్చు. దిల్లీ, కోల్‌కతా, గువాహటి నుంచి డిమాపుర్‌కు రైళ్లున్నాయి.

అందెల రవళి.. | కోణార్క్, ఒడిశా

ఒడిశాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కోణార్క్. ప్రత్యక్ష నారాయణుడు కొలువుదీరిన కోణార్క్ ఆలయంలో అణువణువూ కళాత్మకమే. ఏటా డిసెంబరులో ఇక్కడ అద్భుతమైన నృత్యోత్సవం జరుగుతుంది. లబ్ధప్రతిష్ఠులైన కళాకారులు ప్రదర్శించే భారతీయ సంప్రదాయ నృత్యరీతులన్నీ చూడాలని ఎందరో కోణార్క్ బాట పడతారు. ఐదు రోజుల ఉత్సవంలో ప్రతి సాయంత్రం కళారాధనే. ప్రతి నిమిషం మనోహరమే. ఇదే సమయంలో పూరి బీచ్ ఫెస్టివల్ జరుగుతుంది.

దేశదేశాలకు చెందిన సుప్రసిద్ధ సైకత శిల్పులు తమ ఊహల్లోని ఆలోచనలకు పూరి తీరంలో ఇసుకతో ప్రాణప్రతిష్ఠ చేస్తారు. వేడుకలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు, పడవ పందేలు, కబడ్డీ పోటీలు, బీచ్ పార్టీలు, ఫ్యాషన్ షోలు అదనపు ఆకర్షణగా నిలుస్తాయి.

ఎప్పుడు?: డిసెంబరు 1 నుంచి 5 వరకు

ఇలా వెళ్లాలి: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి ఖుర్దా రోడ్ జంక్షన్ వరకు రైలులో వెళ్లాలి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కోణార్క్ (59 కి.మీ.) చేరుకోవచ్చు.

- హైదరాబాద్, విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ఉన్నాయి. భువనేశ్వర్ నుంచి ట్యాక్సీలు, బస్సుల్లో కోణార్క్ (72 కి.మీ.) చేరుకోవచ్చు.

రామచరిత కనరయ్యా | వారణాసి, ఉత్తర్‌ప్రదేశ్

అణువణువూ ఆధ్యాత్మికత తొణికిసలాడే వారణాసిలో రామ్‌లీలా మేళా ప్రత్యేకమైంది. తులసీదాస్ రచించిన 'రామచరిత మానస్' ఆధారంగా కళాకారులు రామాయణాన్ని ప్రదర్శిస్తారు. వివిధ వేదికలపై వివిధ ఘట్టాలను కళ్లకు కడతారు. దసరా సందర్భంగా కాశీలో వీధివీధిలో రామాయణ కావ్యాన్ని ఆవిష్కరిస్తారు.

ఎప్పుడు?: సెప్టెంబరు 9 నుంచి అక్టోబరు 9 వరకు

ఇలా వెళ్లాలి: హైదరాబాద్ నుంచి వారణాసికి నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ఉన్నాయి. హైదరాబాద్, విజయవాడ నుంచి రైళ్ల అందుబాటులో ఉన్నాయి.

ఓ లుక్కేయండి

ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ధర్మశాల	నవంబరు 7-10
ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, గోవా	నవంబరు 20-28
ఆరెంజ్ ఫెస్టివల్, జంపూయ్‌హిల్స్, త్రిపుర	నవంబరు 1-30
గజమేళా, సోన్‌పూర్, బిహార్	నవంబరు 12 - డిసెంబరు 13
చెర్రీ బ్లోసమ్, షిల్లాంగ్, మేఘాలయ	నవంబరు 13-16
జానపద మేళా, జోధ్‌పుర్, రాజస్థాన్	అక్టోబరు 10-14

మెగా మేళా | పుష్కర్, రాజస్థాన్

రాజస్థాన్‌లో ప్రముఖ పుణ్యక్షేత్రం పుష్కర్. భారతదేశంలో బ్రహ్మదేవుడి ఆలయం ఉన్న ఏకైక క్షేత్రమిది. ఏడాది పొడవునా యాత్రికులు వస్తుంటారు. నవంబరులో బ్రహ్మదేవుడి దర్శనంతో పాటు ఇక్కడ జరిగే ఒంటెల మేళాను చూడడానికి పర్యాటకులు పుష్కర్ చేరుకుంటారు. వారం రోజులు జరిగే ఉత్సవాలకు సుమారు నాలుగున్నర లక్షల మంది వస్తారు. మేళాలో ఒకవైపు ఒంటెల క్రయవిక్రయాలు సాగితే.. మరోవైపు ఆటపాటలు అందరినీ అలరిస్తాయి. భారీ రంగుల రాట్నాలు, ఒంటెలపై స్వారీలు, కళాకారుల ప్రదర్శనలు, జానపదుల గళవిన్యాసాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. రాజస్థానీ రుచుల ఘుమఘుమలు మరపురాని ఆతిథ్యాన్ని అందిస్తాయి.

ఎప్పుడు?: నవంబరు 4-12

ఇలా వెళ్లాలి: పుష్కర్.. జైపుర్ నుంచి 145 కి.మీ. దూరంలో ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ నుంచి అజ్మీర్‌కు రైళ్లున్నాయి. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పుష్కర్ (15 కి.మీ.) చేరుకోవచ్చు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి జైపుర్‌కు రైళ్లున్నాయి. అక్కడి నుంచి బస్సులు, ట్యాక్సీల్లో పుష్కర్ వెళ్లొచ్చు. హైదరాబాద్ నుంచి జైపుర్‌కు నాన్‌స్టాప్ విమాన సర్వీసులు ఉన్నాయి.

రన్ రాజా రణ్ | కచ్, గుజరాత్

ఎడారి సీమలో ఎడతెగని సంబరం రణ్ ఉత్సవ్. గుజరాత్ కచ్ ప్రాంతంలోని ధోర్డో ఈ వేడుకకు వేదిక. కరవు సీమ కచ్ గతిని మార్చిన రణ్ ఉత్సవ్‌కు లక్షలాదిగా పర్యాటకులు తరలి వస్తారు. తెల్లటి ఇసుక తిన్నెల్లో, వెన్నెల రాత్రులు గడుపుతారు. ఉప్పూరిన మైదానంలో మనసు విప్పారేలా ఆటపాటల్లో తేలిపోతారు. టెంట్ విలేజ్‌లో గుడారాల్లో బస, గుజరాతీ రుచులు, సంప్రదాయ ఆటపాటలు మరింత ఆనందాన్ని పంచుతాయి. రాక్ క్లైంబింగ్, ర్యాపెలింగ్ వాల్, పెండలమ్ స్వింగ్, జిప్‌లైన్ టవర్, పారా సెయిలింగ్ వంటి క్రీడలు యువతకు కావాల్సినంత వినోదాన్ని పంచుతాయి.

ఎప్పుడు: అక్టోబరు 28-2020 ఫిబ్రవరి 23

ఇలా వెళ్లాలి: రణ్ ఉత్సవ్ జరిగే ధోర్డో.. రాజ్‌కోట్ నుంచి 140 కి.మీ. దూరంలో ఉంటుంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి రాజ్‌కోట్‌కు రైళ్లున్నాయి. అక్కడి నుంచి భుజ్ మీదుగా ధోర్డో చేరుకోవచ్చు.

లాలీ.. లాలీ.. ఊగాలి..

చీరతో ఊయల కట్టి.. లాలిపాట పాడుతూ ఉంటే ఏ బుజ్జాయైనా ఆదమరచి నిద్దరోవాల్సిందే! అమ్మపొత్తిళ్లలో దొరికే స్పర్శ.. ఆ ఊయలలో లభిస్తుందేమో! అందుకే పద్ధతిగా ఒదిగిపోయి బజ్జుంటారు. ఆనాడు ఆ పసిమనసుకు కలిగిన అనుభూతి పెద్దయ్యాక గుర్తుండదు. అలాంటి అనుభవాన్ని మళ్లీ అందిస్తోంది బాలిలోని ఫోర్ సీజన్ రిసార్ట్. గ్యాడ్జెట్ల గోలలో చిక్కి, టెక్నాలజీ ఊసులు పంచుకుంటున్న ప్రజలు.. విహారానికేగినా అదే ధ్యాసలో కాలం గడిపేస్తున్నారట. వైఫైలో చిక్కుకుని ప్రకృతి ఒడిలోనూ నిద్రకు దూరమవుతున్నారట. అందుకే ఈ విధానానికి శ్రీకారం చుట్టింది బాలి రిసార్ట్. భారీ వస్త్రంతో ఏర్పాటు చేసిన ఊయలలో పడుకోవడమే చేయాల్సింది. సేవకులు వచ్చి ఊయలూపుతూ జోల పాడుతారు. ఇంకేముంది కునుకమ్మ వచ్చేస్తుంది. గాఢ నిద్ర పట్టేస్తుంది. బాల్య స్మృతులు మదిలో మెదిలే అవకాశమూ ఉంది.

అనంతగిరి వాలులో..

మన్యం సీమలో అనంతగిరిది ప్రత్యేక స్థానం. సముద్ర మట్టానికి 3,100 అడుగుల ఎత్తులో ఉన్న ప్రకృతి కేంద్రానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. కొండలు, కోనలే కాదు.. ఇప్పుడు ఇక్కడ బస కూడా అద్భుతమే! ఇటీవల అందుబాటులోకి వచ్చిన హరితా రిసార్ట్.. అందరినీ ఆకర్షిస్తోంది. భారీ కొండపై నిర్మించిన గదులు చుట్టూ ఉన్న ప్రకృతి సంపదను మరింత అందంగా ఆస్వాదించేలా చేస్తున్నాయి. కొండపై ఉన్న శిలలను కదపకుండా వీటిని కట్టించారు. రిసార్ట్ లోపలికి వెళ్లగానే ఆహ్వానం పలికే రాతి నిర్మాణం, కొండ రాయిపైనే మెట్లను మలిచిన తీరు, వివిధ ఆకృతుల్లో దర్శనమిచ్చే శిలలు.. మనసును కట్టిపడేస్తాయి. బాల్కనీలో కూర్చొని అనంతగిరి కాఫీ లాగిస్తూ.. పొగ మంచు కమ్ముకున్న పరిసరాలను చూస్తూ.. భారీ వృక్షాలను పరీక్షిస్తూ.. పక్కనున్న లోయలను పరిశీలిస్తూ.. గంటల కొద్దీ కాలక్షేపం చేయొచ్చు. ఆ లోయల్లో ఉండే గిరిజన గ్రామాలు పచ్చ తివాచీపై పరిచిన ఆటబొమ్మల్లా కనువిందు చేస్తాయి. ఇన్ని విశేషాలు ఉండటంతో కొండవాలులో ఉన్న వసతి గృహాల్లో బస కోసం పర్యాటకులు పోటీ పడుతుంటారు. ముందస్తుగా బుక్ చేసుకొని మరీ అనంతగిరికి ప్రయాణం కడుతున్నారు. tourism.ap.gov.in వెబ్‌సైట్‌లో గదులు బుక్ చేసుకోవచ్చు.



– సురేశ్ రావివలస, విశాఖపట్నం

బుక్ నౌ

అలలపై తేలిపోదాం

భారీ నౌకా విహారానికి సన్నద్ధమవ్వండి. ముంబయి నుంచి కడలిపై తేలిపోతూ మాల్దీవుల వరకూ సాగిపోండి. కోస్టా విక్టోరియా క్రూజ్ త్వరలోనే ప్రయాణానికి సిద్ధమవుతోంది మరి. నవంబరు 9 నుంచి 28 వరకు ముంబయి-మాల్దీవులు-ముంబయి మధ్య ప్రయాణించనుంది. ఈ ప్యాకేజీలో ముంబయి, మంగళూరు, కొచ్చి, మాల్దీవులు, శ్రీలంక తీరాలు చూడొచ్చు. ఆయా పర్యాటక ప్రాంతాల్లోని విశేషాలను చుట్టిరావొచ్చు. ముంబయి-మాల్దీవులు ఏడు రాత్రులు, ముంబయి-కొచ్చి నాలుగు రాత్రులు, కొచ్చి-మాల్దీవులు మూడు రాత్రుల ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. ప్యాకేజీ ధర, ఇతర వివరాల కోసం www.costacruises.com/ వెబ్‌సైట్‌ని సందర్శించండి.

సమరానికి సిద్ధమైన 'సైరా'

18న ట్రైలర్ విడుదల వేడుక

'సైరా నరసింహారెడ్డి'లో చిరంజీవి

చిరంజీవి కథానాయకుడిగా నటించిన చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. సురేందర్‌రెడ్డి దర్శకుడు. అక్టోబరు 2న విడుదల అవుతోంది. ఈనెల 18న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో 'సైరా' ట్రైలర్‌ని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌తో పాటు సినీ ప్రముఖులు పవన్ కల్యాణ్, ఎస్. ఎస్. రాజమౌళి, వి. వి. వినాయక్, కొరటాల శివ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. రామ్‌చరణ్ నిర్మించిన ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్ ఓ కీలక పాత్ర పోషించారు. నయనతార, తమన్నా, జగపతిబాబు, సుదీప్, విజయ్ సేతుపతి ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ చిత్రం విడుదల కానుంది.

తాతామనవళ్ల ఆనందం

ఈనాడు సినిమా

సాయిధరమ్ తేజ్, సత్యరాజ్

ఆనందం అంటే... ఎవరికి వాళ్లు సంతోషంగా ఉండడం కాదు. చుట్టూ ఉన్నవాళ్ల పెదాల్లో నవ్వులు పూయించడం. పండగ అంటే ఆ ఇంట్లోనే పరమాన్నం పండుకుని తినడం కాదు. ఉన్నది నలుగురికీ పంచడం. అప్పుడే ప్రతి లోగిలి స్వర్గధామం అవుతుంది. ప్రతి మనిషీ ఓ రుషిలా మారతాడు. తన కుటుంబంలోనూ అలాంటి వాతావరణం చూడాలనుకున్నాడో కుర్రాడు. అందుకోసం ఏం చేశాడో తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే అంటున్నారు మారుతి. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రతిరోజూ పండగే'. సాయిధరమ్ తేజ్ కథానాయకుడు. రాశీ ఖన్నా నాయిక. సత్యరాజ్ కీలక పాత్రధారి. బన్నీ వాస్ నిర్మాత. అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. ఇటీవల ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "సత్యరాజ్, సాయిధరమ్ తేజ్ తాత మనవళ్లుగా నటిస్తున్నారు. వాళ్ల అనుబంధం చుట్టూ నడిచే కథ ఇది. అందుకే వారిద్దరిపై మోషన్‌పోస్టర్ రూపొందించాం. దానికి మంచి స్పందన వస్తోంది. కుటుంబ విలువలకు, అనుబంధాలకూ పట్టం కట్టే కథ ఇది. వినోదానికే ప్రాధాన్యం ఉంది. రావు రమేష్ పాత్ర కూడా ఆకట్టుకుంటుంది" అన్నారు. సంగీతం: తమన్



నాగచైతన్య

అదే నువ్వు అదే నేను?

ఒకేసారి నాలుగైదు సినిమాల్ని సెట్స్‌పైకి తీసుకెళ్లగల సామర్థ్యం ఉన్న నిర్మాతల్లో దిల్‌రాజు ఒకరు. ఆయన సినిమాలన్నీ ఒక ప్రణాళిక ప్రకారం సాగిపోతాయి. ప్రతి సీజన్‌లోనూ ఆయన్నుంచి ఒక సినిమా రావడం పరిపాటిగా మారింది. ఇప్పుడు ఆయన మరో చిత్రాన్ని పట్టాలెక్కించడానికి సిద్ధం అవుతున్నారు. ఈ చిత్రంలో నాగచైతన్య, రష్మిక జంటగా నటిస్తారని తెలుస్తోంది. శశి అనే యువకుణ్ని దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు. ఈ చిత్రానికి 'అదే నువ్వు.. అదే నేను' అనే టైటిల్ నిర్ణయించినట్టు సమాచారం. స్క్రిప్టు కూడా సిద్ధమైనట్టు తెలుస్తోంది. అటు చై, ఇటు రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. వీరిద్దరి కాల్షీట్లు కుదరగానే ఈ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది.

రష్మిక

'అవతార్ 2'పై నమ్మకాన్ని పెంచింది 'అవెంజర్స్'



జేమ్స్ కామెరూన్

'అవతార్'కు సీక్వెల్‌గా 'అవతార్ 2'ని తెరకెక్కించే పనిలో ఉన్నారు దర్శకుడు జేమ్స్ కామెరూన్. ఈ సినిమా విజయంపై తను దీమాగా ఉండటానికి కారణం 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' అంటున్నారు కామెరూన్. 'అవతార్' రికార్డును 2.796 బిలియన్ డాలర్ల వసూళ్లు సాధించి 'అవెంజర్స్ ఎండ్‌గేమ్' బద్దలు కొట్టడం, ఆ సందర్భంగా 'అవెంజర్స్' చిత్రబృందాన్ని కామెరూన్ ప్రశంసించడం తెలిసిందే. తాజాగా జేమ్స్ కామెరూన్ మాట్లాడుతూ "అవెంజర్స్' చిత్రం నాలో ఎంతో నమ్మకాన్ని పెంచింది. థియేటర్‌కి వెళ్లి సినిమా చూడాలనే కోరిక ప్రేక్షకుల్లో ఇంకా అలా బతికే ఉందని ఆ సినిమా సాధించిన వసూళ్లతో నిరూపితమైంది. 'అవతర్ 2', 'అవతార్ 3'కు సంబంధించి నాకున్న ఆందోళనంతా మార్కెట్ గురించే. చుట్టూ తెలియని వాళ్ల మధ్య చీకటి గదిలో కూర్చొని ఏదో చూడాలనే ఆశ ప్రేక్షకుల్లో ఇంకా ఉందా అనే అనుమానం ఉండేది. అవెంజర్స్ వసూళ్లు చూశాకా ఆ భయం పోయింది. 'అవెంజర్స్' లాగే 'అవతార్ 2', 'అవతార్ 3' చిత్రాలు విజయం సాధించొచ్చు, లేదంటే ప్రేక్షకులకు నచ్చకపోవచ్చు. కానీ మా ప్రయత్నం అయితే వందశాతం చేస్తాం. వినోదం కోసం సినిమాకు ప్రత్నామ్నాయంగా ఎన్నొచ్చినా సినిమా పట్ల ఆదరణ తగ్గకపోవడం సంతోషించదగ్గ విషయం"అని చెప్పారు. 'అవతార్ 2'ని 2021 డిసెంబరు 17న, 'అవతార్ 3'ని 2023 డిసెంబరు 22న విడుదల చేయనున్నారు.

'అవెంజర్స్: ఎండ్‌గేమ్'

కోటి కొత్త అవతారం

కోటి

ఎన్నో విజయవంతమైన చిత్రాలకు స్వరాలతో ఊపిరిపోశారు సంగీత దర్శకుడు కోటి. ఇప్పుడు నటుడిగా కొత్త అవతారం ఎత్తారు. 'దేవినేని' చిత్రంలో ఆయన ఓ పోలీస్ అధికారిగా కనిపించబోతున్నారు. నందమూరి తారకరత్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. నర్రా శివ నాగేశ్వరరావు దర్శకుడు. రాము రాథోడ్ నిర్మాత. కె.ఎస్.వ్యాస్ పాత్రలో కోటి కనిపించనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో కోటి ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "1977 నేపథ్యంలో మొదలయ్యే కథ ఇది. బెనర్జీ, సురేష్ కొండేటి పోషించిన పాత్రలు కూడా ఆకట్టుకుంటాయ"న్నారు. "నన్ను పోలీస్ అధికారిగా చూడాలనుకున్న మా నాన్న కోరిక ఈ సినిమాతో తీరిందనిపిస్తోంది. సంగీత దర్శకుడిగా 20 ఏళ్లు పనిచేశాను. నటుడిగా ఇది నా కొత్త ఇన్నింగ్స్" అన్నారు కోటి.

చిన్నా థ్రిల్లర్ కథ

శివశంకర్

ఎన్.ఎస్.చిన్నా, హేమంత్, శ్రద్ధ, చైత్ర, నందిని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'చిన్నాతో ప్రేమగా'. నృత్య దర్శకుడు శివశంకర్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. పీవీఆర్ దర్శకత్వం వహిస్తున్నారు. బి.చంద్రాయుడు నిర్మాత. ప్రస్తుతం హైదరాబాద్ పరిసరాల్లో చిత్రీకరణ జరుపుతున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రమిది. ఇందులో ఓ మంచి ప్రేమకథ కూడా ఉంటుంది. చిట్టిబాబు కామెడీ, ప్రియాంక క్లాసికల్ నృత్యం సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఒక విభిన్నమైన కథతో రూపొందుతున్న చిత్రమిది. శివ శంకర్ మాస్టర్ పాత్ర, ఆయన నృత్యరీతులు సమకూర్చే మూడు పాటలు చిత్రానికి కీలకం" అన్నారు. దర్శకనిర్మాతలు రాజీ పకుండా, విలువలతో చిత్రాన్ని రూపొందిస్తున్నారని చెప్పారు శివశంకర్.

ఆ కథ రామ్ కోసమేనా?

రామ్

అజయ్ భూపతి

'ఆర్ఎక్స్ 100'తో తొలి అడుగులోనే విజయాన్ని అందుకున్నారు అజయ్ భూపతి. ఆ వెంటనే 'మహా సముద్రం' అనే కథని పట్టాలెక్కిస్తారని ప్రచారం జరిగింది. జెమిని కిరణ్ నిర్మాత. కొన్ని కారణాల వల్ల ఆ సినిమా ఆలస్యం అవుతోంది. ఈలోగా అజయ్‌కి మరో అవకాశం వచ్చింది. అజయ్‌తో భవ్య క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించడానికి రంగం సిద్ధం చేసింది. ఆనంద ప్రసాద్ నిర్మాత. ఈ చిత్రంలో రామ్ కథానాయకుడిగా నటిస్తారని సమాచారం. అయితే ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నాయని, కథానాయకుడితో సహా మిగిలిన వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం ప్రకటించింది. 'మహా సముద్రం' పూర్తయ్యాకే ఈ ప్రాజెక్టు మొదలవుతుంది.

మనం లవ్ లెటర్ మీద రాసుకున్న అమ్మాయి పేరు వెడ్డింగ్ కార్డు మీద ఉండదు.

పంచ్ డైలాగ్

చిత్రం: మజిలీ

– పంపిన వారు: గణపతి రావు, నరసన్నపేట

చేతిలో చేయ్యేసి చెప్పేయవా..

ఆదిత్య ఓం, అరుణ్

ఆదిత్య ఓం, అరుణ్ కథానాయకులుగా నటిస్తున్న చిత్రం 'చేతిలో చేయ్యేసి చెప్పు బావ'. రోహిణి పూజా కథానాయిక. కట్ట రాజేంద్ర ప్రసాద్ దర్శకుడు. కె.జె.రాజేష్, దేవదాస్ నిర్మాతలు. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ "చనిపోయిన తరవాత కూడా ఇద్దరు ప్రేమికులు తమ ప్రేమని ఎలా బతికించుకున్నారనే వినూత్నమైన అంశం చుట్టూ ఈ కథ నడుస్తుంది. ఇదో థ్రిల్లర్. హారర్ అంశాలూ ఉంటాయి. ఏడు పోరాట ఘట్టాలుంటాయ"న్నారు. సంగీతం: పార్థసారథి

అలీ ఫజల్

గాల్ గడోట్

వండర్ ఉమన్‌తో బాలీవుడ్ నటుడు

బాలీవుడ్ నటుడు అలీ ఫజల్‌కు మరోసారి హాలీవుడ్‌లో నటించే అవకాశం వచ్చింది. 'డెత్ ఆన్‌ది నైల్' నవల ఆధారంగా వండర్ ఉమెన్‌గా అందరికీ పరిచయమైన హాలీవుడ్ అందాల తార గాల్ గడోట్ తాజా చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో గాల్ గడోట్ సరసన నటించే అవకాశం అలీకి దక్కిందని సమాచారం. ఓ ఓడలో జరిగిన హత్యల నేపథ్యంగా సాగే కథ ఇది. అలీ గతంలో 'విక్టోరియా అండ్ అబ్దుల్' అనే ఇంగ్లిష్ చిత్రంలో నటించాడు.

సీమలో వెలసిన ప్రేమ

పావని, వెంకట్

వెంకట్, హృశాలి, పావని ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'రాయల సీమ లవ్ స్టోరీ'. రామ్ రణధీర్ దర్శకుడు. రాయల్ చిన్నా, నాగరాజు నిర్మాతలు. హైదరాబాద్‌లో పాటలు విడుదలయ్యాయి. తొలిసీడీని దర్శకుడు జి.నాగేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'కర్నూలు పరిసర ప్రాంతాల్లో ఏ సినిమా షూటింగ్ జరిగినా హిట్ ఖాయం. ఆ సెంటిమెంట్‌తోనైనా ఈ సినిమా విజయం సాధించేలా ఉంద"న్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "రాయలసీమ అంటే పగలు, ప్రతీకారాలే కాదు. ప్రేమకథలూ ఉంటాయి. సీమలో ఎలాంటి ప్రేమకథ పుట్టిందో తెరపై చూసి తెలుసుకోండి. ఈనెల 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాము"న్నారు. ఈ కథని నమ్మిన నిర్మాతల నమ్మకాన్ని తప్పకుండా నిలబెడతా అని చెప్పారు దర్శకుడు.

కొత్త కబుర్లు

నిధి అగర్వాల్

సాయిధరమ్‌తో నిధి?

'ఇస్మార్ట్ శంకర్'తో ఓ మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది నిధి అగర్వాల్. ఇప్పుడు ఆమెకు వరుసగా అవకాశాలు అందుతున్నాయి. సాయిధరమ్ తేజ్ కొత్త చిత్రంలో నిధి ఓ కథానాయికగా ఎంపికైందని సమాచారం. బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రానికి నిర్మాత. సుబ్బు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. స్క్రిప్ట పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 'ప్రతిరోజూ పండగే' తరవాత సాయిధరమ్‌తేజ్ నటించే చిత్రమిదే. ఇందులో మరో కథానాయికకీ చోటుందని తెలుస్తోంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి.

వసుంధర

కుర్తీలపై హార్ట్స్ హంగులు!

దుస్తులపై చదరంగం, పేకముక్కల గుర్తుల మోటిఫ్‌లు అమరితే... వాటికి సంప్రదాయ కచ్ పనితనం, టాజిల్స్ తోడయితే... ఆ అందమే వేరు. అలాంటి కాటన్ కుర్తీలే ఇవి. కాలేజీ అమ్మాయిలకు భలే నప్పుతాయి. ఇండియన్-బొహిమియన్ సంస్కృతికి అద్దంపట్టే ఈ టాప్‌లనూ మీరూ చూసేయండి.

నైట్ అండ్ క్వీన్ పాన్ మోటిఫ్ ప్రింట్లతో ఉన్న కాటన్ కుర్తీ... ప్రత్యేక సందర్భాలకు సరైన ఎంపిక.

గుర్రాల మోటిఫ్‌లతో డిజైను చేసిన పాటికుర్తీపై కచ్ మిర్రర్ హ్యాంగింగ్ అందాలు అదిరిపోతున్నాయి కదూ!

చదరంగం పావుల మోటిఫ్‌లతో రూపొందించిన కుర్తీ. దీనికి ప్లీట్స్, బెల్ చేతులు అదనపు ఆకర్షణ.

గుర్రాల మోటిఫ్‌లతో రూపొందించిన కుర్తీపై నల్లటి కుచ్చులు అందంగా అమరిపోయాయి కదూ.

నిలువు గీతలు, గళ్లతో చేసిన ఎంబ్రాయిడరీ పనితనం... టాజిల్స్ జతచేసిన కుర్తీ గురించి ఎంత వర్ణించినా తక్కువే.

నగలు, దుస్తులు:
KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
(ఈ దుస్తులు అన్ని కళాంజలి షోరూంలలో లభిస్తాయి)

ఫ్యాషన్ ఫ్యాషన్



రవిని ఇల్లరికం తెచ్చుకునే ప్రయత్నంలో దేవి...

మనసు మమత
ఈరోజు రాత్రి 7:30కు ఈటీవీలో

70 దాటినా... సాహసానికి సై

ఆమెది ఏడు పదుల వయసు అయినా... యువతతో పోటీపడే ఉత్సాహం.... సాహసం అంటే వెనకడుగు వేయని తత్వం... ఇవన్నీ ఆమెను మలివయసులో 400 సాహసకృత్యాలు చేసేలా ప్రోత్సహించాయి. ఆమే సుధా మహాలింగం. ఆ విశేషాలేంటంటే...

అది 2016. అప్పటికే సుధకు 64 ఏళ్లు. ఆస్ట్రేలియాలోని గ్రేట్‌బారియర్ రీఫ్ సందర్శనకు వెళ్లారామె. సాహసాలను ఇష్టపడే ఆమె ఫసిఫిక్ మహాసముద్రంలో డైవింగ్ చేయాలనుకున్నారు. అప్పటి వరకు డైవింగ్ అంటే తెలియదు. మొత్తం పది మందితో కలిసి నీటిలో దూకారు. వాళ్లతోపాటు ఒక శిక్షకుడూ ఉన్నాడు. సముద్రం అడుగు భాగానికి చేరుకున్నాక అతడు ఆమెను వదిలేశాడు. ఆమెకు పైకి ఎలా రావాలో తెలియని పరిస్థితి. పైగా ఆక్సిజన్ సిలిండర్ పూర్తిగా అయిపోయింది. చాలామటుకూ ఉప్పునీటిని మింగేసి, చనిపోతానని అనుకునే సమయంలో ఆమెను శిక్షకుడు పైకి తీసుకొచ్చాడు. ఇలాంటి అనుభవాలు సుధకు చాలానే ఉన్నాయి. చెన్నైలో పుట్టి పెరిగిన ఆమె పదేళ్లపాటు ప్రముఖ ఆంగ్ల పత్రికలో బిజినెస్ విభాగంలో పని చేశారు. ఆ తరువాత ఎనర్జీ సెక్టార్ ఎనలిస్ట్‌గా ఇనిస్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అండ్ ఎనాలసిస్‌లో చేరారు. దేశంలో ఉన్న బొగ్గు, చమురు వంటి సహజశక్తి వనరులు గుర్తించడం ఆమె పని. ఉద్యోగంలో భాగంగా అంతర్జాతీయ సదస్సులకు ఎన్నోసార్లు విదేశాలకు వెళ్లేవారు. ఆ సమయంలో కొన్ని రోజుల పాటు సెలవు తీసుకుని అక్కడ కొత్త అనుభూతిని కలిగించే సాహసాలు చేయడానికి ఇష్టపడేవారు.

ఆసక్తి ఎలా పెరిగిందంటే...

సుధా మహాలింగం మొదట్లో భర్తతో కలిసి విదేశాలకు విహార యాత్రలకు వెళ్లేవారు. క్రమంగా ఒంటరిగా వివిధ ప్రదేశాలకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. అప్పుడు ఆమెకు 44 ఏళ్లు. ఒంటరిగా ప్రపంచాన్ని చుట్టి రావాలనుకునే విషయాన్ని భర్తతో చెప్పి మానస సరోవర్ యాత్రకు బయలుదేరారు. అది 32 రోజుల యాత్ర. 29 మంది సభ్యులతో ఆ సాహసయాత్ర సాగుతుంది. ప్రభుత్వం అనుమతించిన మొదటి బృందంలోనే సుధకు అవకాశం లభించింది. ఇలా ఇప్పటి వరకు మొత్తం 400 సాహసయాత్రలు పూర్తి చేశారు. కొన్ని దేశాలకు 12 సార్లకు పైగా వెళ్లొచ్చారు. మొత్తంగా 65 దేశాలను చుట్టొచ్చారామె. వీటన్నింటితో కలిపి ఆమె ఆరు ఇండియన్ పాస్‌పోర్టులు తీసుకున్నారు.

క్లిష్టపరిస్థితులను లెక్కచేయకుండా...

సుధ మూడేళ్లక్రితం అన్నపూర్ణ బేస్‌క్యాంప్, రెండేళ్లక్రితం ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌కు వెళ్లారు. 'అక్కడ ఎప్పుడూ కొండచరియలు విరిగిపడుతుంటాయి. కాస్త ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలు పోతాయి. దారులూ సరిగ్గా ఉండవు. ఒక బేస్‌క్యాంప్ నుంచి మరో చోటకు చేరుకోవాలంటే ఎన్నో కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి. ఎక్కడా ఆగకుండా పది, పదిహేను గంటలపాటు నడవాలి. నిద్రపోవడానికే సమయం ఉండదు. 65 ఏళ్ల వయసులోనూ భుజంపై బరువున్న బ్యాగు మోస్తూ ఇవన్నీ చేశా. అలసిపోకుండా గమ్యాన్ని చేరుకున్నా. అన్నపూర్ణ శిఖరంపై 16వేల అడుగులు, ఎవరెస్టు శిఖరం 21 వేల అడుగుల వరకు చేరుకున్నా' అని చెబుతారు సుధ. మరోసారి ఆమె... ఇరాన్‌లోని మినార్ చూడటానికి వెళ్లారు. అది పురాతన పార్శీ దేవాలయం. దాని కట్టడమే

భిన్నంగా ఉంటుంది. ఆ అందాలు చూస్తూ అక్కడే చాలా సమయం గడిపేశారామె. సాయంత్రం కావడంతో మినార్ ద్వారాలన్నీ మూసేశారు. అక్కడ ఆమె ఇరుక్కుపోయారు. ఏ మాత్రం ఆలోచించకుండా వెంటనే మినార్ పైకి ఎక్కి గట్టిగా అరవడం మొదలు పెట్టారు. ఆ అరుపులు విని అక్కడికి ముంబయి నుంచి వచ్చిన కొందరు ఆమెను కాపాడారు. ఓసారి ఇండోనేషియాలోని బోర్నియో రెయిన్ ఫారెస్ట్ ఓరాంటన్‌కు వెళ్లారు. అక్కడికి చేరుకోవాలంటే నది దాటి కొంత దూరం ట్రెక్కింగ్ చేయాలి. ఎన్నో విషపూరితమైన పురుగులు, పాములు, జలగలు, చీమలు ఉంటాయి. రోజంతా వర్షం పడుతుంది. నేలంతా బురదగా ఉంటుంది. ఆ వర్షంలోనూ విపరీతమైన ఉష్ణోగ్రత ఉంటుంది. వాటన్నింటినీ తట్టుకుంటూ ఐదు రోజుల పాటు ఆ అడవిలో గడిపారామె. తాను ఇక్కడితో ఆగిపోలేదని... త్వరలో మరిన్ని సాహస యాత్రలు చేయబోతున్నానట్లు చెబుతారు సుధ.

వ్యాయామం చేస్తా...

రివర్ రాఫ్టింగ్, పారాగ్లైడింగ్, స్కూబా డైవింగ్, జిప్‌లైనింగ్ వంటి సాహసాల్లో నిత్యం పాల్గొంటారు సుధ. ఇప్పటివరకు చేసిన సాహసకృత్యాలు, తన అనుభవాలన్నింటినీ కలిపి 'ట్రావెల్ గాడ్ మస్ట్ బి క్రేజీ' అనే పుస్తకం రాశారు. ఏడాదిలో సుమారు ఆరేడు సాహసయాత్రలు చేస్తుంటారు. త్వరలో ఆఫ్రికాలోని మడగాస్కర్‌కు వెళ్లనున్నారు. ఆమె భర్త ప్రభుత్వాధికారి. ఆయన సహాయంతోనే ఇవన్నీ చేయగలుగుతున్నానంటున్నారామె. '25 ఏళ్ల నుంచి రోజూ చేసే వ్యాయామాలే నా శక్తికి కారణం. ఇంట్లో చేసిన పోషకాహారాన్ని మాత్రమే తీసుకుంటా. ఇవే నా ఆరోగ్య రహస్యం' అని అంటారామె.

ఓ పండు తిన్నా చాలు!

కొంతమంది మహిళలకు వేళకు తినే సమయం ఉండదు. అలాగని పాట్ట మాడ్చుకోవడం వల్ల ప్రయోజనం లేదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోషకాహారం తీసుకునేలా చూసుకోవాలి. అందుకు ఏం చేయాలో చూద్దామా...

❖ యాపిల్ పండులో ఉండే యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధకశక్తిని పెంచుతాయి. టిఫిన్ తీసుకునే సమయం లేనివారు ఒక యాపిల్ తినొచ్చు. ఆకలి తీరుతుంది. ఆరోగ్యంగా ఉండటంతో పాటు బరువూ అదుపులో ఉంటుంది.

❖ మహిళలకు పని ఒత్తిడి మామూలే. ఇలాంటప్పుడు చిన్న డార్క్‌చాక్లెట్ ముక్కను నోట్లో వేసుకుని చప్పరించండి. మిగిలిన పనులు చురుగ్గా చేయగలుగుతారు.

❖ అల్పాహారం తీసుకునేందుకు సమయం లేనప్పుడు ఓ రెండు బ్రెడ్‌స్లైసులు తిన్నా చాలు. శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది. ఓ అరటిపండు తీసుకున్నా మంచిదే. దాంతోపాటు గ్లాసు పాలు తాగితే మరీ మంచిది.

❖ సాయంత్రం పూట ఆకలిగా అనిపిస్తే... సమోసా, బజ్జీల్లాంటివి తినేందుకు ప్రాధాన్యం ఇవ్వకండి. వాటికి బదులు ఓ పండు లేదా క్యారెట్, కీరా ముక్కలు, నట్స్, గుమ్మడి లేదా పొద్దు తిరుగుడు పువ్వు గింజలు వంటివి ఎంచుకుని చూడండి. పోషకాలు అందుతాయి. పొట్ట నిండిన భావనా కలుగుతుంది.

స్ట్రెయిటనింగ్ చేయించుకోవడం మంచిదా?

? నాకు ఇరవై రెండేళ్లు. నా జుట్టు ఒత్తుగా, ఉంగరాలు తిరిగి ఉంటుంది. నాకు స్ట్రెయిట్ హెయిర్ అంటే ఇష్టం. జుట్టును శాశ్వతంగా స్ట్రెయిటనింగ్ చేయించుకోవచ్చని విన్నా. కొందరేమో అది తాత్కాలికమేనని అంటున్నారు. పైగా అలా చేయించుకుంటే జుట్టు పల్చబడి రాలిపోతుందంటున్నారు. నిజమేనా?

– ఓ సోదరి

స్ట్రెయిటనింగ్, కర్లింగ్... తాత్కాలికంగా చేయించుకున్నా, శాశ్వతంగా చేయించుకోవాలనుకున్నా దీర్ఘకాలంలో నష్టమే కానీ లాభం ఉండదు. అప్పటికప్పుడు జుట్టు మీకు నచ్చేట్లు ఉండొచ్చు. మూడు నెలల తరువాత నుంచి జుట్టు రాలడం, చిట్లడం, నిర్జీవంగా మారడం వంటి సమస్యలు కనిపిస్తాయి. సాధారణంగా జపనీస్ హెయిర్ స్ట్రెయిటనింగ్, కెరొటిన్ చికిత్స, రసాయనిక చర్య, హెయిర్ రీబాండింగ్... వంటి పద్ధతుల ద్వారా మీ తలకట్టుని మారుస్తారు. చికిత్స ఏదైనా ఆ పద్ధతుల్లోని వేడి, ఇతర రసాయనాలు మాడు, వెంట్రుకల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. చాలామంది కెరొటిన్ ట్రీట్‌మెంట్‌ని ప్రొటీన్‌తో చేస్తారని, ఇది జుట్టుకి ఎంతో మంచిదని అనుకుంటారు. అధికవేడిలో చేసే ఈ చికిత్స వల్ల ఫార్మాల్డీహైడ్ వంటి రసాయనాలు జుట్టుకే కాదు శరీరానికీ హాని కలిగిస్తాయి. శాశ్వతంగా జుట్టుని స్ట్రెయిటనింగ్ చేసేటప్పుడు సోడియం క్లోరైడ్ ఎక్కువగా వాడతారు. ఇదీ హానికరమే. వీటివల్ల శ్వాస సంబంధ వ్యాధులు, అలర్జీ వంటివి రావొచ్చు. ముందు ప్యాచ్ టెస్ట్ చేసుకున్నాకే ప్రయత్నించడం మంచిది. ఆ తరువాత సోడియం క్లోరైడ్ లేని షాంపూలు, కండిషనర్‌లు వాడాలి. వైద్యులు చెప్పినట్లు చేయాలి... లేదంటే జుట్టు పొడిబారి పీచులా మారుతుంది. సహజ మెరుపు పోతుంది. సాధారణంగా ఉంగరాల జుట్టు పొడిబారినట్టు కనిపిస్తుంది. ఇలాంటి జుట్టు పట్టుకుచ్చులా మారడానికి మీ ఆహారంలో ఇనుము, జింక్, మాంసకృత్తులు, బి విటమిన్, బయోటిన్ వంటి పోషకాలు ఉండేలా చూసుకోండి. రెండు గుడ్ల తెల్లసొన తీసుకుని నాలుగు టేబుల్ స్పూన్ల మందారపూల మిశ్రమాన్ని కలపాలి. దీన్ని తలకు పెట్టుకుని కాసేపయ్యాక రసాయనాలు తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయాలి. రెండు చెంచాల మెంతిపిండిని పెరుగులో నానబెట్టి, దానికి కాస్త కలబంద గుజ్జు, మందార ఆకుల ముద్ద కలిపి తలకు రాసుకోవాలి. వారానికోసారి ఇలా చేస్తే జుట్టుకి పోషణ అందుతుంది. పొడిబారకుండానూ ఉంటుంది. పట్టులా, కాస్త స్ట్రెయిట్ హెయిర్‌లా కనిపిస్తుంది.

డియర్ వసుంధర

డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ ఫిన్‌కేర్ ఫిజీషియన్

– మీ సందేహాలను vasubeauty@eenadu.net కు పంపించగలరు.

ఒత్తిడి తగ్గాలా... పని ఆపేయండి

పనిలో ఒత్తిడి మామూలే. ఆ ప్రభావం మీపై పడకుండా ఉండాలంటే ఏం చేయాలో చూడండి.

❖ మీరు పనిచేసే చోటు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవడం తప్పనిసరి. అనవసర కాగితాలు, వృథా అనుకున్న ఇతర వస్తువుల్ని తీసేసి చూడండి. మార్పు మీకే కనిపిస్తుంది.

❖ మీ దినచర్య మొదలుకాకముందే ఆ రోజు ఏం చేయాలనుకుంటున్నారో ఆలోచించుకోవడం అవసరం. మీ పనికో ప్రణాళిక పెట్టుకుంటే చాలా సమస్యలు తగ్గిపోతాయి. వీలైనంతవరకూ పనుల్ని వాయిదా వేసుకోకుండా చూసుకోవాలి. ఓ పని విషయంలో ఎదురయ్యే అడ్డంకులనూ అంచనా వేయగలగాలి.

❖ రోజంతా కష్టపడినా పనులు తరిగిపోవు. అందుకే అదేపనిగా పనుల్లోనే ఉండిపోకుండా ప్రతి గంటన్నర లేదా రెండుగంటలకోసారి విరామం తీసుకోండి. కనీసం ఐదు నిమిషాల నేపు పని నుంచి ధ్యాస మళ్లినా చాలు.

❖ ఒత్తిడికి గురికాకుండా ఉండాలంటే... మీరు పనిచేసే చోట ఓ పచ్చటి మొక్క, కుటుంబసభ్యుల ఫొటో వంటివి ఏర్పాటు చేసుకోండి. మనసుకు సాంత్వన కలుగుతుంది.

❖ విపరీతంగా ఒత్తిడికి గురవుతున్నప్పుడు పని చేయకండి. పొరపాట్లు చేసే అవకాశం ఉంటుంది. బదులుగా కనీసం పావుగంటనేపు విశ్రాంతి తీసుకోవడమే మంచిది.

autopage@eenadu.in

రయ్ రయ్

ఈనాడు

కరీంనగర్, శుక్రవారం సెప్టెంబరు 13, 2019 10

లక్ష్యం..
కాలుష్యం తగ్గించాలి...
2020 ఏప్రిల్‌కి బీఎస్ 6
వాహనాలు అందుబాటులోకి
రావాలి...
ఇది ప్రభుత్వ ఆరాటం...
అప్పటిదాకా ఆగేలా లేవు
ఆటోమొబైల్ కంపెనీలు...
మేటి ఫీచర్లతో ముందే కొన్ని
మోడళ్లను దించేశాయి...
ఆ ప్రమాణాలతో
వచ్చిన తాజా
వాహనాలివి!

సిక్స్ కొట్టాయ్!

కొత్త ప్రమాణాలతో..

ఎంపీవీ బరిలోకి..

మల్టీ పర్పస్ వెహికిల్ (ఎంపీవీ) విభాగంలో డిమాండ్ భారీగా ఉండబోతోంది అన్నది మారుతిసుజుకీ కంపెనీ అభిప్రాయం. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి ఎక్స్‌ఎల్ 6 మోడల్‌ని తీసుకొచ్చింది. అదీ బీఎస్ 6 నిబంధనలకు అనుగుణంగా.

ఫీచర్లు: ఆరు సీట్ల విభాగంలో నాలుగు రకాల్లో లభిస్తోంది. ఎర్టిగా మోడల్‌కి దరిదాపుల్లో ఉండటంతో డిజైన్, స్టైల్ డిజైన్ విషయంలో పూర్తి భిన్నంగా ఉండేలా తీర్చిదిద్దారు. ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, రూఫ్ రెయిల్, సైడ్ క్లాడింగ్‌లు, క్రోమ్ మెరుపుల గ్రిల్, నలుపురంగు అలాయ్ చక్రాలు, నలుపు రంగు సైడ్ మిర్రర్‌లు, క్రూజ్ కంట్రోల్ దీనిలోని కొన్ని ప్రత్యేకతలు. లోపల క్యాబిన్ విశాలంగా ఉంది. హెడ్‌రూం, లెగ్‌రూంలో చాలినంత స్థలం ఉంది. తొమ్మిది అంగుళాల తాకేతెర, టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, క్లైమేట్ కంట్రోల్ సిస్టమ్.. అత్యాధునిక ఫీచర్లు.

భద్రత: రివర్స్ పార్కింగ్ కెమెరా, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ ఉన్నాయి.

ఇంజిన్: 1462సీసీ, 103 బీహెచ్‌పీ @ 6000 ఆర్‌పీఎం, 5స్పీడ్ మాన్యువల్/ 4 స్పీడ్ ఆటో

మైలేజీ: 19.01కి.మీ./లీ (మాన్యువల్), 17.99కి.మీ./లీ (ఆటోమేటిక్)

పోటీదారులు: టయోటా ఇన్నోవా క్రిస్టా

ధర: రూ. 9.79 లక్షలు-రూ.11.46 లక్షలు (ఎక్స్ షోరూం)

పండగొచ్చెనండీ!

సందర్భం

వేలమంది రైడర్లు ఒక్కచోటికి చేరతారు. ఆఫ్‌రోడ్డు పోటీలతో అదరగొడతారు. ఫ్యాషన్ షోలతో కేరింతలు కొడతారు. సంగీత ప్రదర్శనల్లో మునిగిపోతారు. ఈ సందడంతా ఇండియా బైక్ వీక్ సొంతం. ఏటా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఐదేళ్లుగా విజయవంతం అయ్యింది. ఆ ఊపుతో 'ఇండియా బైక్ వీక్ 2019' ఆరో ఎడిషన్ తేదీలను ప్రకటించారు నిర్వాహకులు. డిసెంబరు 6, 7 తేదీల్లో గోవాలో జరిగే ఈ మెగా ఈవెంట్‌కి ఇప్పట్నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి ఇరవైవేల మంది రైడర్లు వస్తారని అంచనా. ఆటోమొబైల్ కంపెనీలు బైకర్ల కోసం 130 స్టాళ్లు ఏర్పాటు చేయబోతున్నాయి. రైడింగ్ జోష్‌లో తేలిపోవాలనుకునే ఔత్సాహిక బైకర్లు సిద్ధమవ్వండి మరి.

ఆయిల్ ఫిల్టర్ల మతలబేంటి?

'ఆయిల్ ఫిల్టర్లు పాడైపోయాయి.. కొత్తవి వేయాలి' బండి మరమ్మతుకొచ్చిన చాలాసార్లు మెకానిక్ నుంచి ఈ మాట వినడం సహజమే. అసలు వీటి పనితీరు, ప్రాధాన్యం ఏంటి? చేతి చమురు వదలకుండా ఎక్కువకాలం మన్నికగా ఉండాలంటే మనమేం చేయాలో తెలుసుకుందాం.

తెలుసుకుందాం

ఇంజిన్ ఆయిల్‌లోని కలుషితాలు, వ్యర్థాలు, మలినాలు, దుమ్ము కణాలను వడగట్టి ఇంజిన్‌కి స్వచ్ఛమైన ఇంధనాన్ని అందించేవే ఆయిల్ ఫిల్టర్లు. వీటి పనితీరు సరిగా లేకపోతే కలుషిత ఆయిల్ నేరుగా ఇంజిన్‌కి చేరుతుంది. ఆయిల్ పంపు, కనెక్టింగ్ రాడ్, క్యామ్‌షాఫ్ట్, వాల్వ్‌ట్రెయిన్, ఇంజిన్ లోపలి గోడల్లాంటి ఖరీదైన విడిభాగాలు తొందరగా పాడవుతాయి.

మన్నిక కోసం

- ఆయిల్ ఫిల్టర్లన్నీ చూడ్డానికి ఒకేలా ఉంటాయి. త్రెడ్, గ్యాస్కెట్ పరిమాణంలోనే చిన్నపాటి తేడాలుంటాయి. సరైన సైజువి ఎంచుకోవాలి. లేదంటే ఆయిల్ లీక్ అవుతుంది.
- ధర తక్కువనే ఉద్దేశంతో కొందరు నాణ్యత లేనివి వాడుతుంటారు. వీటిలో గ్యాస్కెట్‌లు సరిగ్గా కుదురుకోవు. ఇవి ఆయిల్‌ని అంతగా శుభ్రం చేయవు.
- పేపరు, సింథటిక్ ప్లాస్టిక్.. రెండు రకాల ఫిల్టర్లు అందుబాటులో ఉన్నాయి. సింథటిక్‌వి అతి చిన్న ధూళి కణాలను సైతం అడ్డుకొని ఆయిల్‌ని శుభ్రం చేస్తాయి. ఇవి దీర్ఘకాలం మన్నికగా ఉంటాయి.
- ఇంజిన్ ఆయిల్ మార్చినప్పుడల్లా ఆయిల్ ఫిల్టర్ మార్చాలని ఆటోమొబైల్ కంపెనీలు చెబుతుంటాయి. ఇది పాటించదగిన సూచనే. వాహనం కండిషన్ బాగుంటే ఎక్కువకాలం పొడిగించవచ్చు.
- కొత్త వాహనాలు 'సర్వీస్ ఇంజిన్ లైట్'తో వస్తున్నాయి. ఆయిల్ ఇంజిన్‌లో తేడాలున్నా, ఆయిల్ ఫిల్టర్లు పాడైనా ఈ లైట్ వెలుగుతుంటుంది. దానికనుగుణంగా వెంటనే ఫిల్టర్లు మార్పించాల్సి ఉంటుంది.

బైకర్‌కీ ఎయిర్‌బ్యాగ్

ఎయిర్‌బ్యాగ్‌లు ఎంత సురక్షితమో మనందరికీ తెలుసు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అవి ప్రాణాలకు రక్షణగా ఉంటాయి. కారు సంగతి ఓకే. మరి ద్విచక్రవాహనాల మాటేంటి? ఈ ప్రశ్నకు జవాబుగా ఓ స్మార్ట్ జాకెట్‌ని రూపొందించామంటోంది డైనీస్ అనే కంపెనీ. 'టస్కర్ డైనీస్ డి-ఎయిర్' అనే పేరుతో తయారైన ఈ జాకెట్ అచ్చంగా ఎయిర్‌బ్యాగ్‌లాగే పని చేస్తుంది. ఆపత్కాలంలో క్షణాల్లో విచ్చుకొని మెడ నుంచి నడుము వరకు శరీరానికి ఏ గాయమూ కాకుండా కాపాడుతుంది.

ఆటో గ్యాడ్జెట్

- **పనితీరు:** దీన్ని నైలాన్ ఫ్యాబ్రిక్‌తో రూపొందించారు. మైక్రో ఫిలమెంట్ నిర్మాణాకృతితో తయారు చేయడంతో చాలా దృఢంగా ఉంటుంది. లోపల వైర్‌లెస్ ఎలక్ట్రానిక్ కంట్రోల్ యూనిట్ చిప్ అమర్చారు. ఇందులో ఏడు సెన్సర్లుంటాయి. రైడర్‌ని, బండి స్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఏమాత్రం తేడా వచ్చినా సెకనులో వెయ్యో వంతులో స్పందిస్తుంది. రైడర్ కిందపడ్డా, దేన్నైనా ఢీకొట్టినా రెప్పపాటులో జాకెట్ ఎయిర్‌బ్యాగ్‌లా తెరుచుకుంటుంది.
- **బ్యాటరీతో:** ఈ జాకెట్ బ్యాటరీతో పని చేస్తుంది. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే ఇరవై ఆరు గంటలపాటు వాడుకోవచ్చు. అంటే దీన్ని రోజుకు రెండు గంటల చొప్పున ఉపయోగించినా పదమూడు రోజులు పని చేస్తుంది.
- **హెచ్చరికలు:** ఒకవేళ జాకెట్‌లో ఏదైనా లోపం ఏర్పడ్డా, ఛార్జింగ్ అయిపోయినా ఎడమవైపు ఛాతీ భాగంలో అమర్చిన డిస్‌ప్లేలో మిణుకుమిణుకుమని చిన్న లైటు వెలుగుతుంది.
- **అన్నివేళలా:** ఇది వాటర్‌ప్రూఫ్.. పైగా తేలికైంది. ఏ కాలంలో అయినా ధరించవచ్చు. ఈ జాకెట్ పైన చొక్కా, కోటు ఏదైనా వేసుకోవచ్చు. విప్పిన తర్వాత తేలికగా మడిచేయొచ్చు.

స్మార్ట్‌గా ఐ-స్మార్ట్ 110

హీరో కంపెనీ హోండా నుంచి విడిపోయిన తర్వాత సొంతంగా తయారు చేసిన ఇంజిన్, స్ప్లెండర్ ఐస్మార్ట్ 110 బైకేదే. ఈ ద్విచక్ర వాహనానికి ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐక్యాట్) నుంచి బీఎస్ 6 సర్టిఫికెట్ అందుకున్నట్టు హీరో మోటోకార్ప్ ప్రకటించింది.

ప్రత్యేకతలు: పాత మోడల్‌కి కొద్దిపాటి మార్పులు చేశారు. బికినీ ఫెయిరింగ్స్, వంపులు తిరిగిన ఇంధన ట్యాంకు, తేలికైన టెయిల్ సెక్షన్, ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఎల్‌సీడీ తెరతో వచ్చింది. అందులో తీరైన ట్రిప్ మీటర్, ఓడోమీటర్, ఫ్యుయెల్ ఇండికేటర్లు.. ఆకర్షణీయంగా ఉన్నాయి. బండి సెల్ఫ్/కిక్ రెండింటితో స్టార్ట్ అవుతుంది. ఇది భారత్‌లో మొట్టమొదటిసారిగా ఐడల్ స్టార్ట్ స్టాప్ సిస్టమ్ (ఐశిఎస్) టెక్నాలజీతో వచ్చింది. ట్రాఫిక్‌లో ఉన్నప్పుడు ఇంజిన్ ఆన్‌లో ఉంటే కొన్ని సెకన్ల తర్వాత ఇంధన సరఫరా ఆటోమేటిగ్గా ఆగిపోతుంది. దీంతో ఇంధనం ఆదా అవుతుంది. మంచి సస్పెన్షన్, ఇంటిగ్రేటెడ్ బ్రేకింగ్ సిస్టమ్‌తో పని చేస్తుంది. రెండు చక్రాలకు డ్రమ్ బ్రేక్‌లు ఇచ్చారు.

ఇంజిన్: 109.15సీసీ, 9బీహెచ్‌పీ, 9ఎన్‌ఎం టార్క్, ఫోర్ స్పీడ్ గేర్‌బాక్స్

అత్యధిక వేగం: 87కి.మీ./గం

మైలేజీ: 75కి.మీ./లీటరుకి

బండి బరువు: 115కేజీలు

ధర: రూ.62వేలు (ఎక్స్ షోరూం)

మరింత యాక్టివ్‌గా..

భారత్‌లో అత్యధికంగా అమ్ముడయ్యే ద్విచక్రవాహనం ఏదంటే వెంటనే గుర్తొచ్చే పేరు హోండా యాక్టివా. అదే మోడల్‌ని హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్‌ఎంఎస్ఐ) బీఎస్ 6 ప్రమాణాలతో యాక్టివా 125ఎఫ్ఐ పేరుతో తీసుకొచ్చింది.

ఫీచర్లు: అత్యధిక శాతం పాత మోడల్‌నే పోలి ఉంది. ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్, కొత్తగా డిజైన్ చేసిన టెయిల్ ల్యాంప్ అదనంగా చేర్చారు. రెండు చక్రాలకు డ్రమ్ బ్రేక్‌లు ఇచ్చారు. కంబైన్డ్ బ్రేకింగ్ సిస్టమ్ (సీబీఎస్)తో పని చేయడంతో ఒక్క బ్రేక్ వేసినా రెండూ పని చేస్తాయి. టెలిస్కోపిక్ సస్పెన్షన్, పన్నెండు అంగుళాల అలాయ్ చక్రాలు, ట్యూబ్‌లెస్ టైర్లు, ఎల్‌ఈడీ పైలట్ ల్యాంప్, మొబైల్ ఛార్జింగ్ సాకెట్, సగం డిజిటల్ సగం అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్.. ఇతర ఫీచర్లు.

ఇంజిన్: ఫ్యుయెల్ ఇంజెక్టెడ్ 124.9సీసీ, సింగిల్ సిలిండర్, 8.52 బీహెచ్‌పీ, 10.54ఎన్‌ఎం @ 6500 ఆర్‌పీఎం, ఎయిర్‌కూల్డ్.

మైలేజీ: 59కి.మీ./లీ (ఏఆర్ఏఐ)

బండి బరువు: 108 కేజీలు

ధర: రూ.67,490 (ఎక్స్ షోరూం)

ధరెంతో తెలుసుకో..

కొత్తది కొనాలనుకున్నప్పుడు పాత వాహనాన్ని అమ్మాలనుకోవడం సహజం. కానీ దాని రీసేల్ విలువ ఎంతో తెలియదు. ఈ విషయం తెలియక కొన్నిసార్లు తక్కువ ధరకే తెగనమ్ముకుంటారు కొందరు. మధ్యలో ఏజెంట్లు, బ్రోకర్లు ఉంటే ధర మరింత తగ్గిపోతుంది. ఈ పరిస్థితి రాకుండా మన పాత బండి విలువ ఎంతో కచ్చితంగా అంచనా వేసి చెబుతామంటోంది కార్స్ 24 వెబ్‌సైట్ 'కార్‌క్యులేటర్'. కంపెనీ, తయారైన ఏడాది,

మోడల్, తిరిగిన కిలోమీటర్లు, ప్రమాద చరిత్ర వివరాలు ఎంటర్ చేస్తే చాలు.. కార్‌క్యులేటర్ క్షణాల్లో ధర చెబుతుంది.

ఏంటీ బీఎస్?

కర్బన ఉద్గారాలను తగ్గించే ఏకైక లక్ష్యంతో 2020, ఏప్రిల్ 1 నుంచి భారత్ స్టేజ్ ఎమిషన్ స్టాండర్డ్స్ 6తో కూడిన ఇంజిన్ వాహనాలను తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం వాహన సంస్థలను కోరింది.

ప్రస్తుతం మనం వాడుతున్న బీఎస్ 4 పెట్రోల్, డీజిల్ ఇంధనాల్లో సల్ఫర్ స్థాయి 50 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్) వరకు ఉంటుంది. బీఎస్ 6లో అది 10 పీపీఎం మాత్రమే ఉండాలి. బీఎస్ 6కి మారినప్పుడు పెట్రోల్‌లో నైట్రోజన్ ఆక్సైడ్ 25శాతానికి, డీజిల్‌లో 70శాతానికి తగ్గుతుంది. కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోకార్బన్లూ గణనీయంగా తగ్గుతాయి. కానీ బీఎస్4 నుంచి బీఎస్ 6కి ఇంజిన్ టెక్నాలజీ అభివృద్ధి చేయడం అంత తేలికైన విషయం కాదు. ఫ్యుయెల్ ఇంజెక్టర్, పార్టిక్యులేట్ ఫిల్టర్లు, కేటలిటిక్ కన్వర్టర్.. ఇలా అన్నింటినీ మార్చాలి. దీంతో సహజంగానే వాహనం ధర పెరుగుతుంది. ద్విచక్రవాహనాలపై రూ.ఐదు వేలు, పెట్రోల్ కారుపై రూ.15వేల నుంచి రూ.20వేలు, డీజిల్ కారుపై రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ధర పెరుగుతోంది. దీనివల్ల మైలేజీపై పెద్దగా ప్రభావం లేకపోయినా.. పికప్ తగ్గే అవకాశం ఉందంటారు వాహన రంగ నిపుణులు. సానుకూలతల విషయానికొస్తే వాతావరణంలోకి వెదజల్లే కాలుష్యం గణనీయంగా తగ్గుతుంది. ఇంజిన్ పనితీరు మెరుగై ఎక్కువ కాలం మన్నికగా ఉంటుంది.

వచ్చినవి.. రాబోతున్నవి..

బీఎస్ 6 ఇంజిన్‌తో వచ్చిన, రాబోతున్న వాహనాలివే.

- **మారుతిసుజుకీ బ్యాలెనో- ధర :** రూ.5.59లక్షలు-రూ.8.90లక్షలు
- **రెనాల్ట్ క్విడ్ ఫేస్‌లిఫ్ట్ - ధర :** రూ.2.76లక్షలు- రూ.4.76లక్షలు
- **టయోటా గ్లాంజా- ధర:** రూ. 7.22లక్షలు-రూ.8.9లక్షలు
- **గ్రాండ్ ఐ10 నియోస్- ధర:** రూ.5.56లక్షలు- రూ.7.99లక్షలు
- **కియా సెల్టోస్-ధర:** రూ.9.69లక్షలు- రూ.16.99లక్షలు
- **జీప్ కంపాస్- ధర:** రూ.16లక్షలు- రూ.26లక్షలు
- **మెర్సిడెస్ బెంజ్ ఈ-క్లాస్- ధర:** రూ.57లక్షలు-రూ.1.5కోట్లు
- **హార్లీ డేవిడ్‌సన్ స్ట్రీట్ 750- ధర:** రూ.5.47లక్షలు
- **యమహా ఎఫ్‌జడ్‌ఎస్ వీ3- ధర:** రూ.1.03లక్షలు
- **ఎంటీ-15- ధర:** రూ. 1.45లక్షలు
- **రే-జడ్ స్కూటర్- ధర:** రూ.57వేలు.

(ధరలు ఎక్స్‌షోరూం)

టైరు ఎప్పుడు మార్చాలి?

మెకానిక్ గురూ

? 1998 మోడల్ మారుతీ 800సీసీ కారు వాడుతున్నాను. ఇంతవరకు 21వేల కిలోమీటర్లే తిరిగాను. పదిహేనేళ్ల తర్వాత రిజిస్ట్రేషన్ పునరుద్ధరించాలని, ఆరునెలలకోసారి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని పత్రికల్లో చదివాను. అవేం చేయలేదు. ఇప్పుడు నేను ఈ కారును కొనసాగించాలంటే ఏం చేయాలో తెలియజేయగలరు.

- పి.వెంకటేశ్వర్లు, కర్నూలు

వాహనం రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందే ప్రక్రియను ఈ మధ్యకాలంలో కఠినతరం చేశారు. రుసుములూ పెంచారు. రిజిస్ట్రేషన్ గడువు ముగిసిన రెండు నెలల లోపల దాన్ని పునరుద్ధరించుకోకపోతే జరిమానా విధిస్తారు. ఆరునెలలకోసారి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాలనేది వాణిజ్య వాహనాల కోసం నిర్దేశించిన నిబంధన. ప్రయాణికుల వాహనాలకు ఈ గడువు ఐదేళ్ల ఉంటుంది. కాలం చెల్లిన వాహనాలను తుక్కుగా మార్చి కొత్త వాహనాలు కొనాలనుకునేవారికి ప్రభుత్వం పన్ను రాయితీలు ఇవ్వాలని భావిస్తోంది. గమనించగలరు.

? సాధారణంగా వాహనాల టైర్ల జీవిత కాలం ఎంత ఉంటుంది? వాటి నాణ్యత, అరుగుదల, ఇంకా ఎంతకాలం వాడొచ్చని నిర్ధారించుకోవడానికి ఏమైనా పరికరాలున్నాయా?

- ఎన్.సాంబశివరావు, విజయవాడ

కొరుని వాడిన విధానం, ఉపయోగించిన కాలం, నడిపే తీరు, వాతావరణ పరిస్థితులు.. వీటన్నింటిపై టైర్ల మన్నిక ఆధారపడి ఉంటుంది. వాడకం బాగుంటే సగటున కారు టైరు జీవితకాలం 50 వేల కిలోమీటర్లకు అటుఇటుగా ఉంటుంది. ఎప్పుడూ గాలి తగినంతగా ఉండేలా చూసుకోవాలి. అకస్మాత్తుగా వేగం పెంచొద్దు. సడెన్ బ్రేక్‌లు వేయొద్దు. ఇవన్నీ పాటిస్తే ఆయుఃప్రమాణం పెరుగుతుంది. ఒక రూపాయి నాణెం తీసుకొని టైరు ట్రెడ్ మధ్యలో ఉంచండి. నాణెం సగం కన్నా బయటికి కనిపిస్తే అరుగుదల ఎక్కువైందనీ, మార్చాల్సిన సమయం వచ్చిందని తెలుసుకోవాలి.

– హర్షిన్ లాల్‌పేట్, ఆటోమొబైల్ నిపుణుడు

(మీకూ ఇలాంటి సందేహాలు, సమస్యలు ఉంటే రాసి పంపండి. నిపుణులతో సమాధానాలు ఇప్పిస్తాం)

తుమకూరు జిల్లా... సౌర విద్యుత్ ఖిల్లా

తుమకూరు జిల్లా పావగడలో ఏర్పాటుచేసిన సౌర ఫలకలు

అతిపెద్ద సోలార్ పార్క్‌కు చిరునామా కానున్న కర్ణాటక

ప్రపంచంలో అతిపెద్ద సోలార్ పార్క్ ఎక్కడుంది? ఈ ప్రశ్నకు జవాబు కోసం వెతికితే చైనా అని వస్తుంది. కానీ... త్వరలోనే ఈ సమాధానం మారనుంది. కర్ణాటకలోని తుమకూరు జిల్లా అతి పెద్ద సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా రికార్డు సృష్టించనుంది. ఇక్కడ సౌర విద్యుదుత్పత్తి ఉద్యమ స్థాయిలో విస్తరిస్తోంది. ఏటా సుమారు 300 ఎకరాల్లో కొత్తగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయి. సాగునీటి వసతి లేని బీడు భూములను ఈ ప్రాజెక్టు నిమిత్తం లీజుకు ఇచ్చేందుకు రైతులు ముందుకొస్తున్నారు.

> జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ సౌర పథకం ప్రకారం 2022 నాటికి **20,000** మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం.

ఈటీవీ భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

పావగడలో ఫలకల ధగధగలు

2,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా పావగడ తాలూకాలో సౌర ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది... రాష్ట్ర విద్యుత్ సంస్థ కేఎస్‌పీడీఎల్. నగల్మాదికె, హోబ్బళి, వల్లూరు, బాలసముద్ర, తిరుమణి, రాయచర్లు, క్యాతగణచర్ల గ్రామాల్లోని రైతుల నుంచి 13 వేల ఎకరాలను 25 ఏళ్ల కాలానికి లీజుకు తీసుకుంది. 11 వేల ఎకరాల్లో ఇప్పటికే సౌర ఫలకలను ఏర్పాటు చేసింది. నిర్మాణం పూర్తయితే ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్క్‌గా ఇది పేరుగాంచనుంది.

రైతులకు వరం

కర్ణాటక సౌర విద్యుత్ అభివృద్ధి సంస్థ (కేఎస్‌పీడీసీఎల్), కర్ణాటక గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (కేఆర్ఐడీఎల్)ల ఆధ్వర్యాన ఈ ప్రాజెక్టు అమలవుతోంది. భూముల లీజు ప్రక్రియను జిల్లా పాలనా యంత్రాంగం దగ్గరుండి చూస్తోంది. మైదానాల్లో ఎకరాల కొద్దీ సౌరవిద్యుత్ ప్లాంట్లు వెలుస్తుండటం రైతులకు వరంగా మారింది. ఉపాధితో పాటు బీడు భూముల నుంచి ఆదాయం లభించటంపై వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముందుండాలని కర్ణాటక ముందు చూపు

సౌర విద్యుదుత్పత్తిలో కర్ణాటక ఎప్పుడూ ముందే ఉంది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'కర్ణాటక పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ' పేరిట నోడల్ ఏజెన్సీని స్థాపించింది. దీని ద్వారా ప్రత్యేక ఆర్థిక జోన్లుగా సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాం.

-శుభ కల్యాణ్, ప్రాజెక్ట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి

కంపెనీల మధ్య పోటీ

రైతుల నుంచి తీసుకున్న భూములకు... ఏడాదికి ఎకరాకు రూ.21 వేల చొప్పున కేఎస్‌పీడీఎల్ అద్దె చెల్లిస్తోంది. పావగడ ప్రాజెక్టును మొత్తం 8 సెక్టార్లుగా విభజించింది. ఒక్కో సెక్టార్ సామర్థ్యం 250 మెగావాట్లు. దేశంలోని ప్రముఖ సంస్థలు అదానీ, టాటా, ఫార్చ్యూన్, గ్లోబల్ టెక్ వంటివి ఇక్కడ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపించాయి. రైతులు భూములిచ్చేందుకు ముందుకు వస్తుండటంతో వాటి మధ్య పోటీ నెలకొంది. ప్లాంట్లను నెలకొల్పుతామంటూ చాలా సంస్థలు అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకున్నాయి. 10-20 మెగావాట్ల సామర్థ్యముండే ప్లాంట్లను ప్రారంభించేందుకూ సిద్ధపడుతున్నాయి. కొన్ని కంపెనీలు ఇప్పటికే బెంగళూరు విద్యుత్ సరఫరా సంస్థ (బెస్కామ్), కర్ణాటక పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేపీటీసీఎల్)తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. జిల్లా యంత్రాంగమూ సౌరవిద్యుత్ ప్లాంట్లపై ప్రత్యేకంగా ఆసక్తి కనబరుస్తోంది.

ఇది ట్రైలరే.. మున్ముందు పూర్తి సినిమా

- వంద రోజుల పాలనలో వేగవంతమైన చర్యలు
- అవినీతి, ఉగ్రవాదంపై ఉక్కుపాదం
- ప్రధాని మోదీ వ్యాఖ్యలు

రాంచీలో ఓ మహిళకు 'ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన' చెక్కును అందజేసి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ

రాంచీ

ఎన్డీఏ-2 ప్రభుత్వ మొదటి వంద రోజుల్లో అవినీతికి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ట్రైలర్ చూపించామని, దేశం చూడాల్సిన పూర్తి సినిమా ఇంకా ముందుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంటు తొలి సమావేశాల్లోనే ముస్లిం సోదరీమణుల రక్షణ కోసం ముమ్మారు తలాక్‌ను నిషేధిస్తూ చట్టం తీసుకొచ్చామని చెప్పారు. "మా ప్రభుత్వం తీసుకున్న ఇలాంటి వేగవంతమైన నిర్ణయాలు 'ట్రైలర్' మాత్రమే. మున్ముందు 'పూర్తిస్థాయి సినిమా' ఉంటుంది." అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంత మందిని ఉంచాల్సిన చోటే ఉంచామని కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం తిహార్ జైల్లో ఉండడాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ వ్యాఖ్యానించారు. అవినీతి, ఉగ్రవాదంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఝార్ఖండ్‌కు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాంచీలో ప్రధాని గురువారం మాట్లాడారు. వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రైతుల కోసం 'ప్రధాన్ మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన', చిన్న వ్యాపారుల కోసం 'ప్రధాన్ మంత్రి లఘు వ్యాపారి మాన్ ధన్ యోజన', స్వయం ఉపాధి పొందేవారి కోసం 'స్వరోజ్‌గార్ యోజన'ను ప్రారంభించారు.

> తాము చట్టానికి, న్యాయస్థానాలకు అతీతం అనుకున్నవారు ఇప్పుడు బెయిల్‌కు విజ్ఞప్తి చేస్తూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కొంత మంది ఇప్పటికే జైలుకు వెళ్లారు.

కొత్త పింఛను పథకాలు

కిసాన్ మాన్ ధన్: సన్న, చిన్నకారు రైతులకు ఉద్దేశించినది. రెండు హెక్టార్లలోపు ఉన్న వారు అర్హులు. 18-40 ఏళ్ల వారికి వర్తింపు. వయసును అనుసరించి నెలకు రూ.55-రూ.200 వరకు చెల్లించాలి. 60 ఏళ్ల వరకు చెల్లిస్తుండాలి. కేంద్ర ప్రభుత్వం కూడా ఇంతే మొత్తాన్ని ప్రీమియంగా చెల్లిస్తుంది. 60 ఏళ్లు నిండిన తరువాత నెలకు రూ.3000 పింఛను వస్తుంది. పీఎం-కిసాన్ కింద ఆర్థిక సహాయం పొందుతున్న రైతులకూ ఇది వర్తిస్తుంది. ఆ పథకం కింద వచ్చే సొమ్మును ప్రీమియం కోసం ఉపయోగించుకోవచ్చు. భార్య పేరున ఇంతే మొత్తాన్ని జమ చేస్తే ఆమెకు కూడా విడిగా రూ.3000 వంతున పింఛను వస్తుంది.

లఘు వ్యాపారి మాన్ ధన్: చిన్న వ్యాపారులకు ఉద్దేశించినది. వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్లకు మించకూడదు. ఆదాయపు పన్ను చెల్లింపుదారుడు కాకూడదు. టర్నోవర్ రూ.40 లక్షలకు మించితే జీఎస్టీ గుర్తింపు సంఖ్య సమర్పించాలి. నెలకు రూ.3000 పింఛను వస్తుంది.

స్వరోజ్‌గార్ యోజన: స్వయం ఉపాధి పొందుతున్నవారికి ఉద్దేశించినది. ప్రీమియం వివరాలు అన్ని పథకాలకూ ఒక్కటే.

కుల్‌భూషణ్‌కు మరో అవకాశమివ్వని పాక్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ జైల్లో ఉన్న కుల్‌భూషణ్ జాదవ్ రెండో సారి భారత దౌత్యాధికారిని కలిసేందుకు పాకిస్థాన్ గురువారం నిరాకరించింది.

'నిర్భయ' దర్యాప్తు అధికారికి పురస్కారం

న్యూయార్క్: నిర్భయ కేసును దర్యాప్తు చేసిన మహిళా పోలీసు అధికారి ఛాయాశర్మకు ఆసియా సొసైటీ గేమ్ ఛేంజర్ పురస్కారం లభించింది. ఈ పురస్కారం వచ్చే నెలలో ప్రదానం చేస్తారు.

భారత్- చైనా సైనికుల స్వల్ప ఘర్షణ

దిల్లీ: తూర్పు లద్దాఖ్‌లోని పాంగోంగ్ సరస్సు ఒడ్డున భారత్, చైనా సైనికుల మధ్య బుధవారం స్వల్ప ఘర్షణ జరిగింది. ఉభయ పక్షాల మధ్య జరిగిన సంప్రదింపులతో వివాదం పరిష్కారమైంది.

కమ్యూనికేషన్‌ను పునరుద్ధరించండి

వాషింగ్టన్: జమ్మూ-కశ్మీర్‌లో కమ్యూనికేషన్ వసతులను తక్షణం పునరుద్ధరించి, నిర్బంధంలో ఉన్న నేతలను విడుదల చేసేలా భారత్‌పై ఒత్తిడి తీసుకురావాలని... చట్ట సభ్యులు ప్రమీలా జయపాల్, జేమ్స్ పి మెక్‌గ్రోవెన్‌లు విదేశాంగమంత్రి మైక్ పాంపియోన్‌ను డిమాండ్ చేస్తూ లేఖ రాశారు.

'370' రద్దుకు జేయూహెచ్ మద్దతు

దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన 370 అధికరణం రద్దుకు ప్రముఖ ముస్లిం సంస్థ జమైత్ ఉలేమా ఐ హింద్ (జేయూహెచ్) సమర్థించింది. పొరుగు దేశ విద్రోహ చర్యలు కశ్మీర్‌ను నాశనం చేస్తున్నాయని విమర్శించింది.

ముగ్గురు ఉగ్రవాదుల అరెస్ట్

జమ్మూ: జైష్ ఎ మహమ్మద్ ఉగ్రవాదులు ముగ్గురిని జమ్మూ-కశ్మీర్‌లోని కథువా జిల్లాలో గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి ఆరు తుపాకులు, తూటాలు స్వాధీనం చేసుకున్నారు.

బుల్లెట్ రైలు ఛార్జీ రూ.3వేలు!

అహ్మదాబాద్: అహ్మదాబాద్-ముంబయిల మధ్య ప్రయాణించే బుల్లెట్ రైలులో ఛార్జీ దాదాపు రూ.3000 ఉండవచ్చని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అచల్ ఖరే గురువారం విలేకరులకు తెలిపారు.

పాములపై కూర్చుంది.. ప్రాణాలు కోల్పోయింది

గోరఖ్‌పుర్: ఫోన్‌లో మాట్లాడుతూ మంచంపై ఉన్న రెండు పాములపై ఓ మహిళ కూర్చోవడంతో అవి కాటేశాయి. దీంతో ఆ మహిళ మరణించింది. గోరఖ్‌పుర్‌కు చెందిన గీత అనే మహిళ థాయ్‌లాండ్‌లో పనిచేసే తన భర్తతో ఫోన్‌లో మాట్లాడుతూ పాములపై కూర్చొంది.

మహారాష్ట్రలో ఆరుగురి దుర్మరణం

పుణె: మహారాష్ట్రలోని సతారా జిల్లాలో నాలుగో నంబరు జాతీయ రహదారిపై ఓ బస్సు ఆగిఉన్న ట్రక్కును ఢీకొన్న దుర్ఘటనలో ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. 15 మంది గాయపడ్డారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లో..

హాపుర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాపుర్‌లో తొమ్మిదో నంబరు జాతీయ రహదారిపై ఓ కారు ఆగిఉన్న ట్రక్కును ఢీ కొట్టడంతో ఐదుగురు మృతి చెందారు.

పిడుగుపాటుకు 8మంది మృతి

గఢవా: ఝార్ఖండ్ రాష్ట్రం గఢవా జిల్లా పస్సీ గ్రామంలో చెట్టుపై పిడుగు పడడంతో దాని కింద ఉన్న ఎనిమిది మంది మృతి చెందారు.

పీవోకే విముక్తికి మేం సిద్ధం

- ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి
- సైన్యాధిపతి జనరల్ బిపిన్ రావత్

దిల్లీ: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను పొరుగు దేశం కబంధ హస్తాల నుంచి విడిపించి భారత్‌లో అంతర్భాగం చేసేందుకు సైనిక బలగాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని సైన్యాధ్యక్షుడు జనరల్ బిపిన్ రావత్ చెప్పారు. "ఆదేశాలు అందగానే పీవోకేపై దాడి చేయడానికి భారత సైన్యం ఎప్పుడూ సిద్ధమే. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దేశంలోని సంస్థలు ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేస్తాయి" అని గురువారం ఆయన ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ పాలనకు వంద రోజులు పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇటీవల మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ తదుపరి ఎజెండా పీవోకేను భారత్ పరం చేయడమేనని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

ఉగ్ర కేంద్రాల సమీపంలో పడవలు

నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి పాక్ వైపు ఉన్న ఉగ్రస్థావరాల్లో రబ్బర్ పడవలు ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించి భారత సైన్యానికి సమాచారం ఇచ్చాయి. ఉగ్రవాదులు కృష్ణ ఘాటీ నదిని ఉపయోగించుకుని భారత్‌లోకి చొరబడొచ్చని హెచ్చరించాయి.

'జమాతుద్ దవాపై రూ.కోట్లు వెచ్చింపు'

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జమాతుద్ దవాను ప్రధాన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు ఇమ్రాన్ ఖాన్ సర్కారు రూ.కోట్లు వెచ్చించినట్లు పాక్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి బ్రిగేడియర్ ఇజాజ్ అహ్మద్‌షా తెలిపారు. అదే సమయంలో కశ్మీర్ అంశంలో అంతర్జాతీయ సమాజం మద్దతుని కూడగట్టడంలో పాకిస్థాన్ విఫలమైందని అంగీకరించారు.

మోదీ సర్కారుపై వీధి పోరాటాలు

కాంగ్రెస్ శ్రేణులకు సోనియా పిలుపు

ఈనాడు, దిల్లీ: ప్రజలు ఇచ్చిన తీర్పును భాజపా ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, అధికారాన్ని 'అత్యంత ప్రమాదకర రీతి'లో ఉపయోగిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ విమర్శించారు. దీనిపై పోరుబాట పట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ 150వ జయంతి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై ఆమె గురువారం పార్టీ సీనియర్లు, వివిధ రాష్ట్రాల నాయకులతో చర్చించారు. "గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. దీనిని ఎదుర్కొనేందుకు దేశ ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. మనం ధైర్యంగా నిలబడాలి. వీధి పోరాటాలు చేయాలి. సామాజిక మాధ్యమాల ద్వారా పోరాడడం అవసరమే. కానీ అదొక్కటే సరిపోదు. ప్రజలను నేరుగా కలవాలి" అని దిశానిర్దేశం చేశారు. వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థ ప్రమాదకర పరిస్థితుల్లో ఉందన్నారు.

విదేశీ పెట్టుబడులకు ఆర్ఎస్ఎస్ సమ్మతి

ఈనాడు, దిల్లీ: ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ అయిన స్వదేశీ జాగరణ్ మంచ్ (ఎస్‌జేఎం) విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించనుంది. ఇందులో భాగంగా సన్నకారు రైతులు, చిరు వ్యాపారులను ఈ నెలాఖరులో అమెరికాకు తీసుకెళ్లనుంది. ఆ దేశంలోని పెట్టుబడిదార్లపై సామాన్యులకు అవగాహన కలిగించడమే దీని ఉద్దేశం.

26 నుంచి బ్యాంకుల సమ్మె!

దిల్లీ: దేశవ్యాప్తంగా ఈనెల 26 నుంచి రెండు రోజుల పాటు సమ్మెకు దిగనున్నట్లు 4 ప్రభుత్వ రంగ బ్యాంకుల అధికారుల సంఘాలు హెచ్చరించాయి. ఈమేరకు ఆల్ ఇండియా బ్యాంకు అధికారుల కాన్ఫెడరేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ అధికారుల అసోసియేషన్, భారత జాతీయ బ్యాంకు అధికారుల కాంగ్రెస్, బ్యాంకు అధికారుల నేషనల్ ఆర్గనైజేషన్‌లు సంయుక్తంగా నోటీసు ఇచ్చాయి. బ్యాంకుల విలీనానికి ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సమ్మెకు దిగుతున్నట్లు పేర్కొన్నాయి.

బెయిల్ కోసం మరోసారి చిదంబరం వినతి

దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అవినీతికి పాల్పడ్డారన్న అభియోగాలు ఎదుర్కొంటున్న కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం గురువారం బెయిల్ కోసం దిల్లీ హైకోర్టు, ట్రయల్ కోర్టులను ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు ఈ నెల 23న విచారించనుంది. తనను జుడీషియల్ కస్టడీకి ఇస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ చిదంబరం దిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన మరో పిటిషన్‌ను చిదంబరం ఉపసంహరించుకున్నారు. అక్రమ నగదు చలామణీ కేసులో లొంగిపోయే అవకాశం కల్పించాలని కోరారు.

వైద్య పరిశోధనలకు రూ.133.5 కోట్ల విరాళం

లండన్: సంచలన 'హ్యారీ పోటర్' పుస్తకాల రచయిత జె.కె.రౌలింగ్ మరోసారి భారీ దాతృత్వం ప్రదర్శించారు. మెదడు-కేంద్ర నాడీ వ్యవస్థల మధ్య సంబంధాన్ని దెబ్బతీసే మల్టిపుల్ స్క్లెరోసిస్ (ఎంఎస్)పై పరిశోధనల నిమిత్తం గురువారం సుమారు రూ.133.5 కోట్ల (18.8 మిలియన్ డాలర్ల) విరాళం ప్రకటించారు. ఈ మొత్తంతో ఈడెన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో పరిశోధన వసతులు సమకూర్చుతారు. ఎంఎస్‌తో బాధపడుతూ రౌలింగ్ మాతృమూర్తి తన 45వ ఏట కన్నుమూశారు.

'ఒకే దేశం.. ఒకే ప్రమాణం' విధానాన్ని తెస్తాం

దిల్లీ: వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు, సేవలు అందేలా చూసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఒకే దేశం-ఒకే ప్రమాణం' విధానంపై కృషి చేస్తోందని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రాంవిలాస్ పాసవాన్ గురువారం తెలిపారు.

హోటళ్లలో గాజు సీసాలతో నీళ్లు

దిల్లీ: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా ప్యాకేజ్డ్ మంచినీటికి బదులు కాగితంతో సీల్ చేసిన గాజు సీసాల వినియోగానికి హోటళ్లకు అనుమతులు ఇస్తున్నట్లు ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ గురువారం తెలిపింది. ప్లాస్టిక్ పాత్రలు, స్ట్రాలు, కప్పులకు బదులు వెదురుతో చేసినవి ఉపయోగించేందుకు అనుమతించినట్లు వెల్లడించింది.

సముచిత కారణాలతోనే జడ్జీల బదిలీలు: సుప్రీం

ఈనాడు, దిల్లీ: హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల బదిలీల సిఫార్సుల వెనక సముచితమైన కారణాలు ఉంటాయని సుప్రీంకోర్టు గురువారం స్పష్టంచేసింది. మద్రాస్ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వి.కె.తహిల్ రమణిని మేఘాలయ హైకోర్టుకు బదిలీ చేయడం, అనంతరం ఆమె రాజీనామా చేయడంపై వివాదం చెలరేగిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. న్యాయమూర్తుల బదిలీకి కారణాలను వెల్లడించాల్సిన పరిస్థితులు అనివార్యమైతే కొలీజియం అందుకు ఏమాత్రం సంకోచించదని స్పష్టంచేసింది.

'జమ్మూ-కశ్మీర్' చట్టానికి 52 సవరణలు

ఈనాడు, దిల్లీ: జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి కేంద్ర ప్రభుత్వం 52 సవరణలు చేసింది. ఆగస్టు 5వ తేదీన రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లును ఆదరాబాదరగా తయారుచేసిన అధికార యంత్రాంగం ఇప్పుడు అందులో దొర్లిన అక్షర, వ్యాకరణ దోషాలు సహా వివిధ తప్పులను సవరిస్తూ సవరణ నోటిఫికేషన్ జారీచేసింది.

బిగ్గరగా నవ్వి.. నవ్వి..

బీజింగ్: చైనాలో ఇటీవల కన్‌మింగ్ నుంచి గౌంఝౌకు రైలులో వెళ్తున్న ప్రయాణికురాలు ఒకరు బిగ్గరగా నవ్వి నవ్వి ఒక్కసారిగా నోరు వెళ్లబెట్టేసింది! తెరచిన నోరు మూసుకోలేదు. అదృష్టవశాత్తూ ఆ బోగీలోనే ఓ వైద్యుడు కూడా ఉండటంతో... ఆయన వచ్చి పరీక్షించారు. దవడ ఎముక పక్కకు జరిగినట్టు గుర్తించి, మళ్లీ యథాస్థానంలోకి వచ్చేట్టు చేశారు.

విక్రమ్ కోసం రంగంలోకి నాసా

దిల్లీ: జాబిల్లి ఉపరితలంపై ఉలుకూపలుకూ లేకుండా ఉన్న 'విక్రమ్' ల్యాండర్‌తో సంబంధాలు ఏర్పరచుకోవడానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చిట్టచివరి ప్రయత్నాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా'ను రంగంలోకి దించింది. మన ల్యాండర్‌తో సంధానమయ్యేందుకు ఆ సంస్థ సంకేతాలను పంపుతోంది. నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ (జేపీఎల్) తన డీప్ స్పేస్ నెట్‌వర్క్ (డీఎస్ఎన్)లోని భూ కేంద్రాల ద్వారా విక్రమ్‌కు రేడియో తరంగాలను పంపింది. దక్షిణ కాలిఫోర్నియాలోని గోల్డ్‌స్టోన్, స్పెయిన్‌లోని మ్యాడ్రిడ్, ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలో ఉన్న నాసా డీఎస్ఎన్ కేంద్రాల నుంచి 12 కిలోవాట్ల శక్తి కలిగిన రేడియో ఫ్రీక్వెన్సీ తరంగాలను జాబిల్లి మీదకు ప్రసరింపచేస్తోంది. భూ కేంద్రంతో కమ్యూనికేషన్ సాగించేలా ల్యాండర్‌ను ప్రేరేపించడం దీని ఉద్దేశం. సుదూరపు విశ్వంలోని వ్యోమనౌకలు కనీసం ఏదో ఒక కేంద్రంతో సంబంధాలను కొనసాగించేలా చూడటం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు సౌర కుటుంబం అంచులవరకూ కమ్యూనికేషన్ సాగించగలవు. ఆ కేంద్రాల్లోని భారీ యాంటెన్నాలతో ఏకకాలంలో అనేక వ్యోమనౌకలతో కమ్యూనికేషన్‌ను సాగించవచ్చు. మరోపక్క


కాలిఫోర్నియాలోని డీఎస్ఎన్ యాంటెన్నా

రోజులు గడిచేకొద్దీ ల్యాండర్ పునరుద్ధరణ అవకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. జాబిల్లిపై 14 రోజుల పగటి సమయం ఈ నెల 20-21తో ముగుస్తుంది. ఆ తర్వాత విక్రమ్‌లోని సౌరఫలకాలకు శక్తి అందదు. ఆ పరిస్థితుల్లో వ్యోమనౌకపై ఆశలు వదులుకోవాల్సిందే.

శోధించనున్న అమెరికా ఆర్బిటర్

మరోవైపు జాబిల్లి కక్ష్యలో తిరుగుతున్న నాసా ఆర్బిటర్ లూనార్ రికానసెన్స్ ఆర్బిటర్ (ఎల్ఆర్‌వో) ఈ నెల 17న 'విక్రమ్' ఉన్న ప్రదేశం వద్దకు వస్తుంది. అప్పుడు ఆ ప్రాంతాన్ని చిత్రీకరించి, ఇస్రోకు అందజేస్తామని నాసా అధికార ప్రతినిధి తెలిపారు. వాటిలో ల్యాండర్ జాడ కనిపించే అవకాశం ఉంది. ఇప్పటికే చంద్రయాన్-2 ఆర్బిటర్ తీసిన చిత్రాలు ఇస్రోకు అందాయని, ల్యాండర్ ఆకృతి చెక్కుచెదరకుండా ఉందని అందులో తేలినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

విక్రమ్ కోసం గాలింపు జరుగుతున్న నేపథ్యంలో నాసాలోని జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ, కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (క్యాల్టెక్)కి చెందిన నిపుణులు బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సంస్థ ఛైర్మన్ కె.శివన్‌తో చర్చలు జరిపారు. ఈ పర్యటన ఉద్దేశం ఏంటన్నది ఇంకా వెల్లడి కాలేదు. భారత అంతరిక్ష విభాగం ఆధ్వర్యంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ).. క్యాల్టెక్ భాగస్వామ్యంతో 'ఆ రెస్ట్' పేరుతో ఒక కొత్త రకం అంతరిక్ష టెలిస్కోపును నిర్మించనుంది. చంద్రయాన్-2తో మెరుగైన ఫలితాలు వస్తాయని ఇస్రో మాజీ ఛైర్మన్ ఎ.ఎస్.కిరణ్ కుమార్ ఆశాభావం వ్యక్తంచేశారు.

సుదూరపు గ్రహంపై నీటి జాడ

లండన్: మన భూగోళాన్ని పోలిన మరో గ్రహంపై నీటి జాడ ఉన్నట్లు లండన్ విశ్వవిద్యాలయ ఖగోళ శాస్త్రవేత్తలు తొలిసారిగా కనుగొన్నారు. అక్కడ జీవుల మనుగడకు అనుకూలమైన ఉష్ణోగ్రతలు ఉన్నట్లు అంచనాకు వచ్చారు. మన సౌర వ్యవస్థకు ఆవల, భూమికి 110 కాంతి సంవత్సరాల దూరాన ఈ గ్రహముంది. "భూమికంటే 2.5 రెట్లు పెద్దదైన కె2-18బి అనే ఈ గ్రహంపై మైనస్ 8 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది. ఓ చిన్న నక్షత్రం చుట్టూ ఇది తిరుగుతోంది. అక్కడి వాతావరణంలో నీటి ఆవిరితో పాటు హైడ్రోజన్, హీలియం ఉన్నాయి. మీథేన్, నైట్రోజన్‌లు కూడా ఉండే అవకాశముంది." అని ప్రధాన పరిశోధకుడు ఏంజెలోస్ సియరాస్ తెలిపారు. అయితే... కె2-18బి జీవనయోగ్య గ్రహం కాకపోవచ్చని మరికొందరు పరిశోధకులు అంటున్నారు. భూమిని పోలిన గ్రహాలు విశ్వంలో మరెన్నో ఉన్నట్లు ఇప్పటికే శాస్త్రవేత్తలు తేల్చినా... మరో గ్రహంపై నీటి జాడ, జీవన యోగ్య పరిస్థితులు ఉన్నట్టు గుర్తించడం మాత్రం ఇదే తొలిసారి.

రోదసిలో సిమెంటు..

వాషింగ్టన్: రోదసిలోని సూక్ష్మ గురుత్వాకర్షణ పరిస్థితుల్లో తొలిసారిగా పరిశోధకులు సిమెంటును కలిపారు. భూకక్ష్యలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) ఇందుకు వేదికైంది. దీనివల్ల భవిష్యత్‌లో విశ్వంలోని హానికారక రేడియోధార్మికత, అసాధారణ ఉష్ణోగ్రతల నుంచి మానవులను రక్షించడానికి వీలవుతుందని అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' తెలిపింది. భూమి మీద నిర్మాణ రంగంలో కాంక్రీటును విరివిగా ఉపయోగిస్తుంటారు. తాజా ప్రయోగం ద్వారా ఈ ప్రక్రియకు సంబంధించిన రసాయన తీరుతెన్నులు, సూక్ష్మ గురుత్వాకర్షణ వాతావరణం వల్ల ఈ కాంక్రీటులో సూక్ష్మనిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయా అనే అంశాలను పరిశీలించాలన్నది శాస్త్రవేత్తల ఉద్దేశం. తాజా ప్రయోగంలో సిమెంటులోని ప్రధాన పదార్థమైన ట్రైక్యాల్షియం సిలికేట్‌ను తొలిసారిగా భూమి గురుత్వాకర్షణ శక్తికి వెలుపలి ప్రాంతంలో నీటితో కలిపారు. వివిధ రకాల మిశ్రమాల్లో దీన్ని సిద్ధం చేశారు. భూమి మీద కలిపిన సిమెంటుతో పోలిస్తే వీటిలో గణనీయ మార్పులను గుర్తించారు.

భారత్‌లోనే తూటా రక్షణ కవచాలు

అంతర్జాతీయ ప్రమాణాలు

ఈనాడు, దిల్లీ: స్వీయ ప్రమాణాలతో రూపొందిన దుర్భేద్య బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను భారత్ 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తోంది. భారత ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) ఖరారుచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా సిద్ధమైన ఈ కవచాలను ఐరోపా దేశాలూ అందుకుంటున్నాయి. అమెరికా, బ్రిటన్, జర్మనీ తర్వాత తూటా రక్షణ కవచాలకు సంబంధించి స్వీయ జాతీయ ప్రమాణాలను కలిగిన దేశంగా భారత్ అవతరించింది. ఈ ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయిలో ఉన్నాయని బీఐఎస్ డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్ బజాజ్ చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ఆయుధ కర్మాగారాలు, ప్రైవేటు సంస్థలు దేశీయంగా వీటిని ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. ఇప్పటివరకు ఇలాంటి ప్రమాణాలు లేకపోవడం వల్ల భారత్ దీర్ఘకాలం పాటు నాణ్యమైన తూటా రక్షణ కవచాలను కొనుగోలు చేయలేకపోయిందని పేర్కొన్నారు.

7 ఫుట్‌బాల్ మైదానాలంత..!

- దేశంలో తొలిసారిగా అక్రమ వలసదారుల నిర్బంధ కేంద్రం
- అసోంలో శరవేగంగా నిర్మాణం

గోల్‌పాడా: అది అసోం రాజధాని గువాహటికి 150 కి.మీ.ల దూరంలోని విశాల ప్రాంతం. ఓ మెగా నిర్మాణ సముదాయం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. ఎంత విస్తీర్ణం అంటే అది 7 సాకర్ (ఫుట్‌బాల్) మైదానాలతో సమానం. ఇంతకీ ఈ నిర్మాణాలు దేనికో తెలుసా! దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేయనున్న అక్రమ వలసదారుల నిర్బంధ కేంద్రానికి. అసోం జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ) వెల్లడయిన నేపథ్యంలో విదేశీయులుగా తేలినవారిని ఇక్కడ ఉంచుతారు. ఇక్కడ హాస్టల్ మాదిరి వసతులుంటాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తవుతుందని భావిస్తున్నారు. అసోం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఈ పనులు చేపడుతోంది.

ఎక్కడ? గోల్‌పాడా జిల్లా మాతియా

విస్తీర్ణం 2.5 హెక్టార్లు

నిర్మాణ వ్యయం రూ. 46 కోట్లు

ఎంతమందిని ఉంచొచ్చు? 3000

ఏమేం ఉంటాయి?
- 1 ఆసుపత్రి
- 1 ఆడిటోరియం
- 1 ప్రాథమిక పాఠశాల
- 1 ఉమ్మడి వంటశాల

విశేషాలు
చుట్టూ 20 అడుగుల ఎత్తులో ఎరుపు రంగు సరిహద్దు గోడ ఉంటుంది. వాచ్ టవర్లుంటాయి. మహిళలకు, పిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు.

ఈనాడు బిజినెస్

సెల్ అమ్మకాలకూ ఉక్కపోత

మందగమన భయాలతో కొనుగోళ్లు వాయిదా

● పండుగల ఆఫర్లపైనా దృష్టి

ఈనాడు వాణిజ్య విభాగం

ఆర్థిక మందగమన కష్టాలు సెల్‌ఫోన్ అమ్మకాలపైనా ప్రభావం చూపుతున్నాయా. . అంటే అవుననే పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగానే జూన్ తరవాత సెల్‌ఫోన్ విక్రయాల్లో వృద్ధి కాస్త తగ్గుతుంది. ఈసారి మరింత ఎక్కువగా ఉందని విక్రయ సంస్థలు వెల్లడిస్తున్నాయి. మాంద్యం వస్తుందనే భయాందోళనతో అంతగా అవసరం లేని కొనుగోళ్లకు దూరంగా ఉంటున్న వారు కొందరైతే, కొత్త ఉద్యోగాల కల్పన తక్కువగా ఉండటం, ఆసుపత్రి ఖర్చుల వంటివీ సెల్ అమ్మకాలపై ప్రభావం చూపుతున్నాయంటున్నారు. పండుగ సీజన్‌లో కొత్త మోడళ్లు-భారీ ఆఫర్లపై ఆశలు, యాపిల్‌తో పాటు శామ్‌సంగ్, వివో, షియామీ వంటి దిగ్గజ కంపెనీలన్నీ అధునాతన ఫీచర్లతో కొంగొత్త మోడళ్లు తెస్తున్నందున, సెల్‌ఫోన్ అత్యవసరమైతేనే ప్రస్తుతం కొంటున్నారు.



ఇవీ కారణాలు

మాంద్యం భయాలు

ఆర్థిక మాంద్యం వచ్చేస్తోంది.. ఆర్థికంగా పొదుపు పాటించండి అనే సూచనలు విస్తృతంగా ప్రచారమవ్వడంతో, అవసరమైనవే కొందాములే అనే ధోరణి ఎక్కువమందిలో కనిపిస్తోంది.

కొత్త ఉద్యోగాలు అంతంతమాత్రమే

స్మార్ట్‌ఫోన్ల కొనుగోలులో యువతదే ప్రధాన పాత్ర. కొత్తగా ఉద్యోగంలో చేరినవారు, స్థోమతకు తగ్గవి కొంటుంటారు. సంతృప్తికర ఆదాయం లభించే ఉద్యోగాల కల్పన తక్కువగా ఉండటం, ఉత్పత్తుల అమ్మకాలపై ప్రభావం పడుతోంది. వివిధ రంగాల ఇకామర్స్ పోర్టళ్లలో ఉపాధి అవకాశాలు లభిస్తున్నా, ఇష్టపడినవి కొనుగోలు చేసుకునే స్థాయిలో ఆదాయాలు ఉండటం లేదు.

నెలవారీ వాయిదా మొత్తాలు ఎక్కువే

రెండు, మూడేళ్లుగా నెలవారీ సులభ వాయిదా (ఈఎంఐ)ల్లో వస్తువుల అమ్మకాలు పెరిగాయి. గృహ, వాహన, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, సెల్‌ఫోన్లు, దుస్తులతో పాటు విహార యాత్రలకు కూడా ఈ సదుపాయాన్ని వాడేస్తున్నారు. సాధారణ ఉద్యోగులెవరైనా ప్రతనెలా 2-3 ఈఎంఐలు కట్టాలంటే భారమే. రుణం పహూలు చేసుకోవడం సులభం, సురక్షితం అని భావించే రంగాల్లోని ఉద్యోగులు, వృత్తినిపుణులకే ఆర్థిక సంస్థలు ఈ సదుపాయం కల్పిస్తున్నాయి. ఇలాంటి ఉద్యోగాలు కొత్తగా అధికంగా రాకపోవడం వల్ల, ఇప్పటికే తీసుకున్న వారి బకాయిలు తీర నందున, కొత్తగా తీసుకునే వారి సంఖ్యలో వృద్ధి తగ్గుతోంది. గతంలో మాదిరి ఆర్థిక సంస్థలు కూడా విరివిగా రుణం ఇవ్వడం లేదు. తక్కువ మొత్తాన్నే జారీ చేస్తున్నాయి.

విద్య-వైద్య ఖర్చులు

ఇంటర్ ఉత్తీర్ణులు డిగ్రీ, ఇంజినీరింగ్, వైద్య విద్యల్లో చేరే ప్రక్రియ ఆగస్ట్ ఆఖరు వరకు కొనసాగుతోంది. విద్యారుసుములు చెల్లించడమే భారమవుతోంది. ఈసారి తెలుగు రాష్ట్రాల్లో జ్వర పీడితుల సంఖ్య తీవ్రమైంది. డెంగీ భయంతో ఆసుపత్రికి వెళ్తే రూ.50,000 పైబడి బిల్లు చెల్లించాల్సి వస్తున్నందున, అనేక కుటుంబాలకు ఆర్థికభారమే అయ్యింది. ఇవన్నీ సెల్‌ఫోన్ల అమ్మకాలపై ప్రభావం చూపుతున్నాయి.

అమ్మకాల్లో 'రుణం వాటా' రెట్టింపు

ఏడాది క్రితం నెలవారీ వాయిదాలపై జరిగే అమ్మకాలు 16 శాతం ఉంటే, ప్రస్తుతం 33-34 శాతానికి చేరాయని దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు 200 విక్రయశాలలు నిర్వహిస్తున్న బిగ్‌సి డైరెక్టర్ స్వప్నకుమార్ తెలిపారు. సంపన్న వర్గాల్లో కొనుగోలు ధోరణి మారలేదని, అయితే యాపిల్ సంస్థ కొత్త మోడళ్లను విడుదల చేసినందున, వాటికోసం ఈ శ్రేణి కొనుగోలుదార్లు ఎక్కువగా ఎదురు చూస్తున్నారని వివరించారు. రూ.15-25 వేల శ్రేణిలో కొనుగోళ్లలో ఈఎంఐ వాటా ఎక్కువగా ఉంటోందని, పండుగల సీజన్‌లో ఆఫర్లు వస్తాయి కదా అని వీరు వేచి ఉంటున్నారని తెలిపారు.

అమ్మకాలు 20 శాతం తగ్గాయ్

ఏడాది క్రితంతో పోలిస్తే, ఈ ఏడాది జూన్ తరవాత సెల్ విక్రయాలు 20 శాతం మేర తగ్గాయని ఆంధ్రప్రదేశ్‌లో 90 విక్రయశాలలు నిర్వహిస్తున్న సెల్‌పాయింట్ ఎండీ పి.మోహన్ ప్రసాద్ తెలిపారు. రుణ చెల్లింపు బాగున్న ఖాతాదార్లకు, స్మార్ట్‌ఫోన్ విలువలో 100 శాతాన్ని ఆర్థిక సంస్థలు గతంలో రుణంగా ఇచ్చేవని, ఇప్పుడు 50 శాతమే జారీ చేస్తున్నాయని వివరించారు. నెలవారీ వాయిదాలపై కొనుగోలు చేసిన వారు కూడా, 6 నెలలు కాగానే మార్చుకుని, మరో కొత్త ఫోన్ తీసుకునేవారని, ఇప్పుడు మాత్రం వాయిదాలన్నీ చెల్లించేవరకు పాత ఫోన్‌నే వాడుతున్నారని పేర్కొన్నారు.

అధునాతన ఫీచర్ల కోసం..

రూ.50,000 పైబడి ఫోన్లు కొనుగోలు చేసేవారు, అవసరమైతే ఎప్పుడైనా కొంటారు.. మిగిలినవారు మాత్రం అందుబాటు ధరలో నాణ్యమైన ఫీచర్లు చూస్తుంటారని టెక్నోవిజన్ ఎండీ సికిందర్ వివరించారు. 48 మెగాపిక్సెల్ కెమేరా, వెనుకవైపే 4 కెమేరాలు, 6-8 జీబీ ర్యామ్.. ఇలా అధునాతన ఫీచర్లు కలిగిన స్మార్ట్‌ఫోన్లను రూ.20,000 శ్రేణిలో కంపెనీలు పండుగల సీజన్‌లో విడుదల చేస్తాయని వేచి చూస్తున్నారని తెలిపారు.

ఆఫర్లపై ఆశలు

పండుగ సీజన్‌లో భారీ ఆఫర్లు ఇస్తామని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే ఊరిస్తున్నాయి. బిగ్‌బిలియన్ డేస్ అమ్మకాలు 29 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఫ్లిప్‌కార్ట్ ప్రకటించగా, మరుసటిరోజే డెలివరీ ఇచ్చే సదుపాయాన్ని దేశవ్యాప్తంగా 650 పట్టణాలకు విస్తరించినట్లు అమెజాన్ తెలిపింది. శామ్‌సంగ్, షియామీ, వివో, ఒపో వంటి బ్రాండ్లు అధునాతన ఫీచర్లను వెల్లడిస్తున్నాయి. ఐఫోన్ 11 మోడళ్లు విపణిలోకి విడుదలైతే, అమ్మకాల జోరుంటుందని విక్రేతలు ఆశిస్తున్నారు. ఆర్థిక సంస్థలు కూడా మరిన్ని వర్గాలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇవన్నీ అనుకూలిస్తే నిజంగా పండుగ సీజనే అవుతుంది.

ఆరంభ లాభాలు ఆవిరి

సూచీల ఆరంభ లాభాలు ఆవిరయ్యాయి. పారిశ్రామికోత్పత్తి, రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనుండటంతో మదుపర్లు అప్రమత్తమయ్యారు. ఇటీవల పెరిగిన బ్యాంకింగ్, వాహన షేర్లకు లాభాల స్వీకరణ ఎదురైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 52 పైసలు బలపడి 71.14 వద్ద ముగిసింది. అమెరికా- చైనా వాణిజ్య చర్చలపై ఆశలు, ఐరోపా కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్లు తగ్గించొచ్చన్న అంచనాలతో ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

మార్కెట్ సమీక్ష

సెన్సెక్స్ ఉదయం 37,330.47 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమై ఇంట్రాడేలో 37,435.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అనంతరం మదుపర్ల లాభాల స్వీకరణతో నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఒడుదొడుకులు ఎదుర్కొంది. ఒకానొకదశలో 37,048.67 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్, చివరకు 166.54 పాయింట్ల నష్టంతో 37,104.28 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 52.90 పాయింట్లు కోల్పోయి 10,982.80 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,964.95- 11,081.75 పాయింట్ల మధ్య కదలాడింది.

■ ఇస్రో నుంచి రూ.77.20 కోట్ల విలువైన ఆర్డరు దక్కించుకోవడంతో వాల్‌చంద్‌నగర్ ఇండస్ట్రీస్ షేరు దూసుకెళ్లింది. 19.95 శాతం లాభంతో రూ.72.15 వద్ద ముగిసింది.



సెన్సెక్స్ 30 షేర్లలో 22 నష్టాలు చవిచూశాయి. యెస్ బ్యాంక్ 5.10%, టాటా మోటార్స్ 4.76%, మారుతీ సుజుకీ 3.13%, యాక్సిస్ బ్యాంక్ 2.77%, భారతీ ఎయిర్‌టెల్ 2.20%, బజాజ్ ఆటో 1.94%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.92% చొప్పున డీలాపడ్డాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 2.13%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.36%, సన్‌ఫార్మా 1.34%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.95%, ఎస్‌బీఐ 0.54% మేర రాణించాయి.

సెన్సెక్స్	నిఫ్టీ
167 ▼	53 ▼
37104	10983

డోజోన్స్	నాస్‌డాక్
157 ▲	55 ▲
27294	8225

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి ▲	ముడిచమురు ▼
71.14	59.95
52 పైసలు	(బ్రెంట్ ధర డాలర్లలో)
(ఒక అమెరికా డాలరుకు)	

ఘనం (+)			గ్రహణం (-)		
నిఫ్టీ	12న	మార్పు%	నిఫ్టీ	12న	మార్పు%
INDIABULLS FIN	449.40	4.16	YES BANK	67.95	-5.10
ULTRATECH CEM	4002.05	2.53	TATA MOTORS	127.95	-4.76
ICICI BANK	402.70	2.05	MARUTI SUZUKI	6392.05	-3.11
HINDALCO IND	197.10	1.89	AXIS BANK	662.90	-2.76
SUN PHARMA	427.80	1.33	JSW STEEL	222.05	-2.48
INDUSIND BANK	1390.25	1.32	ZEE ENTER ENT	346.40	-2.27
HDFC BANK	2270.85	0.87	BHARTI AIRTEL	347.55	-2.13

12న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

కోడిగుడ్లు (100కు రూపాయలలో)

		13న తేదీకి...	
హైదరాబాద్	336	వరంగల్	339
చిల్లరగా (ఒక గుడ్డు)	3.95	విశాఖపట్నం	380
బెంగళూరు	355	చెన్నై	365
విజయవాడ	365		
గోదావరి	365		
నమక్కల్	358	చిత్తూరు	358

డేటాకు హద్దులు సరికాదు

ఫేస్‌బుక్ ఉపాధ్యక్షుడు నిక్ క్లెగ్

దిల్లీ: డేటా కొత్త తరం ఇంధనమేమీ కాదని ఫేస్‌బుక్ ఉపాధ్యక్షుడు (అంతర్జాతీయ వ్యవహారాలు, కమ్యూనికేషన్స్) నిక్ క్లెగ్ అభిప్రాయపడ్డారు. భారత్ వంటి దేశాలు డేటాను అదుపు చేయకూడదని, సరిహద్దులు చెరిపేయాలని అన్నారు. జాతీయ భద్రతకు డేటా పంచుకోవడం చాలా కీలకమని, తీవ్ర నేరాలు, ఉగ్రవాదం వంటి వాటిని అదుపుచేయడానికి ఉపయోగ పడుతుందన్నారు. వ్యక్తిగత డేటా గోప్యతను ప్రతి ఒక్కరు గౌరవించాల్సిందేనని, అయితే పోటీతత్వం, వినూత్నతను ప్రోత్సహిస్తూనే ఉండాలని తెలిపారు. ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తోనూ క్లెగ్ సమావేశమయ్యారు. ఫేస్‌బుక్ తీసుకురాబోతున్న క్రిప్టోకరెన్సీ 'లిబ్రా'పై నిషేధం విధిస్తామని ఫ్రాన్స్ పెచ్చరించింది.

ఫ్రాన్స్‌తో రూ.7000 కోట్ల పన్ను సెటిల్‌మెంట్: గూగుల్

పారిస్: ఫ్రాన్స్‌తో నడుస్తున్న 945 మిలియన్ యూరోల (దాదాపు రూ.7000 కోట్లు) పన్ను వివాదాన్ని పరిష్కరించుకోవడానికి అమెరికా ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్ అంగీకరించింది. పన్ను ఎగవేసినందుకు కంపెనీ 500 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించనుంది. ఫ్రాన్స్ పన్ను సంస్థలతో క్లెయిమ్‌లను పరిష్కరించడానికి మరో 465 మిలియన్ డాలర్లు కట్టనుంది. గత కొన్నేళ్లుగా ఫ్రాన్స్‌తో నడుస్తున్న వివాదాలకు స్వస్తి చెప్పడంపై గూగుల్ హర్షం వ్యక్తం చేసింది. గూగుల్ నిర్ణయాన్ని ఫ్రాన్స్ న్యాయ మంత్రి నికోల్ బెల్లోబెట్, ఆర్థిక మంత్రి గెరాల్డ్ డార్మనిన్ స్వాగతించారు.

నెమ్మదించిన తయారీ

జులైలో పారిశ్రామికోత్పత్తి వృద్ధి 4.3 శాతమే

దిల్లీ: తయారీ రంగం పేలవ ప్రదర్శనతో జులైలో పారిశ్రామికోత్పత్తి వృద్ధి నెమ్మదించింది. పారిశ్రామికోత్పత్తి వృద్ధికి ప్రామాణికమైన పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 4.3 శాతానికి పరిమితమైంది. 2018 జులైలో ఇది 6.5 శాతం వద్ద ఉంది. ఈ ఏడాది జూన్‌లో పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటు 1.2 శాతం కాగా.. మేలో 4.6 శాతంగా నమోదైంది. ఏడాది కాలంలో తయారీ రంగ వృద్ధి 7 శాతం నుంచి 4.2 శాతానికి పరిమితమైంది. 23 పరిశ్రమ విభాగాల్లో 13 సానుకూల వృద్ధి నమోదుచేశాయి. పెట్టుబడులకు ప్రామాణికంగా భావించే భారీ యంత్రపరికరాల రంగ వృద్ధి 7.1 శాతం నుంచి తగ్గి 2.3 శాతంగా నమోదైంది. ఇక ఏప్రిల్- జులైలో పారిశ్రామికోత్పత్తి వృద్ధి 3.3 శాతంగా ఉంది. కిందటేడాది ఇదే సమయంలో నమోదైన వృద్ధి 5.4 శాతం కావడం గమనార్హం.

10 నెలల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం

ఆగస్టులో 3.21 శాతానికి సీపీఐ

దిల్లీ: ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 10 నెలల గరిష్ఠమైన 3.21 శాతానికి చేరింది. అయినా ఆర్‌బీఐ లక్షిత 4 శాతం లోపే ఉంది. మాంసం, చేపలు, కూరగాయలు, పప్పుదినుసుల లాంటి ఆహార పదార్థాలు ప్రియం కావడం ఇందుకు కారణమైంది. 2018 అక్టోబరులో నమోదైన 3.39 శాతం తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. ఈ ఏడాది జులైలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.15 శాతం కాగా, 2018 ఆగస్టులో 3.69 శాతంగా నమోదైంది. ఆగస్టులో ఆహార పదార్థాల ద్రవ్యోల్బణ రేటు 2.99 శాతానికి పెరిగింది. జులైలో ఇది 2.36 శాతంగా నమోదైంది. మాంసం, చేపల ధరల్లో 8.51 శాతం పెరుగుదల ఉండగా.. పప్పులు, సంబంధిత ఉత్పత్తులు 6.94%, కూరగాయాలు 6.9 శాతం మేర ప్రియమయ్యాయి.

✦ పారిశ్రామికోత్పత్తి నెమ్మదించడం, రిటైల్ ద్రవ్యోల్బణం లక్షిత 4 శాతం కంటే తక్కువే ఉన్నందున, అక్టోబరు సమీక్షలో రేట్ల కోతకు అవకాశం ఉండొచ్చని భావిస్తున్నారు.

ఫార్చునర్ @ రూ.33.85 లక్షలు

దిల్లీ: స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) ఫార్చునర్‌లో పరిమిత శ్రేణి మోడల్‌ను రూ.33.85 లక్షల (ఎక్స్ షోరూమ్, దిల్లీ)కు ఆవిష్కరించినట్లు టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) గురువారం ప్రకటించింది. సరికొత్త ఫార్చునర్ టీఆర్‌డీ 'సెలెబ్రిటీ ఎడిషన్'గా వ్యవహరిస్తున్న ఈ వాహనాన్ని టయోటా రేసింగ్ డెవలప్‌మెంట్ అభివృద్ధి చేసింది. 2.8 లీటర్ డీజిల్ ఇంజిన్‌తో ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ పద్ధతిలో ఈ ఫార్చునర్ లభిస్తుందని టీకేఎం డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.రాజా తెలిపారు.

ఆకర్షణీయ రాయితీలు: ప్రస్తుత పండుగల సీజన్లో ఇన్నోవా, ఫార్చునర్ సహా టయోటా కార్లపై ఆకర్షణీయ రాయితీలు ఇస్తున్నట్లు డీలర్లు వెల్లడించారు. ఈ నెలలో కార్లు కొనుగోలు చేసిన వారికి మంచి ప్రయోజనాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో చబ్ ఇన్సూరెన్స్ టెక్నాలజీ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: స్థిరాస్తి, క్యాజువాలిటీ బీమా సేవలు అందించే అమెరికాకు చెందిన అంతర్జాతీయ సంస్థ చబ్ ఇన్సూరెన్స్ హైదరాబాద్‌లో తన సాంకేతిక సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మరో కేంద్రాన్ని బెంగళూరులోనూ ప్రారంభించనుంది. ప్రపంచవ్యాప్తంగా చబ్ ఇన్సూరెన్స్‌కు అవసరమైన సాంకేతిక, డిజిటల్, డేటా అనలిటిక్స్, ఆటోమేషన్, మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ, రిస్క్ మేనేజ్‌మెంట్ అంశాల్లో ఈ 2 కేంద్రాలు సహాయం చేయనున్నాయి. హైదరాబాద్‌లో ప్రాథమికంగా 100 మందికి పైగా ఉద్యోగులను తీసుకున్నట్లు, రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని చబ్ ఇన్సూరెన్స్ చీఫ్ రిస్క్ ఆఫీసర్ సీన్ రింగ్‌స్టెడ్ తెలిపారు. ఇప్పటివరకు హైదరాబాద్‌లోని టెట్రాసాఫ్ట్‌తో కలిసి పనిచేసిన ఈ సంస్థ అందులోని నిపుణులను తన పూర్తి స్థాయి ఉద్యోగులుగా తీసుకుంది. గ్లోబల్ ఆపరేషన్స్ హెడ్ జూలీ దిల్‌మన్ మాట్లాడుతూ భారత్ నుంచి సాంకేతిక నిపుణులు అందించే సహకారం సంస్థకు ఎంతో కీలకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ మాట్లాడుతూ ఫిన్‌టెక్ సంస్థల కోసం ఒక ప్రత్యేక ఫోరం ఈనెల 17న ప్రారంభం కాబోతోందని వెల్లడించారు. టీసీఎస్, ఇన్ఫోసిస్‌తో పాటు పలు బ్యాంకింగ్, ఆర్థిక సేవల సంస్థలు దాదాపు 300లకు పైగా ఇప్పటికే ఇందులో నమోదైనట్లు తెలిపారు.

నెలవారీ చందాపై మహీంద్రా వాహనాలు

ఈనాడు, హైదరాబాద్: 'నెలవారీ చందా' పద్ధతిలో తమ వాహనాలను వినియోగదార్లకు ఇవ్వడానికి మహీంద్రా అండ్ మహీంద్రా ముందుకు వచ్చింది. ఈ పథకాన్ని తొలిదశలో హైదరాబాద్‌తో పాటు ముంబయి, పుణె, బెంగళూరు, కోల్‌కతా, చండీగఢ్, అహ్మదాబాద్ నగరాల్లో అమలు చేస్తారు. వినియోగదార్లు నెలకు రూ.19,720 చొప్పున చందా చెల్లించి మహీంద్రా కేయూవీ100, ఎక్స్‌యూవీ500, ఎక్స్‌యూవీ300, స్కార్పియో, టీయూవీ300, మరాజో, ఆల్టురస్ జీ4 వాహనాలను వినియోగించుకోవచ్చు. వినియోగదార్లు ముందస్తుగా ఎటువంటి మొత్తాన్ని చెల్లించాల్సిన పనిలేదు. రోడ్ టాక్స్ భారం కూడా వినియోగదార్లకు ఉండదు. నెలవారీ నిర్వహణ వ్యయం కొంత ఉంటుంది. వాడుకున్నంత కాలం వాడుకొని తదుపరి దాన్ని కంపెనీకి తిరిగి ఇచ్చేయవచ్చు.

3.6% వాటా విక్రయించిన అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్లు

● రుణభారం తగ్గించుకోడానికే

● తనఖా షేర్ల విడుదలకు సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ ప్రమోటర్లు 3.6% వాటా విక్రయించారు. ప్రమోటర్లైన డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు అపోలో హాస్పిటల్స్ జారీ మూలధనంలో 34.40% వాటా ఉంది. దీన్లో 3.6% వాటాను (50 లక్షల ఈక్విటీ షేర్లు) స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా బల్క్‌డీల్ పద్ధతిలో ఒక్కో షేర్‌ను రూ.1,450 ధరకు విక్రయించారు. తత్ఫలితంగా ప్రమోటర్లకు దాదాపు రూ.725 కోట్లు లభిస్తాయి. ఈ విక్రయం వల్ల కంపెనీలో ప్రమోటర్ల వాటా 30.80 శాతానికి తగ్గుతుంది. 'రుణభారాన్ని తగ్గించుకోడానికి, తనఖా షేర్లను విడిపించటానికి సునీతారెడ్డి, ఇతర ప్రమోటర్ల కుటుంబ సభ్యులు 3.6% షేర్లు 'బల్క్ డీల్' ద్వారా విక్రయించార'ని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది.

తనఖాలోనే 76 శాతం షేర్లు: అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్ల షేర్లలో 76 శాతం తనఖాలో ఉన్నాయి. వీటిని తనఖా నుంచి విడిపించేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా అపోలో మ్యూనిచ్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్లు తమ వాటా విక్రయించారు. ఈ లావాదేవీ వచ్చే నెలన్నర రోజుల్లో పూర్తవుతుందని అంచనా. దీనిపై వచ్చే సొమ్ముతో పాటు తాజాగా ఇప్పుడు అపోలో హాస్పిటల్స్ షేర్లు కొన్ని విక్రయించగా వచ్చిన సొమ్మును షేర్లను తనఖా నుంచి విడిపించడానికి వెచ్చిస్తారు. దీంతో తనఖా షేర్లు ఇప్పుడున్న 76 శాతం నుంచి 20 శాతానికి తగ్గుతుంది.

వాటా తగ్గించుకోం: తమ వాటాను ఇకపై తగ్గించుకునే ఆలోచన లేదని అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్లు స్పష్టం చేశారు. వైద్య సేవలు, ఫార్మసీ, రిటైల్ హెల్త్ విభాగాలపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించి పనిచేస్తున్నట్లు వివరించారు. ఈ విభాగాల్లో వృద్ధి అవకాశాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే దశాబ్దకాలంలో దేశీయ వైద్యసేవల రంగం బహుముఖంగా విస్తరిస్తుందని, టెక్నాలజీ వినియోగం బాగా పెరుగుతుందని, ఈ మార్పులకు తాము సిద్ధపడుతున్నట్లు వివరించారు. అపోలో హాస్పిటల్స్ షేర్ గురువారం నాడు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో అమ్మకాల ఒత్తిడికి లోనైంది. క్రితం రోజు ముగింపు ధర రూ.1495.40 కాగా, గురువారం నాడు రూ.2.43 శాతం (రూ.36.3) క్షీణించి 1459.10 వద్ద ముగిసింది.

మార్కెట్ కబుర్లు

✦ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, దువ్వాడ యూనిట్లకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి తనిఖీ నివేదిక (ఈఐఆర్) అందిందని **డాక్టర్ రెడ్డీస్** వెల్లడించింది.

✦ మహారాష్ట్ర, ఒడిశాల్లో రూ.2,500 విలువైన ఆర్డర్లు దక్కించుకున్నట్లు **ఎల్‌అండ్‌టీ** తెలిపింది.

✦ బైక్ క్యాబ్ సేవలను మరో 150 నగరాలకు విస్తరించినట్లు **ఓలా** తెలిపింది.

✦ బాండ్ల జారీ ద్వారా రూ.22,000 కోట్లు సమీకరించడానికి **ఎయిరిండియా అసెట్స్ హోల్డింగ్** (ఏఐఏహెచ్ఎల్) సిద్ధమైంది. తొలి విడతలో రూ.7,000 కోట్ల సమీకరణకు ఈ నెల 16న రాబోతోంది.

✦ **దేనా బ్యాంక్** ప్రధాన కార్యాలయాన్ని విక్రయించడానికి ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) సిద్ధమైంది. ముంబయిలోని ఈ కార్యాలయానికి కనీస ధర రూ.530 కోట్లుగా నిర్ణయించింది.

ఛాంపియన్

ధోని కప్పులో రిటైర్మెంట్ తుపాను!

దిల్లీ

మహేంద్రసింగ్ ధోని రిటైర్మెంట్ వ్యవహారం అభిమానుల్ని మళ్లీ మళ్లీ ఉత్కంఠకు గురి చేస్తూనే ఉంది. వన్డే ప్రపంచకప్ అవ్వగానే మహి అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెబుతాడనే ప్రచారం ఎప్పట్నుంచో ఉండగా.. అతను ఆ టోర్నీ తర్వాత ఏ విషయం తేల్చట్లేదు. మ్యాచ్‌లూ ఆడట్లేదు. రిటైర్మెంట్ ప్రకటనా చేయట్లేదు. వెస్టిండీస్ పర్యటనకు దూరంగా ఉన్న ధోని.. దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లోనూ ఆడట్లేదు. ఈ సందిగ్ధ స్థితిలో ఎప్పటికప్పుడు మహి రిటైర్మెంట్ గురించి ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా మరోసారి ఈ వ్యవహారం చర్చల్లోకి వచ్చింది. ఈ ప్రచారానికి కారణమైంది టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీనే. గురువారం ఉదయం అతను 2016 టీ20 ప్రపంచకప్‌లో ఓ మ్యాచ్‌కు సంబంధించిన ఫొటోను ట్విటర్లో పోస్ట్ చేశాడు. ఆ మ్యాచ్‌లో ఫిట్‌నెస్ పరీక్ష కోసం పరుగెత్తించినట్లుగా ధోని తనను పరుగెత్తించాడన్నాడు. ఆ రాత్రి ప్రత్యేకమని, ఆ మ్యాచ్‌ను ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నాడు. ఉన్నట్లుండి ఈ ఫొటో పెట్టడం, అందులో ధోనికి మోకాళ్లపై కూర్చుని బ్యాటుతో అభివాదం చేస్తుండటం.. ఇదంతా చూసి అభిమానులకు సందేహాలు కలిగాయి. ఇంతలోనే గురువారం రాత్రి 7 గంటలకు ధోని విలేకరుల సమావేశం నిర్వహిస్తాడని, రిటైర్మెంట్ ప్రకటన చేస్తాడని ఓ వార్త బయటికొచ్చింది. ఇది కొన్ని గంటల్లోనే పెద్ద చర్చనీయాంశంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో ధోని అభిమానులు పెద్ద ఎత్తున స్పందించారు. ఉద్వేగంతో అతనే సందేశాలు పెట్టారు. కానీ చివరికి ఈ విలేకరుల సమావేశం ముచ్చట ఉత్తిదే అని తేలింది. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు జట్టును ప్రకటించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడిన భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్.. బోర్డుకు, తమకు రిటైర్మెంట్ గురించి ధోని ఏ సమాచారం ఇవ్వలేదని, ప్రచారంలో ఉన్న వార్త అబద్ధమని తేల్చాడు. కాసేపటికే ధోని భార్య సాక్షి మరింత స్పష్టతనిచ్చింది. 'వీటినే ఊహాగానాలు అంటారు' అంటూ ఆమె ట్వీట్ చేయడంతో ప్రచారానికి పూర్తిగా తెరపడింది. ధోని అభిమానులు హమ్మయ్య అనుకుని ఎవరి పనుల్లో వాళ్లు పడిపోయారు.

ఒలింపిక్స్ స్వర్ణం కోసం ఖాళీ ఉంచా

దిల్లీ

ఒలింపిక్స్ స్వర్ణం కోసం తన పతకాల మధ్య ఖాళీ స్థలం ఉంచానని ప్రపంచ ఛాంపియన్ పీవీ సింధు అంది. వచ్చే టోక్యో 2020 ఒలింపిక్స్‌లో పసిడి గెలవాలనే పట్టుదలతో ఉన్నట్లు తెలిపింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో విజయం గతంలో ఎదురైన చాలా ఓటముల తాలూకు గాయాలను మాన్పిందని.. అయితే రియో ఒలింపిక్స్ ఫైనల్లో పరాజయం మాత్రం ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటుందని చెప్పింది. "ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణం ద్వారా అన్నింటికి సమాధానం దొరికింది. నాకు ఫైనల్ ఫోబియా ఉందంటూ జనాలు ఏవో మాట్లాడారు. వాటికి రాకెట్‌తోనే బదులిచ్చా. ఒలింపిక్స్ ప్రత్యేకమైనవి. రియో ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ భిన్నమైన జ్ఞాపకాలను మిగిల్చాయి. ఒక పసిడి దూరమైంది. వచ్చే ఒలింపిక్స్‌లో దాన్ని సొంతం చేసుకోవడానికి కృషిచేస్తా. నా పతకాల మధ్యలో ఆ స్వర్ణం కోసం ఖాళీ స్థలం ఉంచా. ఒలింపిక్స్ అర్హత ప్రక్రియ మొదలైన నేపథ్యంలో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో విజయం నా ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆ మెగా క్రీడల కోసం ప్రత్యేకంగా సిద్ధమవ్వాలి. నా కోసం కోచ్ కిమ్ ప్రత్యేక పద్ధతులు రూపొందించింది. అవి నా ఆటతీరు మెరుగవడంలో తోడ్పడుతున్నాయి. అయినప్పటికీ కొత్త టెక్నిక్‌లు నేర్చుకోవాలి. నెట్ దగ్గర ఆడడంపై దృష్టిపెట్టాలి" అని సింధు వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఐదో స్థానంలో ఉన్న సింధు వచ్చే ఒలింపిక్స్‌కు దాదాపు అర్హత సాధించినట్లే.

సింధుకు పద్మభూషణ్!

- మేరీకోమ్‌కు పద్మవిభూషణ్
- ప్రతిపాదించిన క్రీడల మంత్రిత్వ శాఖ

దిల్లీ

ఇటీవలే ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన స్టార్ షట్లర్ పుసర్ల వెంకట సింధు దేశంలో మూడో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్ అవార్డు రేసులో నిలిచింది. ఆమె పేరును క్రీడల మంత్రిత్వ శాఖ ఈ అవార్డుకు ప్రతిపాదించింది. 2017లోనే సింధు పేరును ఈ పురస్కారానికి ప్రతిపాదించగా.. తుది జాబితాలో ఆమె చోటు దక్కించుకోలేకపోయింది. 2015లో ఈ తెలుగమ్మాయి పద్మశ్రీ సాధించింది. సింధుతో పాటు మరో తొమ్మిదిమంది పేర్లను కూడా క్రీడల శాఖ వివిధ అవార్డులకు ప్రతిపాదించింది. ఆరుసార్లు మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ మేరీకోమ్ పేరును పద్మవిభూషణ్ జాబితాలో చేర్చారు. 2013లో పద్మభూషణ్ సాధించిన ఆమె.. 2006లో పద్మశ్రీ దక్కించుకుంది. వినేశ్ ఫొగాట్ (రెజ్లింగ్), మనిక బాత్రా (టేబుల్ టెన్నిస్), హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), రాణి రాంపాల్ (హాకీ), సుమ షిరూర్ (షూటింగ్), తషి, నుంగ్‌షి మలిక్ (పర్వతారోహణ) పద్మశ్రీ అవార్డు జాబితాలో ఉన్నారు. వీళ్లతో పాటు ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్, హాకీ ఒలింపియన్ ఎంపీ గణేశ్ కూడా పద్మశ్రీ రేసులో నిలిచారు. ముందు ఏడుగురు అమ్మాయిలను మాత్రమే ఈ అవార్డులకు ప్రతిపాదించిన క్రీడల శాఖ.. ఆఖర్లో తరుణ్‌దీప్, గణేశ్ పేర్లను జాబితాలో చేర్చింది. 1972 ఒలింపిక్స్ హాకీలో కాంస్యం గెలిచిన భారత జట్టులో గణేశ్ సభ్యుడు. 1971, 73 ప్రపంచకప్‌లో కంచు గెలిచిన జట్టులోనూ అతను ఉన్నాడు. ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో రజతం సాధించిన భారత జట్టులో తరుణ్‌దీప్ రాయ్ సభ్యుడు. ఈ జాబితాను క్రీడల మంత్రి ఆమోదం తర్వాత అవార్డుల కమిటీకి పంపుతారు. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం రోజు అవార్డు గ్రహీతలను ప్రకటిస్తారు.

గురువారం దిల్లీలోని జైట్లీ స్టేడియంలో సైని, కోహ్లి, ధావన్, పంత్

కోట్లా కాదు ఇక జైట్లీ స్టేడియం

దిల్లీ: దిల్లీలోని ఫిరోజ్ షా కోట్లా స్టేడియం పేరు మారింది. దివంగత కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ పేరును ఈ స్టేడియానికి పెట్టారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం ఈ స్టేడియానికి కొత్తగా నామకరణం చేశారు. దిల్లీ క్రికెట్ సంఘానికి జైట్లీ చేసిన సేవలకు గుర్తింపుగా స్టేడియం పేరు మార్చారు. మరోవైపు కోట్లా స్టేడియంలోని కొత్త పెవిలియన్ స్టాండ్‌కు భారత క్రికెట్ కెప్టెన్ విరాట్ కోహ్లి పేరు పెట్టారు. ఈ కార్యక్రమంలో జైట్లీ కుటుంబ సభ్యులతో పాటు క్రీడల మంత్రి కిరెన్ రిజుజు, మాజీ క్రీడల మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాఠోడ్ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌లో సౌరభ్ వర్మ

హో చిన్ మిన్ సిటీ (వియత్నాం): వియత్నాం ఓపెన్‌లో భారత షట్లర్ సౌరభ్ వర్మ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్స్‌లో రెండో సీడ్ సౌరభ్ 25-23, 24-22 తేడాతో యు ఇగరాషి (జపాన్)పై విజయం సాధించాడు. టోర్నీలో సిరిల్ వర్మ, శుభంకర్ డేల కథ ముగిసింది. ప్రి క్వార్టర్స్‌లో సిరిల్ 12-21, 15-21తో లీ లాన్ జి (చైనా) చేతిలో, శుభంకర్ 11-21, 17-21తో జియా వీ (మలేషియా) చేతిలో ఓడారు.

భారత్-ఎ ఘనవిజయం

తిరువనంతపురం: దక్షిణాఫ్రికా- ఎ జట్టుతో తొలి అనధికార టెస్టు మ్యాచ్‌లో భారత- ఎ ఏడు వికెట్ల తేడాతో విజయం సొంతం చేసుకుంది. మూడోరోజు వర్షం వల్ల వాయిదా పడ్డ గెలుపు.. నాలుగో రోజు తొలి సెషన్‌లో భారత పశమైంది. ఓవర్‌నైట్ స్కోరు 179/9తో గురువారం ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా మరో ఏడు పరుగులు మాత్రమే జోడించి వికెట్ కోల్పోయింది. అనంతరం 48 పరుగుల ఛేదనలో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ మొదట్లో తడబడింది. లుంగి ఎంగిడి (2/22) చెలరేగడంతో జట్టు ఓ దశలో 37/3తో నిలిచింది. రికీ భుయ్ (20 నాటౌట్), శివమ్ దూబె (12 నాటౌట్) జట్టును గెలిపించారు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా-ఎ 164, భారత్-ఎ 303 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే.

మనీష్ శుభారంభం

ఎక్తరీన్‌బర్గ్ (రష్యా): ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్ మనీష్ కౌశిక్ శుభారంభం చేశాడు. గురువారం జరిగిన 63 కేజీల విభాగం తొలి రౌండ్లో మనీష్ 5-0తో ఎన్రిక్ లుక్రూజ్ (నెదర్లాండ్స్)ను చిత్తు చేశాడు. ఈ టోర్నీలో బ్రిజేశ్ యాదవ్ (81 కేజీలు) ఇప్పటికే రెండో రౌండ్ చేరాడు. ఆసియా ఛాంపియన్ అమిత్ ఫంగాల్ (512 కేజీలు), కవీందర్‌సింగ్ బిస్త్ (57 కేజీలు), ఆశిష్ కుమార్ (75 కేజీలు)లకు తొలి రౌండ్లో బై లభించింది.

రాహుల్ కెప్టెన్సీ ఓటి

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు భారత్ జట్టు

అనుకున్నదే జరిగింది.. లెక్కకు మించి అవకాశాలిచ్చినా.. సద్వినియోగం చేసుకోలేకపోతున్న ఓపెనర్ కేఎల్ రాహుల్‌పై వేటు పడింది. దక్షిణాఫ్రికాతో మూడు టెస్టుల సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో రాహుల్ చోటు కోల్పోయాడు. అతడిపై వేటు పడటంతో ఈ సిరీస్‌లో రోహిత్ శర్మ ఓపెనర్‌గా రాబోతున్నట్లు తేలిపోయింది. చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. మరోవైపు మంచి ఫామ్‌లో ఉన్న పంజాబ్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌కు తొలిసారి టెస్టులు ఆడే అవకాశం లభించింది.

- ఓపెనర్‌గా రోహిత్‌కు అవకాశం
- శుభ్‌మన్‌కు పిలుపు

దిల్లీ

కేఎల్ రాహుల్‌పై వేటు పడింది. గత నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 25.25 సగటుతో 101 పరుగులే చేయగలిగిన ఈ ఓపెనర్‌కు టెస్టు జట్టు నుంచి సెలక్టర్లు ఉద్వాసన పలికారు. ఎమ్మెస్కే ప్రసాద్ సారథ్యంలో గురువారం సమావేశమైన సెలక్షన్ కమిటీ దక్షిణాఫ్రికాతో అక్టోబర్ 2న ప్రారంభం కానున్న మూడు టెస్టుల సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును ఎంపిక చేసింది. 20 ఏళ్ల పంజాబ్ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ ఎంపిక ఈసారి సెలక్షన్‌లో ప్రత్యేకత. ఇటీవల వెస్టిండీస్ పర్యటనలో భారత్-ఎ తరపున అద్భుత ప్రదర్శన చేసిన గిల్.. టెస్టుల్లో స్థానం సంపాదించుకున్నాడు. అవకాశాలు వస్తున్నా వాడుకోలేకపోతున్న రోహిత్‌శర్మకు ఓపెనర్‌గా పరీక్షించి చూడాలని సెలక్టర్లు నిర్ణయించారు. రాహుల్‌తో పాటు పేసర్ ఉమేశ్ యాదవ్ స్థానం కోల్పోయాడు. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు కూడా చోటు దక్కలేదు. ఈ నెల 26న విజయనగరంలో దక్షిణాఫ్రికాతో మూడు రోజుల మ్యాచ్‌లో తలపడే బోర్డు ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టుకు రోహిత్‌శర్మ సారథ్యం వహిస్తాడు. తొలి టెస్టు అక్టోబర్ 2న విశాఖపట్నంలో ఆరంభం కానుండగా.. 10న పుణెలో రెండో టెస్టు, 19న రాంచిలో మూడో టెస్టు మొదలవుతాయి.

భారత టెస్టు జట్టు: కోహ్లి (కెప్టెన్), మయాంక్, రోహిత్, పుజారా, రహానె, విహారి, పంత్, సాహా, అశ్విన్, జడేజా, కుల్‌దీప్, షమి, బుమ్రా, ఇషాంత్, శుభ్‌మన్ గిల్

బోర్డు ప్రెసిడెంట్స్ ఎలెవన్: రోహిత్ (కెప్టెన్), మయాంక్, ప్రియాంక్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, సిద్ధేశ్ లాడ్, కె.ఎస్.భరత్, జలజ్ సక్సేనా, ధర్మేంద్రసింగ్ జడేజా, అవేశ్‌ఖాన్, ఇషాన్ పొరెల్, శార్దుల్ ఠాకూర్, ఉమేశ్ యాదవ్.

"రోహిత్‌కు టెస్టుల్లో ఓపెనింగ్ చేసే అవకాశం ఇవ్వాలని భావిస్తున్నాం. చాలా ఏళ్లుగా వన్డేలు, టీ20ల్లో ఓపెనర్‌గా రాణిస్తున్నాడు. ఆ జోరును అతను టెస్టులకు ఎలా మళ్లిస్తాడో చూడాలి. గిల్‌ను ఓపెనర్‌గానే కాక మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌గా పరిగణిస్తున్నాం. గిల్ ఆడుతున్న కొద్దీ అవకాశాలు వస్తుంటాయి. రాహుల్ ప్రతిభావంతుడు. కానీ ప్రస్తుతం ఫామ్‌లో లేడు. అతనికి చాలా అవకాశాలు వచ్చాయి. సొంతగడ్డపై హార్దిక్ పాండ్య టెస్టుల్లో సరిపోడు. టెస్టుల్లో మూడో పేసర్‌కు అవకాశం ఉండదు కాబట్టే ఉమేశ్‌ను ఎంపిక చేయలేదు"

– ఎమ్మెస్కే ప్రసాద్

యాషెస్ ఐదో టెస్టు

విజృంభించిన మిచెల్ మార్ష్

ఇంగ్లాండ్ 271/8

ఓవల్: యాషెస్ సిరీస్‌లో చివరిదైన ఐదో టెస్టులో తొలి రోజు ఇంగ్లాండ్ తడబడింది. పేసర్ మిచెల్ మార్ష్ (4/35) విజృంభించడంతో గురువారం ఆట ఆఖరికి ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 271/8 స్కోరు చేసింది. ఒక దశలో ఆసీస్ 205 పరుగులకే 7 వికెట్లు కోల్పోయినా.. జోస్ బట్లర్ (64 బ్యాటింగ్; 84 బంతుల్లో 6×4, 3×6) పోరాడి ఆ జట్టును తక్కువ స్కోరుకే ఆలౌట్ కాకుండా చూశాడు. ఆర్చర్ (9)తో ఎనిమిదో వికెట్‌కు 21 పరుగులు, లీచ్ (10 నాటౌట్)తో అబేధ్యమైన తొమ్మిదో వికెట్‌కు 45 పరుగులు జత చేసిన బట్లర్.. ఇంగ్లాండ్‌ను ఆదుకున్నాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 27 పరుగులకే తొలి వికెట్ కోల్పోయినా.. బర్న్స్ (47), రూట్ (57) రాణించడంతో 103/1తో మెరుగ్గా కనిపించింది. అయితే మార్ష్‌తో పాటు కమిన్స్ (2/73), హాజిల్‌వుడ్ (2/76) విజృంభించడంతో ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ వరుస కట్టారు. టీ విరామానికి 169/3తో నిలిచిన ఇంగ్లిష్ జట్టు.. ఆ ఒక్క సెషన్లోనే 5 వికెట్లు కోల్పోయింది. సిరీస్‌లో ఆసీస్ 2-1 ఆధిక్యంతో ఉన్న సంగతి తెలిసిందే.

క్లిజ్‌స్టర్స్ మళ్లీ వస్తోంది

బ్రసెల్: మాజీ నంబర్‌వన్ టెన్నిస్ క్రీడాకారిణి కిమ్ క్లిజ్‌స్టర్స్ మళ్లీ కోర్టులో అడుగుపెట్టనుంది. 2007లో తొలిసారి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించి, రెండేళ్ల తర్వాత తిరిగి బరిలో నిలిచిన ఆమె.. 2012లో మరోసారి ఆటకు వీడ్కోలు పలికింది. ఇప్పుడు ఏడేళ్ల తర్వాత మళ్లీ టెన్నిస్ ఆడతానంటోంది. వచ్చే ఏడాది కోర్టులో దిగుతానని 36 ఏళ్ల బెల్జియం క్రీడాకారిణి వెల్లడించింది. ముగ్గురు పిల్లలకు తల్లైన క్లిజ్‌స్టర్స్ వారి కోసమే ఆటకు దూరమైంది. "ఏడేళ్లుగా పూర్తి సమయం అమ్మగా బాధ్యతలు నిర్వర్తించా. దాంతో పాటు టెన్నిస్ క్రీడాకారిణిగా కూడా ఉండడం నాకెంతో ఇష్టం. 2020లో మిమ్మల్ని కోర్టులో కలవబోతున్నా" అని క్లిజ్‌స్టర్స్ తెలిపింది. ఆమె యుఎస్ ఓపెన్‌లో మూడుసార్లు, ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఒకసారి విజేతగా నిలిచింది.

పర్దీప్ జోరు.. పట్నా హుషారు

జైపుర్‌పై పైరేట్స్ విజయం

కోల్‌కతా: ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న పట్నా పైరేట్స్ కెప్టెన్ పర్దీప్ మరోసారి చెలరేగి జట్టుకు విజయాన్ని అందించాడు. అతను 14 పాయింట్లతో సత్తాచాటడంతో గురువారం జరిగిన మ్యాచ్‌లో పట్నా 36-33 తేడాతో జైపుర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. పర్దీప్‌తో పాటు జూంగ్ కున్ లీ (8), నీరజ్ కుమార్ (6) రాణించారు. జైపుర్ తొలి అర్ధభాగం ముగిసేసరికి 15-14తో ఒక పాయింట్ ఆధిక్యం సాధించింది. విరామం తర్వాత 19-15తో నిలిచింది. అక్కడి నుంచి జూంగ్ కున్ లీ దూకుడు మొదలైంది. పర్దీప్‌తో కలిసి అతను రైడింగ్ వేట కొనసాగించడంతో ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన పట్నా 28వ నిమిషంలో 23-24తో ఆధిక్యాన్ని తగ్గించింది. మరో నాలుగు నిమిషాల్లో మ్యాచ్ ముగుస్తుందనగా 30-30తో మరోసారి స్కోరు సమం కావడంతో ఉత్కంఠ రేగింది. కానీ పర్దీప్ వరుస పాయింట్లతో జట్టుకు ఆధిక్యాన్ని అందించాడు. చివరి నిమిషంలో 35-32తో నిలిచిన పట్నా ఆఖరు క్షణం వరకు ఆధిక్యాన్ని కాపాడుకొని మ్యాచ్ సొంతం చేసుకుంది. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

Mahindra
Rise.

మనం కనక కలిసి ఎంచుకుంటే సరైనది ఎంచుకుంటాం.

కుటుంబంలో అందరూ కలిసి నిర్ణయం తీసుకుంటే జరిగే గొప్ప విషయం ఏమిటంటే, వారి ద్వారా తీసుకోబడిన నిర్ణయం ఎల్లప్పుడూ సరైనదై ఉంటుందని నిరూపించబడింది. మరి అందరూ కలిసి, ఒక కారుని ఎంచుకునే విషయం వస్తే, మరాజ్జో మీకు అన్నిటికన్నా సరైన కారని మీరు చూస్తారు. ఎందుకంటే, దీనిలో ఉంది విశాలమైన చోటు, సాటిలేని సురక్షత, స్మూద్ ప్రయాణం ఇంకా తన శ్రేణిలో అన్నిటికన్నా కూల్ ఐన, శాంతిపూర్వకమైన క్యాబిన్. అయితే ఇప్పుడు మరాజ్జోని ఇంటికి తీసుకురండి, ఇక అందరితో కలిసి ప్రయాణం చేసే ఆనందం అనుభవించండి.

భారతదేశంలో అన్నిటికన్నా సురక్షితమైన ఎంపివి, 4-స్టార్ GNCAP రేటింగ్‌తో పాటు | అత్యుత్తమమైన స్మూద్ రైడ్
తన శ్రేణిలో అన్నిటికన్నా నిశ్శబ్దమైన క్యాబిన్# | అన్నిటికన్నా త్వరగా కూల్ అయ్యే క్యాబిన్^
తన శ్రేణిలో అన్నిటికన్నా విశాలమైన చోటు*

ఉత్తేజకరమైన పండుగ ఆఫర్లను పొందేందుకై, మీకు దగ్గరలో ఉన్న మహీంద్రా డీలర్‌షిప్ వద్దకు రండి.

5 సంవత్సరాల స్టాండర్డ్ వారంటీ | ₹ 11,111ల ఆకర్షణీయమైన ఇఎంఐ

Mahindra with you hamesha 1800-209-6006 | 488 అధీకృత వర్క్‌షాప్‌లు 350 నగరాలలో | 24-గంటలూ రోడ్-సైడ్ సహాయం**

Mahindra First Choice XMart EXCHANGE OR BUY. WITH TRUST. | ₹40,000/- వరకు ఆకర్షణీయమైన ఎక్స్‌ఛేంజ్ ప్రయోజనం

CHOOSE TOGETHER. CHOOSE RIGHT.

MARAZZO

క్లాస్ అంటే ఇతర డీజెల్ MPVలు అని నిర్వచించబడింది. #ఇంజన్ ఐడిల్‌గా ఉన్నప్పుడు డ్రైవర్ చెవి దగ్గర 43dB. ^ఎయిర్ స్పీడ్ 36m/s. *బోల్డర్ రూమ్ 1వ మరియు 2వ వరుసలలో మరియు లెగ్ రూమ్ 3వ వరుసలో. షరతులు, నిబంధనలు వర్తిస్తాయి. వెహికల్ రంగు చూపబడిన చిత్రాల కన్నా వేరుగా ఉండవచ్చు. **మొదటి సంవత్సరానికై.

VVC MOTORS: KHAMMAM, KOTHAGUDEM: 8929207468; SANSAI AUTO SERVICES PVT. LTD: NALGONDA, SURYAPET, MIRYALGUDA: 8448005424; MOTORLINE AUTO PVT. LTD: KARIMNAGAR: 8929648015; MOTORLINE AUTO PVT. LTD.: WARANGAL: 8929207463; AUTOMOTIVE MANUFACTURERS PVT. LTD.: NIZAMABAD, NIRMAL, KAMAREDDY: 8929207456; AUTOMOTIVE MANUFACTURERS PVT. LTD: MANCHERIAL, ADILABAD: 8929207456; AUTOMOTIVE MANUFACTURERS PVT. LTD: MEDAK, SANGAREDDY: 8328505055; AUTOMOTIVE MANUFACTURERS PVT. LTD.: MAHABOOBNAGAR, NARAYANPET, GADWAL: 8790091548

1124338TEL